అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 10-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 3 సంచిక : 223 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 16 పేజీలు వెల : 5.00



శ్రీరాం సాగర్‌కు పునరుజ్జీవం
16 లక్షల ఎకరాలకు పచ్చని పంటల వరం

నీటి పారుదల శాఖ
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము

తెలంగాణ వర ప్రదాయిని అయిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టును గత పాలకులు వట్టిపోయేలా చేశారు. చివరి ఆయకట్టు దాకా నీరందిన చరిత్ర లేనే లేదు. పంట పండింది లేదు. కడుపు నిండింది లేదు. ప్రాజెక్టు ఉండీ లేని సమానమైంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు దార్శనికతతో భవిష్యత్ అవసరాలు తీర్చే విధంగా శ్రీరాంసాగర్ కు తిరిగి పునరుజ్జీవనం ఇచ్చే సృజనాత్మక పథకానికి ఆకృతినిచ్చారు.



ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవ పథకం

పధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి ఒక్క చుక్క నీరు రాకున్నా సరే.. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళ ఉట్టిపడేలా రూ.2వేల కోట్లతో ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవం పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రాణహిత ద్వారా గోదావరికి వచ్చి చేరుతున్న నీటిని మేడిగడ్డ నుంచి తోడి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి మళ్లిస్తారు. మేడిగడ్డ నుంచి గోదావరి నీటిని ఎల్లంపల్లి, ఎస్.ఆర్.ఎస్.పి. వరద కాలువ, మిడ్ మానేరు, లోయర్ మానేరుకు తరలిస్తారు.

వరదకాలువను జలాశయంగా మారుస్తారు. అన్ని కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతారు. ఎస్.ఆర్.ఎస్.పి. కాలువల్లో నిరంతరం నీరు పారేలా, అన్ని చెరువులను నింపేలా పథకం.

గౌరవ ముఖ్యమంత్రి

శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

గారి చేతుల మీదుగా లక్షలాది మంది రైతుల ఆనందోత్సాహాల నడుమ...

నేడే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం శంఖుస్థాపన

స్థలం: ఎస్.ఆర్.ఎస్.పి., పోచంపాడు గ్రామం, నిజామాబాద్ జిల్లా
తేది: 10 ఆగస్టు 2017, సమయం: ఉదయం 11 గంటలు,
బహిరంగ సభ: మధ్యాహ్నం 12 గంటలు



గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారితో నీటి పారుదల శాఖామాత్యులు, శ్రీ తన్నీరు హరీష్‌రావు గారు

గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతంలో ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టి తెలంగాణ నేలను తడిపేలా ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. గత పాలకులు తెలంగాణను వంచిస్తూ లోపభూయిష్టంగా చేసిన డిజైన్లను మార్చి తెలంగాణ అవసరాలకు తగినట్టు రీ డిజైన్ చేసిండు మన ముఖ్యమంత్రి కేసీఆర్.

తీరుతున్నది మన రైతుల నీటి కల - తెలంగాణ నేలంతా ఇక అపూర్వ జలకళ

ఏడు జిల్లాలకు వర ప్రదాయిని కాళేశ్వరం ఎత్తిపోతల పథకం: పాత కరీంనగర్, వరంగల్,మెదక్, నల్గొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు... శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు జలాశయాల కింద ఉన్న మరో 18 లక్షల ఎకరాలను స్థిరీకరించడం... దారి పొడుగున ఉన్న వందలాది గ్రామాలకు, హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించే బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. వచ్చే ఏడాది నుంచే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు గోదావరి నీరు అందుతుంది.

వలసలు ఆపే కల్పతరువు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు: మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పథకం.

శరవేగంగా పూర్తవుతున్న ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు : పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, జీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి శరవేగంగా పూర్తి చేయడం వల్ల 8లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వెసులుబాటు కలిగింది.

నల్గొండ ఫ్లోరైడ్ బాధలు తీర్చి బతుకునిచ్చే డిండి ఎత్తిపోతలు: పాత నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు.

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు : పాత ఖమ్మం జిల్లాలో 3.87 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టుకు, 6.44 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉద్దేశించిన పథకం.

ఆదిలాబాద్ పొలాలకు ప్రాణం పోసే ప్రాణహిత ఎత్తిపోతల పథకం : ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు ప్రాణహిత నది నుంచి సాగునీరు అందించే పథకం

తుపాకుల గూడెం బ్యారేజితో దేవాదులకు నిరంతర నీరు: గోదావరి నదిపై తుపాకుల గూడెం వద్ద బ్యారేజి నిర్మించడం వల్ల దేవాదుల ఎత్తిపోతల పథకం పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

పాలేరు బతుకులు పండించే భక్త రామదాసు ఎత్తిపోతల పథకం : రికార్డు స్థాయిలో 11 నెలల్లోనే పూర్తయి కరువు పీడిత పాలేరు నియోజకవర్గంలో 59వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పథకం.

మిషన్ కాకతీయతో మారిన పల్లె వాతావరణం: సమైక్య పాలనలో శిథిలమైన 46వేల చెరువులను పునరుద్ధరించే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతున్నది. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలమట్టం పెరిగింది. పూడిక మట్టి పోసుకోవడంతో పొలాల్లో భూసారం పెరిగింది. చెరువుల్లో జలకళ ఉట్టి పడడంతో పల్లెల వాతావరణమే మారిపోయింది. చేపల పెంపకానికీ ఉపయోగపడింది. రెండు దశల్లో అమలు అయిన మిషన్ కాకతీయ ఫలితంగా గత ఖరీఫ్, రబీ పంట కాలంలో రికార్డు స్థాయిలో చెరువుల కింద 15 లక్షల ఎకరాలకు సాగు నీరు అందింది.

సాగునీటి రంగంలో మూడేళ్లలో సాధించిన మరిన్ని విజయాలు

• ఎస్.ఆర్.ఎస్.పి. స్టేజ్ 2 పనులు పూర్తి చేయడం ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు • నాగార్జున సాగర్ లో లెవల్ కెనాల్ పనులు పూర్తి చేయడం ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు • ఉదయ సముద్రం పనులు పూర్తి చేయడంతో లక్ష ఎకరాలకు సాగునీరు • దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడం ద్వారా లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు • శ్రీపాద సాగర్-ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం ద్వారా 1.78 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు • కడెం పథకం కింద 30వేల ఎకరాలు, మంథని ఎత్తిపోతల పథకం కింద 7వేల ఎకరాలు స్థిరీకరణ. • లోయర్ పెన్ గంగ ద్వారా 37వేల ఎకరాలకు, చనాఖా-కొరాట బ్యారేజి నిర్మాణం ద్వారా 13,500 ఎకరాలకు సాగునీరు • సింగూరు ప్రాజెక్టు కాల్వల నిర్మాణం ద్వారా 40వేల ఎకరాలకు సాగునీరు • మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టులైన నీల్వాయి, ర్యాలి వాగు, గొల్లవాగు, పెద్ద వాగు, కొమురంభీమ్, మత్తడి వాగు, గడ్డెన్న-సుద్దవాగు, కిన్నెరసాని కెనాల్, పాలెం వాగు, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయడం ద్వారా దాదాపు లక్షా 50వేల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితులు ఏర్పడినాయి.

కోటికి పైగా ఎకరాలకు నిరంతరం సాగునీరు-ఇక ఏ రైతు కంట పొంగదు కన్నీరు

జారీ చేయువారు: కమీషనర్ సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

నా బిడ్డ ఏమయ్యాడో..!

- సీబీఐ కార్యాలయం ఎదుట నజీబ్ తల్లి ఆవేదన

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ముఖ్య కార్యాలయం ఎదుట జేఎన్‌యూలో అదృశ్యమైన విద్యార్థి నజీబ్ తల్లి.. కొందరు విద్యార్థులతో కలిసి ధర్నాకు దిగారు. తన బిడ్డను వెతకాలంటూ ఆఫీసు గేటు ముందు ఆమె నిరసన చేపట్టారు. గతేడాది అక్టోబర్ 15 నుంచి నజీబ్ అదృశ్యమయ్యాడు. ఏబీవీపీ విద్యార్థి నేతలతో గొడవపడ్డాక ఆయన కనిపించటంలేదని బంధువులు, జేఎన్‌యూ విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. నజీబ్ అదృశ్యంపై సీబీఐ దర్యాప్తు తీరును హైకోర్టు తప్పుపట్టింది. ఈ కేసు దర్యాప్తునకు డీఐజీ ర్యాంకు కన్నా తక్కువ స్థాయి అధికారులను నియమించవద్దని కోర్టు స్పష్టం చేసింది. నజీబ్ ఆచూకీ తెలిపిన వారికి రూ.పది లక్షలు బహుమానం ఇస్తామని పోలీసులు ప్రకటించినా.. ఇంతవరకూ అతని జాడ కనిపించలేదు. బిడ్డ గురించి దశలవారీగా పోరాటం చేస్తున్న నజీబ్ తల్లి మరోసారి సీబీఐ ప్రధాన కార్యాలయం ముందు బైటాయించి.. ఆందోళన వ్యక్తం చేశారు.

వేధింపులను ప్రతిఘటిస్తే చంపేశారు

- యూపీలో విద్యార్థినిపై దుర్మార్గుల ఘాతుకం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకున్నది. లైంగిక వేధింపులను ప్రతిఘటించిన విద్యార్థినిని కొందరు దుర్మార్గులు అతి కిరాతకంగా హత్య చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాజా గ్రామానికి చెందిన రజిని దుబే(17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. కాగా.. మంగళవారం ఆమె కాలేజీకి సైకిల్‌పై వెళ్తున్నారు. ఇంతలో రెండు బైకులపై వచ్చిన ఐదుగురు యువకులు.. ఆ విద్యార్థినిని అడ్డగించి వేధించడం మొదలుపెట్టారు. వారిని బాలిక తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో కోపోద్రిక్తులైన వారు..ఆమెను కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న దుబే తల్లిదండ్రులు ఘటనా స్థలికి చేరుకొని బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే చనిపోయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. దుబేను ఆ దుర్మార్గులు కొంతకాలంగా వేధిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుల కోసం గాలిస్తున్నారు.

పుల్వామాలో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురుఉగ్రవాదులు హతమయ్యారు. జిల్లాలోని గులాబ్‌బాగ్‌లో ఉగ్రవాదులు తలదాచుకున్నారని నిఘావర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పోలీసులు సంయుక్తంగా బుధవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈక్రమంలో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. గడిచిన 11రోజుల్లో 14మంది ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టింది. అంతేకాక.. ఈనెల 5న ఐదుగురు చొరబాటుదారులు కూడా హతమయ్యారు. షోపియాన్ జిల్లాలో ఈనెల 3న జరిగిన ఎదురుకాల్పుల్లో ఆర్మీ మేజర్, జవాను ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.



రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ముంబయిలో మరాట్వాడాలు బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. వారి డిమాండ్లపై కమిటీని ఏర్పాటుచేస్తున్నట్టు మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ప్రకటించారు.

మోడీ సర్కార్..

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తోంది

- పని కల్పించాలి.. పూర్తి వేతనం ఇవ్వాలి
- భూమి లేని వారికి భూమి పంపిణీ చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం పార్లమెంట్ మార్చ్
- సీపీఐ(ఎం) ఎంపీల సంఘీభావం
- సీఐటీయూ, ఏఐకేఎస్ నేతల సంఘీభావం



సభలో ప్రసంగిస్తున్న ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ రాఘవన్

న్యూఢిల్లీ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూ యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.విజయ రాఘ వన్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల ఫలితంగా గ్రామీణ ప్రజా జీవనం చిన్నాభి న్నం అవుతోందని ఆరోపించారు. ఉపాధి హామీకి నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని మందలిస్తే తప్ప మోడీ సర్కార్ చలించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గుతోందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులపట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. బుధవారం నాడిక్కడ 'సేవ్ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్ఈజీఏ)' నినాదంతో వ్యవసాయ కార్మిక సంఘం పార్లమెంట్ మార్చ్ నిర్వహించింది. తొలిత రామ్‌లీల మైదానం వద్ద ప్రారంభమైన ర్యాలీ బారకంబా రోడ్డు, కన్నాట్ ప్లేస్ మీదుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుంది. ర్యాలీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. దారి పొడువున కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వ్యవసాయ కార్మికుల ఈ ఆందోళనకు సీపీఐ(ఎం) ఎంపీలు ఎ సంపత్, శ్రీమతి టీచర్, పికె బిజూ, రాజేష్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా, సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు జ్ఞాన శంకర్ మజుందర్‌లు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ మార్చ్‌ను ఉద్దేశించి ఎ.విజయ రాఘవన్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ తీరుతో దేశంలో పేదరికం పెరుగుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో మరింత దుర్భర జీవితాన్ని అనుభవిస్తో న్నారని అన్నారు. మోడీ నినాదం సబ్‌కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కార్పొరేట్ల కోసమే మోడీ నిరంతరం ఆలోచిస్తున్నారని, అత్యధి కులైన పేదల గురించి మాత్రం మొసలికన్నీరు కారుస్తున్నారని అన్నారు. గ్రామీణ సమాజంలో భూమి లేని వాళు అధికంగా ఉన్నారని, ప్రతి ఏడాది వీరి సంఖ్య పెరుగుతోందని వివరించారు. ఈ పరిస్థితు ల్లో గ్రామీణ భారతంలో ఉపాధి చాలా అవసరమని, అందుకు ప్రభుత్వం ప్రణాళికలు వేయాలని అన్నారు. దేశంలో వలసలు నియంత్రించేందుకు వామపక్షాల మద్దతుతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. వంద రోజుల పనిని కల్పించాల్సి ఉండగా, కేవలం ఒక కుటుంబానికి 37రోజులు మాత్రమే పనిని కల్పిస్తో న్నారని, అలాగే వారికిచ్చే వేతనాలు నామమాత్రంగా ఉన్నాయన్నారు.

కనీస వేతనానికి నోచుకోవడం లేదని అన్నారు. పని దినాలు పెంచాలని, కనీసం రూ.250 వేతనం ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ జాతీయ అధ్యక్షుడు ఎస్.తిరున వక్కురసు, జాతీయ సహాయ కార్యదర్శి సునీత్ చోప్రా, ఎన్.కె శుక్లా, తెలంగాణ ఏపి, ప్రధాన కార్యదర్శులు ఆర్.వెంకటరాములు, వి.వెంకటేశ్వర్లు, తెలంగాణ నేతలు వేదగిరి శ్రీను, పెద్ది వెంకట రమణ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మీరు... పాక్ మద్దతుదారులు

- మీడియాపై నోరుపారేసుకున్న బీజేపీ మంత్రి

పాట్నా : అధికారం చేతుల్లో ఉంది కదా అని.. బీజేపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్న వార్తలు ఒకటి తర్వాత ఒకటి వెలుగుచూస్తూనే ఉన్నాయి. తాజాగా బీహార్‌లో జేడీయూతో జతకట్టి ప్రభుత్వ భాగస్వామ్యంలో చేరిన బీజేపీ మంత్రి వివాదాస్ప వ్యాఖ్యలు చేశారు. సంకల్ప్ సమ్మేళన్ కార్యక్రమంలో విలేకరులనుద్దేశించి మంత్రి వినోద్ కుమార్... పాకిస్తాన్ మద్దతుదారులంటూ వ్యాఖ్యానించారు. జేడీ(యూ) ప్రభుత్వంలో బీజేపీ కోటా కింద వినోద్ గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రసంగిస్తూ మధ్యలో భారత్ మాతా కీ జై అంటూ నినదించారు. సమావేశంలో అందరినీ కోరస్ ఇవ్వాల్సిందిగా కోరారు. అక్కడి వారి స్పందనతో సంతృప్తిచెందని ఆయన... అదే నినాదాన్ని మరోసారి చేశారు. అక్కడే ఉన్న మీడియా ప్రతి నిధుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవటంతో అసహనానికి గురయ్యారు. ముందువరుసలో కూర్చున్న మీడి యా ప్రతినిధుల నుద్దేశించి.. 'కొంతమంది మాతో గొంతు కలపడంలేదు.. వారు పాకిస్తాన్ మద్దతుదారులు కారని ఆశిస్తున్నాను..' అంటూ నోరుజారారు.

'మసీదులు.. చర్చిల్లో భారత్ మాతాకీ జై నినాదాలు..'

మసీదుల్లో ఆజాన్, చర్చిల్లో గంటల శబ్దాలకు బదులు భారత్ మాతాకీ జై నినాదాన్ని వినిపించాలంటూ ఇదే కార్యక్రమంలో పాల్గొన్న బీహార్ బీజేపీ అధ్యక్షుడు నిత్యానంద్ రాయ్ నోరుపారేసుకున్నారు. అయితే కాసేపటికే తాను అలా అనలేదని పేర్కొన్నారు. ఇక ఇదే కార్యక్రమంలో బీహార్ బీజేపీ ఎమ్మెల్యే అశ్విన్ కుమార్ కూడా ఉన్నారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంలో లాలూ ప్రసాద్, నితీశ్‌పై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నితీశ్, లాలూ పాకిస్తాన్ వెళ్ళిపోవాలని డిమాండ్ చేశారు.

వారి వ్యక్తిగత అభిప్రాయాలు.. : తప్పించుకున్న జేడీయూ

కాగా, బీజేపీ నేతల వ్యాఖలపై ఆ పార్టీతో చేతులు కలిపిన జేడీయూ తప్పించుకునే ప్రయత్నం చేసింది. జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ దీనిపై స్పందిస్తూ... అది వారి వ్యక్తిగత అభిప్రాయాలని వ్యాఖ్యానించి ముఖం చాటేశారు.

వేధింపుల కేసులో బీజేపీ నేత తనయుడి అరెస్ట్

- ఎఫ్ఐఆర్‌లో కిడ్నాప్ అభియోగాలు

రాయ్‌పూర్ : లైంగిక వేధింపుల కేసులో పోలీసులు జారీచేసిన సమ్మన్లను తిరస్కరించిన చండీగఢ్ బీజేపీ నేత తనయుడు ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన నిందితుడు వికాస్, అతని స్నేహితుడిపై కిడ్నాప్ అభియోగాలు నమోదు చేసిన అనంతరం ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. ఇవి నాన్‌బెయిలబుల్ నేరాలు కావడం గమనార్హం. ఈ కేసులో అయిదు సీసీటీవీ కెమెరాల నుంచి ఫుటేజ్‌లను పోలీసులు సేకరించారు. వాటిని పరిశీలించిన పోలీసులు.. వికాస్ బాధితురాలి కారును వెంబడించి వేధింపులకు గురిచేసినట్లు ధ్రువీకరించారు.

ఇంట్లో కూర్చోపెట్టాల్సింది అమ్మాయిలను కాదు.. అబ్బాయిలనే..




'ఆడపిల్లకు అర్ధరాత్రి రోడ్డుపై పనేంటి.. ఆమె అంత రాత్రివేళ బయటకు ఎందుకొచ్చింది..' అంటూ బీజేపీ నేత కుమారుడిని వెనకేసు కొచ్చిన ఆ పార్టీ నేత రాంవీర్ భట్టిపై ఆ పార్టీ చండీగఢ్ ఎమ్మెల్యే కిరణ్ ఖేర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భట్టీ తన సహచరుడని చెప్పుకోవడానికే సిగ్గుగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ అమ్మాయి గురించి ఇలా మాట్లాడటానికి రాంవీర్‌కు నోరెలా వచ్చిందని విమర్శించారు. ఇంట్లో కూర్చోవాల్సింది అమ్మాయిలుకాదని, తప్పతాగిన వారిని రోడ్లపైకి వదలకూడదని, అలాంటి వారిని బయటకు రాకుండా ఇంట్లో కూర్చోపెట్టాలని కిరణ్ ఖేర్ వ్యాఖ్యానించారు. మరోవైపు భట్టీ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'మహిళలు అర్ధరాత్రి బయటకు ఎందుకు వెళ్ళకూడదని భట్టీ లాంటి వారిని నేను ప్రశ్నిస్తున్నాను. మా మీద కర్ఫ్యూ లాంటి నిషేధాజ్ఞలు విధించడానికి మీరెవరు? అసలు అలా చెప్పడానికి ఆయనెవరు?' అని కాంగ్రెస్ సోషల్ మీడియా సెల్ నేత స్పందన మండిపడ్డారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా ఆందోళన

నిందితుడిపై చర్యలు తీసుకోవాలని, కేసును నీరుగార్చే ప్రయత్నాలు మానుకోవాలని ఐద్వాడిమాండ్ చేసింది. ఐద్వా పంజాబ్, హర్యానా రాష్ట్ర శాఖల ఆధ్వర్యంలో చండీగఢ్‌లోని పంచకులలోని యవనిక్ గార్డెన్ సెక్టార్ 5 వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. అనంతరం ఐద్వా ప్రతినిధి బృందం బుధవారం ఉదయం బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యు లను ఆమె నివాసంలో కలుసుకుని పరామర్శించారు. నింది తులపై ఆమె చేస్తున్న పోరాటానికి తమ మద్దతుంటుందని ఆమెకు హామీ ఇచ్చారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఐద్వా ప్రతినిధి బృందం హర్యానా ముఖ్యమంత్రిని కలుసుకుని వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కేసులో నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని, నిందితులపై కిడ్నాప్ అభియోగాలను నమోదు చేయాలని, నిందితులపై నాన్‌బెయిలబుల్ వారెం ట్లు జారీ చేయాలని వినతి పత్రంలో ఐద్వా ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషి ణి అలీతో సహా జాతీయ కార్యదర్శి జగమతి సంగ్వాన్, హర్యానా శాఖ కార్యదర్శి సవిత, పంజాబ్ శాఖ కార్యదర్శి సుభాష్ మట్టూ తదితరులు ముఖ్యమంత్రిని కలుసుకుని వినతి పత్రం సమర్పించిన ప్రతినిధి బృందంలో ఉన్నారు.

సినిమా స్టైల్‌లో చేజ్ చేశాడు.. లైట్ తీసుకోవాలి గానీ.. కేసులేంటీ... మోడీ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



రాజకీయ దుమారం రేపుతున్న బీజేపీ నేత తనయుడి లైంగిక వేధింపుల కేసులో వివాదాస్ప వ్యాఖ్యలు చేస్తున్న ఆ పార్టీ నేతల జాబితాలో కేంద్ర మంత్రి చేరారు. ఈ ఘటనపై కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో సామాజిక మాధ్యమంలో వివాదాస్పద ట్వీట్లు చేశారు. 'హేతుబద్ధంగా ఆలోచించండి.. తాగిన మత్తులో.. సినిమా స్టైల్‌లో ఓ అమ్మాయిని అతడు ఛేజ్ చేశాడు. దానికి అతనిపై 'అపహరణ' అభియోగాలు ఎందుకు మోపుతున్నారు?' అని ప్రశ్నించారు. ఈవివాదంలో అతని తండ్రిని ఎందుకు లాగు తున్నారంటూ మరో పోస్టులో ప్రశ్నించారు. బీజేపీ నేత కుమారుడి వేధింపులపై మాట్లాడుతున్నవారు.. కేరళలో ఓ యువతిని హత్య చేసిన ఘటనపై, పశ్చిమబెంగాల్‌లో వృద్ధు రాలిపై (61)పై జరిగిన లైంగికదాడిపై ఎందుకు మాట్లాడ టంలేదని ప్రశ్నించారు.కాలేజీకి వెళ్ళిన అమ్మాయిల వెంట అబ్బాయిలు పడటం రీల్‌లైఫ్‌లో చూశాం. రియల్ లైఫ్‌లో కూడా అదిజరుగుతోందని అంగీకరించాలి' అని ట్వీట్ చేశారు.





బ్రిటన్ పౌరుల్లో బ్రెగ్జిట్‌పై అవగాహన లేదు

- లీసెస్టర్ వర్సిటీ పరిశోధకుల సర్వే

లండన్ : మెజారిటీ బ్రిటన్ పౌరుల్లో బ్రెగ్జిట్ (ఈయూ నుంచి బ్రిటన్ నిష్క్రమణ) అంశంపై కనీస అవగాహన లేదని లీసెస్టర్ వర్సిటీ పరిశోధకులు డాక్టర్ ఐహువా జాంగ్ అభిప్రాయపడ్డారు. గతేడాది జూన్23న బ్రిటన్ ప్రభుత్వం నిర్వహించిన అభిప్రాయసేకరణలో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటు నమోదు చేశారని అన్నారు. బ్రెగ్జిట్ అంశంపై సర్వే నిర్వహించామని అన్నారు. బ్రెగ్జిట్ అంశంపై ఓటింగ్‌కు ముందుగా అవగాహన కల్గించి ఉన్నట్టయితే బ్రెగ్జిట్ సాధ్యమయ్యేది కాదన్నారు. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగడంతో దేశ పౌరులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్య, ఉపాధి రంగాలపై బ్రెగ్జిట్ ప్రభావాన్ని కనబరుస్తున్నదని అన్నారు.

బ్రస్సెల్స్‌లో బాంబు కలకలం



బ్రస్సెల్స్ : బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో అతివేగంగా ప్రయాణించిన ఓ కారు కొన్ని గంటలపాటు కలకలం రేపింది. ఎరుపు రంగు లైట్ వేసుకుని రెండు చోట్ల వేరే వాహనాలను ఢీకొట్టిన ఆ కారు అత్యంత వేగంగా వెళ్లింది. వాహనాన్ని వెంబడించిన స్థానిక పోలీసులు కాల్పులు జరిపి కారును నిలువరించారు. కారు ఆగగానే వాహనంలో ఉన్న వ్యక్తి బయటకు వచ్చి లోపల విస్ఫోటక పదార్థాలు ఉన్నాయని చెప్పడంతో బాంబు నిర్వీర్య బృందాలతో దాదాపు మూడు గంటలు తనిఖీ చేయించారు. ఎలాంటి బాంబు కారులో లేదని అధికారులు చెప్పారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదన్నారు. గతేడాది మార్చిలో బ్రస్సెల్స్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 32 మంది మృతి చెందారు. ఈ నేపథ్యంలో బ్రస్సెల్స్ పోలీసులు ముమ్మర సోదాలు నిర్వహిస్తున్నారు.

చికాగోలో కాల్పుల కలకలం

వాషింగ్టన్: చికాగో నగరంలో కాల్పులు కలకలం రేపాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఓ యువకుడు మృతి చెందాడు. చికాగో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు సమీపంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నది. దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు.

అమెరికా బెదిరింపులకు భయపడం

- గువామ్ వైమానిక స్థావరంపై క్షిపణి ప్రయోగిస్తాం : ఉ.కొరియా

ప్యాంగ్‌యాంగ్: ఉత్తర కొరియా, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గువామ్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై మధ్యస్థాయి ఖండాంతర క్షిపణి ప్రయోగిస్తామని ఉత్తర కొరియా సైన్యం హెచ్చరించింది. కొరియా ద్వీపకల్పంలో బీ-1బీ అమెరికా బాంబర్ల సాయంతో దక్షిణ కొరియా, జపాన్ యుద్ధవిమానాలు చక్కర్లు కొట్టాయి. ఈనేపథ్యంలో ఉత్తరకొరియా సైన్యం పై విధంగా స్పందించింది. అమెరికా కవ్వింపు చర్యలను తిప్పిగొట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ' తమ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని అమెరికా కుట్ర పన్నింది. అందుకే, గువామ్ వైమానిక స్థావరంపై హ్వాసాంగ్-12 ఖండాంతర క్షిపణిని ప్రయోగించాలని యోచిస్తున్నాం. తమ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఆదేశాలు అందిన మరుక్షణమే క్షిపణిని ప్రయోగిస్తాం. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడం అగ్రరాజ్యానికి అలవాటైపోయింది. తామేం చేసిన చెల్లుబాటవుతుందనే దురభిప్రాయం వారిలో ఉన్నది. అగ్రరాజ్యం కవ్వింపు చర్యలకు ఉత్తర కొరియా భయపడదనే సందేశాన్ని పంపదలుచుకున్నాం' అని ఉత్తర కొరియా సైనిక అధికార ప్రతినిధి అన్నారు.

కాగా, ఉత్తర కొరియా ప్రయోగించిన ఖండాంతర క్షిపణులకు న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లే సామర్థ్యం ఉందని అమెరికా ఆరోపిస్తున్నది. అయితే, న్యూక్లియర్ వార్‌హెడ్స్ తయారు చేయాలంటే ఉత్తర కొరియాకు మరో మూడేండ్ల సమయం పట్టవచ్చునని ట్రంప్ సర్కార్ అంచనా వేసింది. కానీ, ఉత్తరకొరియా ఖండాంతర క్షిపణులకు న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లే సాంకేతిక పరిజ్ఞానం ఉన్నట్టు పెంటగాన్ గతనెల గుర్తించింది. దీంతో, ఆదేశ అణ్వస్త్ర పరీక్షలు అమెరికా వెన్నులో వణుకు పుటిస్తున్నాయి. తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు బాలిస్టిక్ క్షిపణులను పరీక్షిస్తున్నట్టు ఉత్తరకొరియా తెలిపింది. అగ్రరాజ్యం తమపై పెత్తనం చెలాయించాలని చూస్తే చూస్తూ ఊరుకోమని ఘాటుగా హెచ్చరించింది. తమ శత్రుదేశమైన దక్షిణ కొరియాను తమపై ఎగదోసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించింది. అమెరికా అణ్వస్త్ర కార్యకలాపాలను ఐరాస నియంత్రించలేక పోతున్నదని తెలిపింది.



సైన్యం లక్ష్యం గువామ్ :

ఉత్తర కొరియా టార్గెట్ చేసిన ప్రాంతం గువామ్. ఇది పసిఫిక్ సముద్రంలోని దీవి. ఇక్కడే అమెరికాకు చెందిన అండర్సన్ వైమానిక దళం ఉన్నది. ఈ వైమానిక స్థావరంలో అణుసామర్థ్యం కలిగిన బీ-1బీ స్ట్రాటెజిక్ బాంబర్లు ఉన్నాయి. మంగళవారం కొరియా ద్వీపకల్పానికి పంపిన బాంబర్లు ఇక్కడి నుంచి వెళ్లినవే. అత్యంత కీలకమైన వైమానిక ప్రాంతాన్ని ఉత్తర కొరియా మిస్సైల్ దాడితో టార్గెట్ చేయాలనుకుంటున్నది. ఇప్పటికే రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితి తారాస్థాయికి చేరింది. తాజాగా ఐరాస ఆంక్షలు, ఆ తర్వాత ట్రంప్ హెచ్చరికతో ఉత్తర కొరియా ఈ దీవిని టార్గెట్ చేసినట్టు తెలుస్తున్నది.

దూసుకెళ్లిన అమెరికా యుద్ధవిమానాలు

పసిఫిక్ మహాసముద్రంలోని గువామ్ ద్వీపం మీదుగా అమెరికా యుద్ధవిమానాలు దూసుకెళ్లాయి. గువామ్‌పై క్షిపణి దాడి చేయనున్నట్టు ఉత్తరకొరియా ప్రకటించక ముందే అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలు అత్యవసరంగా సమావేశమయ్యాయి. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం దాదాపు 10గంటల పాటు అమెరికాకు చెందిన సూపర్‌సోనిక్ బాంబర్ జెట్లు గువామ్ మీదుగా పలుమార్లు గాల్లో చక్కర్లుకొట్టాయి. దాడి జరిగితే అడ్డుకునేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని అమెరికన్ ఎయిర్‌ఫోర్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు పైలట్లు ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్టు తెలిపింది. ప్రపంచంలో ఇంతకుముందెన్నడూ చూడని విధంగా అమెరికా విశ్వరూపాన్ని యుద్ధంలో ఉత్తరకొరియా చూస్తుందని ట్రంప్ వ్యాఖ్యలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.

గువాం ద్వీపం



సైనికులపై దూసుకెళ్లిన కారు

- ఆరుగురికి గాయాలు



పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్ శివారులో ఓ కారు బీభత్సం సృష్టించింది. లెవల్లాయిస్-పెరెట్ ప్రాంతంలో యాంటీ టెర్రరిస్ట్ పోలీస్ యూనిట్ హెడ్‌క్వార్టర్స్ వద్ద జవాన్లపైకి దూసుకెళ్లింది. డ్రైవర్ కారును ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు పారిస్ పోలీసులు తెలిపారు. కాగా.. ప్రమాదంపై లెవల్లాయిస్-పెరెట్ మేయర్ పాట్రిక్ బాల్కెనీ స్పందించారు. జవాన్లపై బీఎండబ్ల్యూ కారు దూసుకెళ్లడం తాను చూశానని.. ఇది ఉద్దేశపూర్వకంగానే చేసిన ప్రమాదమని పాట్రిక్ అన్నారు. చాలాసేపటి నుంచి ఆ కారు హెడ్‌క్వార్టర్స్ బయటే ఉందని.. భవనం నుంచి జవాన్లు బయటకు రాగానే వారిపైకి దూసుకెళ్లిందని పాట్రిక్ వెల్లడించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించానని అన్నారు.

ఖతార్ వెళ్లాలంటే వీసా అక్కర్లేదు!



దోహా: ఇక నుంచి భారతీయులు ఖతార్ వెళ్లాలంటే వీసా వంటి నిబంధనలు పాటించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు భారత్‌తో కలిపి 80 దేశాల ప్రజలకు వీసాలేని ప్రయాణాలకు అనుమతి ఇస్తూ ఖతార్ నిర్ణయం తీసుకుంది. వాటిల్లో యూకే, యూఎస్, కెనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలు ఉన్నాయి. 'ఇక నుంచి ఖతార్‌ను సందర్శించేందుకు వీసాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు' అని ఖతార్ అధికారులు వెల్లడించారు. సందర్శనకు వచ్చేవారి కోసం ఎటువంటి రుసుం లేకుండా మల్టీ ఎంట్రీ మినహాయింపును జారీ చేస్తామని పేర్కొన్నారు. సందర్శకుడి జాతీయతను బట్టి మినహాయింపు గడువు 180 రోజుల వరకు, 90 రోజులు ఖతార్‌లో గడిపేందుకు అనుమతి ఇస్తామని వివరించారు. ఖతార్ దేశ ఆతిథ్యం, చారిత్రక సాంస్కృతిని విస్తరించే కార్యక్రమంలో భాగంగా సందర్శకులను ఆహ్వానిస్తున్నామని, దానికోసమే 'ఫ్రీ వీసా' కల్పిస్తున్నట్టు పర్యాటక శాఖ ఛైర్మెన్ హస్సన్ అల్ ఇబ్రహీం తెలిపారు.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 10-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 223 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 16 పేజీలు వెల : 5.00

వైద్యుల్ని పంపండి

పోలీసులు హింసించిన నేరెళ్ల బాధితుల వద్దకు...

- ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

ఇసుక రవాణా జరగడాన్ని నిలదీసిన పాపానికి పోలీసులతో చావు దెబ్బలు తిని ఆస్పత్రిపాలైన నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామస్తులు ఆరుగురి బాధితుల దగ్గరకు వైద్యులను పంపాలని హైకోర్టు తెలంగాణ సర్కార్‌ను ఆదేశించింది. బాధితులు ఆరుగురు వేములవాడ మనోరమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి చెందిన ఇద్దరు సీనియర్ డాక్టర్లను పంపాలని బుధవారం హైకోర్టు ఆదేశాలిచ్చింది. బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారి శరీరాలపై ఒంటిపై ఉన్న గాయాల తీవ్రత తెలపాలని, వైద్యులు లిఖితపూర్వక నివేదిక ఇవ్వాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. సిరిసిల్ల జిల్లా నేరెళ్ళ, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన దళితులపై పోలీసుల దాడిపై సీబీఐ దర్యాప్తు చేయాలని, నిమ్స్‌లో బాధితులకు వైద్యం చేసేలా ఆదేశాలివ్వాలంటూ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. గాయాల తీవ్రతను బట్టి చికిత్స అవసరమని భావిస్తే, వారిని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. విచారణ 16కి ...11లో

ధర్నాచౌక్‌కు అడ్డంకులెందుకు..! 11లో



చెరువుకు గండి

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం... మిషన్ కాకతీయకు తూట్లు

ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ పనులు కొందరి అవినీతి కారణంగా లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ఈపథకం కింద రూ.19లక్షలు ఖర్చు చేసి పునరుద్ధరణ పనులు చేసిన చెరువు చిన్నపాటి వర్షానికే గండిపడింది. ఈపనుల్లో నాణ్యత లోపించిందని స్థానికులు, రైతులు ఉన్నతాధికారులకు సైతం విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా పనులు చేసి బిల్లులు ఎత్తుకున్నారు. తీరా నేడు మళ్లీ మరమ్మతులకు సిద్ధమైంది. ఇది ప్రొఫెసర్ జయశంకర్- భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి గ్రామంలోని సుందరమ్మ చెరువు దుస్థితి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులోకి నీటి ఉధృతి పెరగడంతో చెరువు కట్ట తెగింది. ఆయకట్టు కింద సుమారు 150 ఎకరాల్లో వరినాట్లు, పంట పొలాలు సాగులో ఉన్నాయని, ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు.





ఉప్పొంగిన వాగులు • జలదిగ్బంధంలో పలు గ్రామాలు

నవతెలంగాణ-యంత్రాంగం

మరోపక్క రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం సాధారణం నుంచి భారీ వర్షం కురిసింది. కొన్ని చోట్ల బుధవారం రాత్రి నుంచి ముసురు పెట్టడంతో వ్యవసాయ పనులు సాగడం లేదు. అయితే చాలా రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్న దశలో కురిసిన ఈ వానతో మొక్కలకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎగువ కురిసిన వర్షానికి వచ్చి చేరుతున్న నీటితో అటవీప్రాంత గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ప్రొఫెసర్ జయశంకర్- భూపాలపల్లి జిల్లాలో తాత్కాలిక బ్రిడ్జీ కొట్టుకుపోవడంతో పలు గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఖమ్మం జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. ప్రధానంగా ఖమ్మం నగరంలో ఉదయం ఏడున్నర గంటలకు ప్రారంభమైన వాన మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఏకదాటిగా కురిసింది. జిల్లాలోని చింతకాని, కొణిజర్ల, కామేపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి, ఏన్కూరు, ఎర్రుపాలెం తదితర మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని పలు ప్రధాన కూడళ్లను వరదనీరు ముంచెత్తింది. మున్నేరు, కాల్వొడ్డు, వినోద థియేటర్, డీఆండీపీఏ కార్యాలయ ప్రాంతం, ముస్తఫనగర్, 45, 50వ డివిజన్లు, తదితర ప్రాంతాల్లో వరదనీరు ఇండ్లలోకి చేరింది. భద్రాద్రి జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. కొత్తగూడెం జిల్లా ...11లో

నేరెళ్లలో దళితులపై దాడి జరిగిందా?

విలేకరుల చిట్‌చాట్‌లో మంత్రి కేటీఆర్ ఆశ్చర్యం

- వేగంగా వెళ్లిన లారీల వల్లే ప్రమాదం

వివరాలు 12లో

వేధింపుల కేసులో బీజేపీ నేత తనయుడి అరెస్ట్

- ఎఫ్ఐఆర్‌లో కిడ్నాప్ అభియోగాలు

వివరాలు 9లో

వేధింపులను ప్రతిఘటిస్తే చంపేశారు

వివరాలు 9లో

ప్రజా వ్యతిరేక విధానాలు పోవాలి



రాజ్యసభలో సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : ప్రజలను చీల్చి, వారిపై భారాలు మోపడమే లక్ష్యంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలు దేశంలో పోవాలని సీతారాం ఏచూరి అన్నారు. క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలను ప్రస్తావించారు. 'దేశ ప్రజలను చీల్చే మతోన్మాదం.. ప్రజలపై భారాలు మోపే ఆర్థిక సరళీకరణ విధానాలను దేశం నుండి తరిమి కొట్టాలి. అవి దేశం నుండి పోవాలి' అని ఆయన అన్నారు. 'ప్రజలను అమానుషంగా హింసించే ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవాలు జరుపుకున్నందువల ప్రయోజనమేమిటి?' అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి తన ప్రసంగంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా మాట్లాడటాన్ని ఏచూరి ప్రస్తావించారు. 'మీరు బానే చెప్పారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేమిటి? మతోన్మాదానికి వ్యతిరేకంగా మీరు ఏం చేశారు?' అని ఆయన ప్రశ్నించారు. 'మీరు అమలు చేస్తున్న ఆర్థిక సంస్కరణలు ప్రజలపై భారాలను మోపుతున్నాయి. నిరుద్యోగం ...11లో

పోడు భూముల జోలికొస్తే గద్దె దింపుతాం



గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజయ్య

- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

నవతెలంగాణ-యంత్రాంగం

గిరిజనులు, ఆదివాసీలు సాగుచేసుకుంటున్న పోడు భూముల జోలికొస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే సున్నం రాజయ్య హెచ్చరించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా బుధ వారం ఘనంగా నిర్వహించారు. గిరిజనులు తమ సాంప్రదాయక వేషాలు ధరించి ప్రదర్శనలు నిర్వహించారు. కొమ్ము నృత్యాన్ని ప్రదర్శించారు. భద్రాచలంలో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొమురం భీం విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే ...11లో

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

- కేటీపీఎస్ గేటు ఎదుట అఖిలపక్షం ఆందోళన
- నాయకులపై పోలీసుల దౌర్జన్యం...అరెస్టు
- పోలీసుల నిర్బంధం నడుమ మృతదేహం తరలింపు
- అక్కడా కార్మిక సంఘాల ఆందోళన
- ఎట్టకేలకు దిగొచ్చిన యాజమాన్యం

వివరాలు 8లో

బీజేపీకి భంగపాటు



గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో గెలిచిన అహ్మద్ పటేల్

అహ్మదాబాద్ : ఎన్నో రసవత్తర పరిణామాల మధ్య కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ గుజరాత్ నుంచి రాజ్యసభకు తిరిగి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు రెబల్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవని ఎన్నికల సంఘం ప్రకటించడంతో అహ్మద్ పటేల్‌కు విజయం వరించింది. ఆయన గెలవటానికి అవసరమైన 44 ఓట్లు పడ్డాయి.. ఆయనతోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలు కూడా రాజ్యసభకు ఎన్నికయ్యారు. అమిత్ షా, ఇరానీ ఇద్దరికీ చెరి 46 ఓట్లు లభించాయి. కాగా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరి పోటీ చేసిన బలవంత్‌సింగ్ రాజ్‌పుత్‌కు ...11లో



శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం

నేడు పోచంపాడు వద్ద సీఎం శంకుస్థాపన

- రూ. 2,000 కోట్లతో పనులు
- కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానం
- ఎస్సారెస్పీ కాల్వల ఆధునీకరణకు రూ.863 కోట్లు
- జీవో విడుదల..8 జిల్లాల రైతాంగానికి ప్రయోజనం

నవతెలంగాణ-నిజామాబాద్

శ్రీరాంసాగర్ పునరుజ్జీవానికి సర్కారు నడుంకట్టింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పోచంపాడు డ్యాం వద్ద శంకుస్థాపన చేయనున్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ సభకు భారీగా జనసమీకరణ చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానం చేయడంతో పాటూ ఆధునీకరణ కోసం 2,000 కోట్లతో నీటిపారుదల శాఖ కార్యాచరణ పథకం రూపొందించింది. దీనిలో భాగంగా కాల్వల ఆధునీకరణకు రూ.863 కోట్లను మంజూరు చేస్తూ బుధవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటికే రూ.200 కోట్లతో పనులు చేపడుతున్నారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో ఎస్సారెస్పీ ఆయకట్టుపై ...11లో



ఆట.. జీవితానికి మంట

సాయం సంధ్య వేళ ఆరుబయట తోటి పిల్లలతో ఆహ్లాదంగా ఆడుకోవాల్సిన ఆ పసివారు నాలుగు గోడల మధ్య కంప్యూటర్ ముందు తిష్టవేస్తున్నారు. నలుగురితో కలిసి ఉత్సాహంగా ఉరకలు వేయాల్సిన ఆ యువతరం ఓ చోట చతికిలబడి బాహ్య ప్రపంచంతో తమకేమీ సంబంధం లేదన్నట్టు మొబైల్ ఫోన్ లో ముఖం పెడుతోంది. వినూత్నమైన ఫీచర్లతో, చూపు తిప్పుకోనివ్వని ఆకర్షణలతో, కళ్ళు మిరిమిట్లు గొలిపే ఛేజింగ్ లు, సాహస కృత్యాలు, ఆకట్టుకునే 3డి టెక్నాలజీని కలిగి వర్చువల్ రియాలిటీకి దగ్గరగా ఉన్న ఆధునిక వీడియో గేమ్స్ మాయలో పడి చిన్నారులు, యువత పలు విధాలుగా శారీరక, మానసిక సమస్యలను కొనితెచ్చుకుంటున్నట్టు వివిధ అధ్యయనాల్లో వెల్లడవుతున్నది.

యువత, చిన్నారుల పాలిట వ్యసనంగా వీడియో గేమ్స్

- ప్రతీ వందమందిలో 33మంది బానిసలవుతున్న వైనం
- మానసికంగానే గాక, శారీరకంగానూ పెనుప్రభావం
- టెక్ ఎడిక్షన్, మాంట్రియల్ యూనివర్సిటీ సర్వేల్లో వెల్లడైన పలు అంశాలు



జై

సిగరెట్, మందు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసగా మారడమే ఇప్పటివరకు తెలుసు. అయితే వీడియోగేమ్స్ ను నిత్యం ఆడే వారిలో సుమారు 33 శాతం మంది ఆ ఆటలకు బానిసలుగా మారుతున్నారని తేలింది. ఒకానొక సందర్భంలో.. తమకు కావలసిన వీడియో గేమింగ్ వస్తువులు అందని పక్షంలో విపరీత ధోరణిలకు ఆయా వ్యక్తులు పాల్పడుతున్నారని టెక్ ఎడిక్షన్ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలడం చర్చనీయాంశమైంది. తాజాగా, ...11లో

"ధైర్యం లేకుంటే మనిషి ఏ రంగంలోనూ విజయం సాధించలేడు.
- స్వామి వివేకానంద

సంపాదకీయం

తొలగిన ప్రజాస్వామిక ముసుగు

అమెరికా అఫ్ఘనిస్తాన్‌పై దాడిచేసి 16ఏండ్లు అవుతున్నది. అమెరికా చరిత్రలోనే ఈ యుద్ధం అత్యంత సుదీర్ఘమైనది. 'టెర్రరిజంపై ప్రపంచ యుద్ధం' పేరుతో ఈ పేద దక్షిణాసియాదేశం మీద దాడి జరిగింది. 2001 సెప్టెంబరు11వ తేదీన అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై టెర్రరిస్టులు చేసిన దాడికి ప్రతీకారంగా ఒసామా బిన్ లాడెన్‌ను వేటాడటం కోసం అనే మిషతో అఫ్ఘనిస్తాన్ ఆక్రమణ మొదలయింది.

శాంతికాముకులైన అమెరికా ప్రజలు అవకాశం దొరికినప్పుడల్లా ఈ యుద్ధ పిపాసను నిరసిస్తూనే ఉన్నారు. ఈ కాలక్రమంలో అమెరికా సామ్రాజ్యవాదం వేసుకున్న రకరకాల ముసుగులు ఒక్కొక్కటీ జారిపోతున్నాయి. ఇలా బయటపడుతున్న అమెరికా సామ్రాజ్యవాద నిజస్వరూపం అంతిమంగా దాని పతనానికి హేతువు కాకమానదు!

వాస్తవానికి అమెరికా పాలక వర్గాల అంతర్జాతీయ ప్రయోజనాలను కాపాడటం కోసమే అఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ మొదలయింది. అంతకుముందు ఒక దశాబ్దం క్రితం సోవియట్ యూనియన్ పతనం కావటంతో మధ్య ఆసియాలో రాజకీయ శూన్యం ఏర్పడింది. ప్రపంచంలో అత్యంత చమురు నిల్వలుగల ప్రాంతాలలో ఈ ప్రాంతం రెండవది. ఈ విలువైన వనరులు ప్రపంచంలో అత్యంత రాజకీయ అస్థిరత నెలకొన్న ప్రాంతంలో ఉన్నాయి. అఫ్ఘనిస్తాన్‌పై దాడిచేసి, ఆ దేశంలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, అపారమైన సైనిక శక్తిని ఆ దేశంలోకి తరలించి తన ఆధిపత్యాన్ని నెలకొల్పాలని అమెరికా భావించింది. పదహారేండ్ల దురాక్రమణ తరువాత కూడా దాదాపు తొమ్మిది వేల అమెరికా సైన్యం అఫ్ఘనిస్తాన్‌లో తిష్టవేసివున్నది. అమెరికా సైన్యం మద్దతులేకుండా అఫ్ఘనిస్తాన్‌లోని అస్రఫ్ ఘనీ కీలుబొమ్మ ప్రభుత్వం ఒక వారం రోజులు కూడా కొనసాగలేదనే వాస్తవం అందరికీ తెలిసిందే.




మితంగా వేసిన ఒక అంచనా ప్రకారం అఫ్ఘనిస్తాన్‌లో 2001 నుంచి ఇప్పటిదాకా 1,75,000మంది చనిపోయారు. లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారు. అనేక లక్షలమంది తమ ఆవాసాలను వీడి కాందిశీకులయ్యారు. గత ఆరు నెలల్లో పోయిన ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు అమెరికా వాయుసేన దాడులలో మరణించిన పౌరుల సంఖ్య 43శాతం పెరిగింది. ఈ నరమేథం టెర్రరిజంపై చేస్తున్న పోరాటం పేరుతోను, ప్రజాస్వామ్య నిర్మాణం పేరుతోను, మహిళల విమోచన పేరుతోను, మానవ హక్కుల పరిరక్షణ పేరుతోను జరుగుతున్నది. అయితే అంతిమంగా ఈ కిరాతక యుద్ధం సామ్రాజ్యవాద ప్రయోజనాల పరిరక్షణకే అనేది సుస్పష్టం. అఫ్ఘనిస్తాన్‌ను తన పాదాక్రాంతం చేసుకోవటానికి అమెరికా ఇప్పటిదాకా చేసిన ఖర్చు అక్షరాలా 60లక్షల కోట్ల రూపాయలు (1ట్రిల్లియన్ డాలర్లు)!

అయితే ప్రస్తుతం యుద్ధాన్ని తీవ్రతరం చేయటం ద్వారా దోపిడీకి పాల్పడి లాభాలను ఆర్జించాలనే ఆలోచనపై ట్రంప్ పాలన తన దృష్టి కేంద్రీకరిస్తున్నది. అఫ్ఘనిస్తాన్‌లోని అరుదుగా దొరికే అపారమైన ఖనిజ సంపద(రేర్ ఎర్త్ మినరల్స్)ను వెలికి తీయాలనే ఎప్పటినుంచో వున్న ఆలోచనను అమలులోకి తీసుకురావాలని అమెరికా కార్పొరేట్ కంపెనీలు భావిస్తున్నాయని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఇందులో భాగంగా అఫ్ఘనిస్తాన్‌లో సమృద్ధిగా లభించనున్న రేర్ ఎర్త్ మినరల్స్‌ను వెలికితీసే అమెరికన్ ఎలిమెంట్స్ అనే కంపెనీ అధినేత స్టీఫెన్ ఫైన్‌బర్గ్ ట్రంప్‌ను కలిసి ఇందుకు తమ కంపెనీ సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ ట్రంప్ సమర్థకుడు ప్రముఖ మిలిటరీ కాంట్రాక్ కంపెనీ డైన్ కార్ప ఇంటర్‌నేషనల్ అధినేత కూడా. ఈ కంపెనీ అమెరికాకు, దాని మిత్ర దేశాలకు కిరాయి సైనికులను సరఫరా చేస్తోంది.

అఫ్ఘనిస్తాన్ ఖనిజ సంపదపైన అమెరికా కన్ను పడిందన్న విషయాన్ని గమనించిన అధ్యక్షుడు అస్రఫ్ ఘనీ అమెరికాను ప్రోత్సహిస్తున్నారు. అఫ్ఘనిస్తాన్‌లోని ఖనిజ సంపదను దోచుకోవాలనే ఆలోచన చేసినవారిలో ట్రంప్ ప్రథముడు కాదు. 2001లో అమెరికా సేనలు అఫ్ఘనిస్తాన్‌లో అడుగుపెట్టక మునుపే ఆ దేశంలోని ఖనిజ సంపద గురించి అమెరికా గూఢచార సంస్థ సీఐఏకు పరిపూర్ణమైన అవగాహన ఉన్నది. 2006లోనే జార్జి డబ్ల్యు బుష్ ఆదేశాల మేరకు ఆ దేశ ఖనిజ సంపదను అంచనా వేయటానికి ఒక వైమానిక సర్వే జరిగిందని న్యూయార్క్ టైమ్స్ రాసింది. అంతేకాకుండా అఫ్ఘనిస్తాన్ ప్రపంచంలోనే ఒక ప్రధాన ఖనిజ నిక్షేపాలుగల దేశంగా అవతరించనున్నదని 2010లోనే టైమ్స్ విశ్లేషించింది. అయితే డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావటంతో క్రూరమైన అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలకుగల ప్రజాస్వామిక ముసుగు తొలిగిపోయింది. అమెరికా పాలకవర్గాల నేరపూరిత స్వభావాన్ని నిలువెల్లా సంతరించుకున్న ట్రంప్ అమెరికా విదేశాంగ విధాన నగ్న స్వరూపాన్ని నిస్సిగ్గుగా చూపించటానికి బరితెగిస్తున్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థపై క్షీణిస్తున్న తన పట్టును నిలుపుకోవటానికి గత 25ఏండ్లుగా అమెరికా సామ్రాజ్యవాదం ఊహాతీతమైన సైనిక ప్రాబల్యంతో నిరంతరం యుద్ధాలలో మునిగి తేలుతున్నది. అమెరికా పాలకవర్గ పార్టీలైన రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలు తమలో తమకు ఎన్ని తేడాలున్నా అమెరికా చేస్తున్న అనైతిక యుద్ధాలకు మద్దతునిస్తూనే ఉన్నాయి. శాంతికాముకులైన అమెరికా ప్రజలు అవకాశం దొరికినప్పుడల్లా ఈ యుద్ధ పిపాసను నిరసిస్తూనే ఉన్నారు. ఈ కాలక్రమంలో అమెరికా సామ్రాజ్యవాదం వేసుకున్న రకరకాల ముసుగులు ఒక్కొక్కటీ జారిపోతున్నాయి. ఇలా బయటపడుతున్న అమెరికా సామ్రాజ్యవాద నిజస్వరూపం అంతిమంగా దాని పతనానికి హేతువు కాకమానదు!

అగమ్యగోచరంగా జీఎస్టీ



డాక్టర్ చుక్కా రామయ్య

వాణిజ్యపరంగా రాష్ట్రాల ఎల్లల్ని చెరిపేస్తూ 'ఒకే దేశం... ఒకే పన్ను' నినాదం కింద వస్తు-సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తూ తీసుకొచ్చిన ఈ పన్ను విధానం అమలులో స్పష్టత లోపిస్తోంది. దీంతో జీఎస్టీ అమలు అగమ్యగోచరంగా మారిందనే ఆరోపణలున్నాయి. ఈ బిల్లుకు తొలినుంచీ మద్దతునిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 'జీఎస్టీపై కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, ఇక న్యాయపోరాటం తప్పదు' అంటూ ఆయన తీవ్ర హెచ్చరికలు చేశారు. దీంతో కేంద్రం వ్యవహరించే ఇలాంటి ధోరణులతో ఫెడరలిజం స్ఫూర్తికి విఘాతం కలుగుతుందనే భయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రామయ్యమాట

ఈ నేపథ్యంలో జీఎస్టీ ద్వారా రాష్ట్రాలను తన గుప్పిట్లో పెట్టుకొనేలా కేంద్రం వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్‌లకు అధికారాలు బదలాయించి ఫండ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు తమగుప్పిట్లో పెట్టుకొని నియంత్రిస్తున్నట్టుగానే కేంద్రం కూడా జీఎస్టీతో అలాగే వ్యవహరిస్తుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే పరిస్థితి తలెత్తితే ఫెడరలిజం స్ఫూర్తి దెబ్బతింటుంది. అందువల్ల ఈ కీలక పన్ను అమలుపై ప్రజల్లో వ్యక్తమవుతోన్న భయాలను తొలగించాలి.

జీఎస్టీకి తొలినుంచి గట్టిగా మద్దతునిచ్చిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. జీఎస్టీ బిల్లును తొలుత ఆమోదించిన రాష్ట్రం కూడా తెలంగాణేయే! గతంలో జీఎస్టీపై పలువురు చేసిన విమర్శలను సీఎం కేసీఆరే స్వయంగా రంగంలోకి దిగి తిప్పికొట్టారు. జీఎస్టీ అమలువల్ల రాష్ట్ర ప్రభుత్వ రాబడులు భారీగా పెరుగుతాయని ప్రకటిస్తూ ఆయన కొత్త పన్నుల



వ్యవస్థకు నైతికబలాన్ని కూడా అందించారు. అలాంటి నేత ఇప్పుడు తీవ్రస్థాయిలో జీఎస్టీపై విరుచుకుపడటం ప్రజల్ని ఆలోచనలో పడేసింది. జీఎస్టీతో ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే ప్రాజెక్టులకు వ్యయభారం భారీగా పెరుగుతోందంటూ ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతేకాకుండా ప్రపంచంలో చాలా దేశాలు జీఎస్టీ విధానం తెచ్చి అమల్లో ఏర్పడిన ఇబ్బందుల వల్ల కొన్ని దేశాలు వెనక్కి తగ్గాయని, మన దేశంలో ఏమవుతుందో చూడాలంటూ సీఎం వ్యాఖ్యానించారు. అతిపెద్ద పన్ను సంస్కరణగా ప్రచారం చేస్తూ వచ్చిన ఈ జీఎస్టీ అమల్లోకి వచ్చిన నెలరోజుల్లోనే చిన్న చిన్న వ్యాపార వర్గాల నిరసనలు, ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిపడుతుండటం ఈ పన్ను ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా ఉన్నాయి.

పంచాయతీ రాజ్ సంస్థలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలనే సంకల్పంతో 1992లో 73వ రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టారు. అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలే పంచాయతీ రాజ్ అధికారాలను కూడా కలిగిఉండేవి. ఈ సవరణ తర్వాత కూడా తమవద్ద ఉన్న అధికారాలను వదులుకొనేందుకు అవి సిద్ధపడలేదు. అందుకే నిర్ణయాలు తీసుకొనే హక్కును స్థానిక సంస్థలకు ఇచ్చినప్పటికీ ఫండింగ్ ఇచ్చే అధికారాన్ని మాత్రం రాష్ట్ర ప్రభుత్వాల వద్దే ఉంచుకున్నాయి. తద్వారా పంచాయతీరాజ్, మున్సిపాలిటీల అధికారాలను పరోక్షంగా తమ గుప్పిట్లో ఉంచుకొని నియంత్రిస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని సైతం నోచుకోలేక స్థానిక సంస్థలు చతికిలపడుతున్న వైనం మనకండ్లకు కడుతోంది. పంచాయితీరాజ్ పట్ల రాష్ట్రప్రభుత్వాలు అనుసరించిన వైఖరినే జీఎస్టీ విషయంలో కేంద్రం తమపై ప్రదర్శిస్తుందనే భయం రాష్ట్రాల్లో ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఫెడరలిజం స్ఫూర్తిని కాపాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉంటేనే అభివృద్ధిలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది.

ప్రాజెక్టులు నిర్మించేది దేశ ప్రజల ప్రయోజనం కోసం. అలాంటి వాటిపట్ల కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరి సరికాదు. రాష్ట్రాలను కేవలం పరిపాలనా కేంద్రాలుగా పరిగణించొద్దు. వస్తుసేవల పన్ను ద్వారా ఫెడరలిజానికి ముప్పు రానీయొద్దని నా విజ్ఞప్తి. ప్రజాస్వామిక స్ఫూర్తిని కాపాడుతూ పార్టీలకతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మన దేశం అనేక రాజకీయ పార్టీల సమ్మేళనం. వాటిమధ్య సామరస్యత, సమష్టితత్వంతో పనిచేసే అవకాశాలు మెరుగుపడాలి. అధికారంతో నియంత్రించే పోకడలకు పోకుండా.. రాజ్యాంగానికి కట్టుబడి ఎవరికి వారే స్వతహాగా నిర్ణయంతీసుకొనే, పనిచేసే సానుకూలమైన వాతావరణం కేంద్రం కల్పించాలి.

- ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

ఇండోనేషియా ముస్లిముల నుండి యోగీ నేర్చుకోవాల్సిందేమిటి?



ఆర్. రాజేశమ్

బీజేపీ-ఆర్‌ఎస్ఎస్ పరివారంలో మోడీకి వారసుడిగా ప్రచారమవుతున్న యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఈ మధ్య ఒక ఆశ్చర్యకర ప్రకటన చేసారు. హిందూత్వ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పేరుగాంచిన ఈ యోగి పుంగవుడు... మొదటిసారిగా ముస్లిములను మెచ్చుకుంటూ మాట్లాడాడు. అయితే ఆయన ప్రశంసించింది. ఇక్కడి ముస్లిములను కాదు. ఇండోనేషియా ముస్లిములను...! మొన్న జూలై 28న యూపీ శాసనస మండలిలో ప్రసంగిస్తూ ఆదిత్యనాథ్ "ఇండోనేషియా ముస్లిములు చాలా గొప్పవారు. నేటికీ అక్కడ రాంలీలా ఉత్సవాలు జరుపుకుంటారు. వారిని చూసి ఇక్కడివారు నేర్చుకోవాలి" అంటూ స్టేట్ మెంట్ ఇచ్చారు.


అందరూ అంగీకరించే విశ్వజనీన సూత్రాలను సైతం తమ కుత్సిత మత రాజకీయాలకు అనుగుణంగా

ఇండోనేషియా దేశపు ముస్లిం సమాజంతో పాటు... వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న మనదేశపు సమ్మిళత సంస్కృతి... అందరూ ఒప్పుకోవాల్సిన ఒక సత్యాన్ని నిరూపిస్తున్నది. 'మతములన్నియు మాసిపోవును.. మానవత్వమే నిలిచి వెలుగును..!" అన్నదే ఆ సత్యం. ఆదిత్యనాథులు, మోడీలు, సంఘ పరివారం, ఎంఐఎం నేతలు... ఎంత త్వరగా ఈ వాస్తవాన్ని గుర్తిస్తే... అంతగా ఈ దేశానికి మంచిది!

వక్రీకరించడం.. మతోన్మాదులందరూ చేసే పనే. అబద్ధాలు వల్లెవేసి ప్రజలను బోల్తా కొట్టించడంలో దిట్ట అయిన ఆదిత్యనాథ్ కూడా అదే పంథానవలంబిస్తున్నాడు. ఇండోనేషియా దేశపు ముస్లిముల ఉదార స్వభావం నుండి తాను, తనలాంటి మతోన్మాదులు నేర్చుకోవాల్సిందెంతో ఉండగా... ఆయన నెరపుతున్న మతరాజకీయాలను వ్యతిరేకించేవారిని విమర్శించడానికి... ఆ వాస్తవాన్ని వక్రీకరించి వాడుకుంటున్నారు ఆదిత్యనాథ్.

మతపరమైన అంశాల పట్ల ఇండోనేషియా ముస్లిములు చూపే సహనాన్ని ప్రపంచమంతా మెచ్చుకుంటున్నది. ప్రపంచంలోనే అత్యధిక ముస్లిం జనాభాగల దేశం ఇండోనేషియా. 20కోట్లమంది ముస్లిముల దేశం అది. 87శాతం మంది ఇస్లాం మతాన్ని అనుసరిస్తారు. అయితే... ఇండోనేషియా ప్రజల గొప్పతనమేమంటే.. ఈనాడు ప్రపంచంలోనే అతిపెద్ద ముస్లిం జనాభా గల దేశం మాదేనంటూ గర్వంగా చెప్పుకునే ఇండోనేషియన్లు... ఒకనాడు తామంతా హిందూవులమేనంటూ అంతే గర్వంగా చెప్పుకుంటారు. చరిత్ర తొలిదశలో అన్ని దేశాల ప్రజల్లాగానే... ఇండోనేషియన్లు 'అనిమిజం' మతాన్ని (ప్రకృతిలోని అన్ని వస్తువుల్లో, జీవుల్లో భగవంతుడున్నాడనే భావన) అవలంబించారు. క్రీ.శ. ఒకటవ శతాబ్దిలో భారతదేశం నుండి వైదిక మతం అక్కడికి చేరింది. ముందు రాజులు, ఆ తర్వాత అక్కడి ప్రజలందరూ వైదిక మతాన్ని స్వీకరించారు. ఆ తర్వాత 12వశతాబ్దంలో... మరోసారి భారతదేశం నుండే వచ్చిన సూఫీ సాధువులు ఇస్లాం మతాన్ని పరిచయం చేసారు. ఇప్పుడు కూడా ముందు రోజులు, అటు పిదప సామాన్యులూ ముస్లిములుగా మారారు.

ప్రస్తుతం తాము అవలంబిస్తున్న ఇస్లాం మతాచారాలను ఎంతో నిష్టతో పాటించే ఇండోనేషియన్లు.. తమ హిందూగతాన్ని కూడా అంతే గర్వంతో... అభిమానంతో ప్రదర్శిస్తారు. ఆదిత్యనాథ్‌లు, తొగాడియాలు, బుఖారీలు, ఒవైసీలు ప్రదర్శించే మత దురహంకార ధోరణి అక్కడి ప్రజల్లో మచ్చుకైనా కనిపించదు. వారు మాట్లాడే భాషను "బహాసా" అంటారు. సంస్కృతపదం "భాష" నుండి వచ్చిందే బహాసా. అనుసరించేది ఇస్లాం మతమైనా.. పేర్లు మాత్రం హిందూ మతాన్ని సూచించేవిగా ఉంటాయి. గతంలో దేశాధ్యక్షులుగా పనిచేసిన వారు... సుహార్తో, సుకర్ణోలు. మేఘావతి సత్యవతి సుకర్ణోపుత్రి 2001-2004 మధ్య దేశాధ్యక్షురాలుగా పనిచేసారు. ఆమెపేరు మేఘావతి సత్యవతి. సుకర్ణోకి బిడ్డ కాబట్టి "సుకర్ణో పుత్రి" అయింది. ఆమె చెల్లెండ్ల పేర్లు రుక్మావతి, సుక్మావతి, రుక్మిణి. ఆమె భర్తపేరు సురేంద్ర. వీరందరూ ముస్లింలే..! ఇండోనేషియా ముద్రించిన ఇరవైవేల రూపాయల కరెన్సీ నోటు మీద గణేషుడి బొమ్మ ఉంటుంది.



రామాయణం అక్కడి ప్రజల ప్రముఖ జానపద కళారూపం. మనుషుల పేర్లే కాదు... అక్కడి ద్వీపాలపేర్లు కూడా హిందూమత సంబంధమైనవే. సుమత్రా, కాళీమంథన్, బాలి (వాలి) అనేవి అక్కడి ద్వీపాలు.

వాషింగ్టన్ నగరంలోని "ఎంబసీ రో" అనే వీధిలో వివిధ దేశాల రాయబార కార్యాలయా లుంటాయి. అక్కడికెళ్లి చూస్తే... మీకో అరుదైన దృశ్యం కనబడుతుంది. బ్రిటిష్ రాయబార కార్యాలయం ముందు మీకు విన్‌స్టన్ చర్చిల్ ప్రతిమ కనబడుతుంది. దక్షిణాఫ్రికా దేశ ఎంబసీ ముందు మండేలా బొమ్మ, భారతదేశ ఎంబసీ ముందు మహాత్మాగాంధీ బొమ్మ మిమ్ముల్ని పలకరిస్తాయి. ఆ పక్కనే ఉన్న ఇండోనేషియా రాయబార కార్యాలయం ముందు సుకర్ణో బొమ్మనో, సుహార్తో ప్రతిమనో ఉంటుందని మీరు భావిస్తారు. కానీ... అక్కడికెళ్లి చూస్తే... మిమ్మల్ని పలుకరించే మూర్తి... సాక్షాత్తూ సరస్వతీదేవి! ముస్లిం జనాభాలో ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలిచే దేశం... తమ రాయబార కార్యాలయం ముందు... తమ గుర్తింపుగా... ప్రతిష్టించుకున్నది ఒక హిందూ దేవతా విగ్రహం! ఇలా ఇండోనేషియన్ ముస్లిమ్‌ల మత సహన స్వభావాన్ని తెలియజేసే దృష్టాంతాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆ దేశ జాతీయ చిహ్నం.. గరుడపక్షి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విమానయాన సంస్థ పేరు కూడా "గరుడ"నే! విష్ణుమూర్తి వాహనానికి అక్కడి ముస్లిం ప్రజలిచ్చిన గౌరవమిది..!

తమ గతకాలపు మత చిహ్నాలను గర్వంగా ప్రదర్శించడం ద్వారా ఇండోనేషియన్ ముస్లింలు.. నేటి కాలపు ప్రపంచానికి ఓ గొప్ప సందేశాన్ని ఇస్తున్నారు. మేము ఒకనాడు అనిమిస్టులము, ప్రకృతి ఆరాధకులము. ఆ తర్వాత మేమంతా హిందూవులమయ్యాము. నేడు ముస్లింలుగా కొనసాగుతున్నాం. మతాలు వస్తుంటాయి... పోతుంటాయి. మానవత్వమే మనందరి అసలు గుర్తింపు... ఇదీ ఇండోనేషియా ప్రజలు ప్రపంచానికిస్తున్న సందేశం! పరిశీలించి చూస్తే... ఈ విశిష్టత మనకు అన్ని జాతుల్లోనూ కనబడుతుంది. ఈజిప్టు దేశపు ప్రజలు నేడు ఇస్లాంను అనుసరిస్తున్నా... తమ గతకాలపు "పాగన్" మతానికి చెందిన పిరమిడ్లను, ఫారోల అవశేషాలను తమ జాతి సంపదగా గర్వంగా ప్రదర్శిస్తారు. ఇరాక్ దేశస్తులు కూడా నేడు విభిన్న మతాలను అవలంబిస్తున్నా... గతంలోని మెసపటోమియన్ మత చిహ్నాలను తమ గుర్తింపులో ఒక భాగంగా స్వీకరిస్తారు. యూరోపు దేశాల్లో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చిన రినైజాన్స్ (సాంస్కృతిక పునరుజ్జీవనం) ఎలా ఎప్పుడు సాధ్యమయిందో మనకందరికీ తెలుసు. క్రిస్టియానిటీకి ముందున్న గ్రీకు, రోమన్ తత్వవేత్తల ఆలోచనాధోరణిని పునరుజ్జీవింపజేయడం ద్వారానే రినైజాన్స్ సాధ్యపడింది. యూరోపు దేశాలు నేడు సాధించిన బహుముఖ అభివృద్ధికి రినైజాన్సే పునాదిరాయి.

ప్రపంచమంతటా... చరిత్ర పొడుగునా కొనసాగుతున్న ఈ సమ్మిళిత జీవన విధానానికి భారతదేశం మినహాయింపేమీకాదు. మనదేశం కూడా ఎన్నో మతాల.. ఎన్నో సంస్కృతుల సంగమస్థలి. ఈ దేశ మూలవాసులైన ద్రావిడులు... సింధూనాగరికత రోజుల్లో స్త్రీశక్తిని, పశుపతిని, ప్రకృతిశక్తులను ఆరాధించేవారు. బయటిదేశాల నుండి వచ్చిన యురేపియన్ ఆర్యులు... ఇక్కడి ప్రజలకు వైదికమతాన్ని పరిచయం చేసారు. స్థానిక తెగల ప్రజలకు క్షుద్రులు (శూద్రులు), దస్యులు అనే పేర్లు తగిలించి.. తమ వైదిక మతంలో కలిపేసుకున్నారు. ఆ తర్వాత క్రీ.శ.4వ శతాబ్ది నాటికి భారతదేశమంతటా బౌద్ధం విస్తరించింది. క్రీ.పూ. 6వ శతాబ్ది నాటికి మళ్లీ వైదికమతం రాజ్యమేలింది. ఆ తర్వాత దేశ ప్రజల్లో కొందరు సిక్కుమతాన్ని, ఇస్లాంను, క్రైస్తవాన్ని స్వీకరించారు. ఈ మతాలన్నింటిలోని మంచిని కలబోసిన సమ్మిళిత సంస్కృతియే నేడు భారతదేశపు గుర్తింపుగా నిలిచివుంది. ఈ సమ్మిళిత సంస్కృతినే తమ జీవన విధానంగా నేడు దేశ ప్రజలందరూ స్వీకరిస్తున్నారు. కొందరు సంకుచిత మనస్కులు.. ప్రజల మతనమ్మకాలను తమ కుత్సిత రాజకీయాల్లో పాచికలుగా వాడే కొందరు స్వార్థశక్తులు మాత్రమే దీనికి మినహాయింపు!

రాంలీలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించే ఇండోనేషియా ముస్లింలను పొగుడుతున్న యోగి ఆదిత్యనాథ్... వారి నుండి తానేం నేర్చుకున్నాడో నేడు దేశ ప్రజలకు తెలియజెప్పాలి. ఇండోనేషియా ప్రజలు చాటి చెబుతున్న మతసహనత్వానికి... భారతదేశ ప్రజలు అనాదిగా అవలంబిస్తున్న సమ్మిళిత సంస్కృతికీ.. ఆదిత్యనాథ్, ఆయన ప్రాతినిధ్యం వహించే సంఘపరివారం బద్ధ శత్రువులేనన్న వాస్తవం ఈదేశ ప్రజలందరికీ తెలిసిందే. చారిత్రిక కట్టడమైన బాబ్రీ మసీదును ఆటవికంగా కూల్చేసింది వీరే. ఔరంగాబాద్ పేరును సంభాజీనగర్‌గా మార్చాలని గొడవలు సృష్టించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు... అమాయకుల మృతికి కారకులయ్యారు. ఒకనాటి ముస్లిం రాజుల పేర్లమీదుగా ఉనికిలోకొచ్చిన ఊర్ల పేర్లను ఉచ్చరించడానికి ఇష్టపడని సంఘపరివారనేతలు.. హైదరాబాద్‌ను భాగ్యనగరంగా.. కరీంనగర్‌ను కరినగరంగా, ఆదిలాబాద్‌ను ఎదులాపురంగా మార్చి పలుకుతారు. యోగి ఆదిత్యనాథ్ స్వయంగా ఇలాంటి రెచ్చగొట్టే పనులు చేయడంలో దిట్టగా పేరొందాడు. తాను ప్రాతినిధ్యం వహించిన గోరక్‌పూర్ నియోజకవర్గంలోని అలీనగర్‌ను ఆర్యనగర్‌గా... గొడవలు సృష్టించి మరీ మార్పించాడు. మియోబజార్‌ను మాయాబజార్‌గా మార్పించాడు. ఉర్దూ ఈదేశంలో పుట్టిన భాష అన్న సత్యాన్ని అంగీకరించని ఆదిత్యనాథ్... ఉర్దూ బాజార్‌పేరును హిందీబజార్‌గా మార్చాడు. దేశమంతటా ముస్లిం మత చిహ్నాలను చెరిపేసి.. పూర్తిగా హిందూ రాష్ట్రంగా మార్చడమే తమ అంతిమ లక్ష్యమని ప్రకటించుకునే సంఘ పరివార్ నేతలకు... ఒకనాడు తాము అవలంబించిన హిందూ మత చిహ్నాలు నేటి మా సంస్కృతిలో భాగమేనంటూ గర్వంగా చెప్పుకునే ఇండోనేషియా ముస్లింల పేరెత్తే అర్హత ఉన్నదా? ఇండోనేషియా దేశపు ముస్లిం సమాజంతో పాటు... వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న మనదేశపు సమ్మిళత సంస్కృతి... అందరూ ఒప్పుకోవాల్సిన ఒక సత్యాన్ని నిరూపిస్తున్నది. 'మతములన్నియు మాసిపోవును.. మానవత్వమే నిలిచి వెలుగును..!" అన్నదే ఆ సత్యం. ఆదిత్యనాథులు, మోడీలు, సంఘ పరివారం, ఎంఐఎం నేతలు... ఎంత త్వరగా ఈ వాస్తవాన్ని గుర్తిస్తే... అంతగా ఈ దేశానికి మంచిది!

సెల్: 9440443183

హన్మంతరావు బహుళ ప్రయోజన పథకం శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం



నైనాలగోవర్ధన్

కాళేశ్వరం(మేడిగడ్డ) నీళ్లతో "శ్రీరాంసాగర్ ప్రాజెక్టును" మళ్లా పూర్వస్థితికి తీసుకువచ్చి పున రుజ్జీవంపజేసి, బలం చేకూరుస్తామని కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు 10న ఈ పథకానికి శంకుస్థాపన చేయబోతున్నట్టు సాగునీటి మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు.


కాళేశ్వరానికి సుమారు 15 కి.మీ.కు దిగువన గోదావరిపై మేడిగడ్డ వుంటుంది. ఈ బ్యారేజీ ఎఫ్‌ఆర్‌ఎల్ స.మ. 100 మీ. ఎత్తు. దీన్ని లోయర్ గోదావరి అంటారు. అన్నారం బ్యారేజీ ఎఫ్‌ఆర్‌ఎల్ 121మీ. సుందిళ్ల బ్యారేజీ 132 మీ. వీటికి ఎగువన మంచిర్యాలకు సమీపంలో ఎల్లంపెల్లి (శ్రీపాదసాగర్) ప్రాజెక్టు 148మీ. ఎల్లంపెల్లి నుండి రామడుగు, చిప్పకుర్తి వరకు నీళ్లను భారీ టన్నెళ్ళ గుండా ఎత్తిపోయాల్సి వుంటుంది. శ్రీరాంసాగర్ వరద కాలువ(ఫ్లడ్‌ఫ్లో కెనాల్) మొత్తం పొడవు 122 కి.మీ అయితే చిప్పకుర్తి వద్ద 99 కి.మీ వరద కాలువలో నీళు ఎత్తిపోస్తారు. చిప్పకుర్తి వరద కాలువ గుండా 3 లిఫ్టుల ద్వారా శ్రీరాంసాగర్‌కు 60 రోజులు 60 టీయంసీల నీళ్లు ఎత్తిపోయడం పథకం ఉద్దేశం. అంటే మేడిగడ్డ నుండి ఎల్లంపెల్లి -మిడ్‌మానేరు చిప్పకుర్తి-శ్రీరాంసాగర్‌కు సుమారు 300 కి.మీ దూరం, 330మీ. ఎత్తుకు నీళ్లు ఎత్తిపోయబోతున్నారు.

ప్రస్తుత పథకం, ప్రభుత్వానికి ఆలోచనలో లేక ముందే టి.హన్మంతరావు మేడిగడ్డ నుండి శ్రీరాంసాగర్‌కు నీటిని గోదావరి నదీ గర్భం గుండా తరలించే బహుళ ప్రయోజనాలతో కూడిన పథకాన్ని సమగ్ర ప్రణాలికతో తెలంగాణ ప్రభుత్వానికి వివరించారు. మంత్రి హరీశ్‌రావు టి.హన్మంతరావు ఇంటికి వెళ్లి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నారని కూడా చెప్పారు. ఈ పథకం వల్ల మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.20వేల కోట్లు ప్రజాధనం మిగులుతుందన్నారు హన్మంతరావు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి ఎల్లంపెల్లి (శ్రీపాదసాగర్)ప్రాజెక్టు మధ్యన ఇదే గోదావరి నదిలో అవసరమైనన్ని బ్యారేజీలు నిర్మించాలి. వెదిరె శ్రీరాం, (సలహాదారు, జలవనరుల శాఖ భారత ప్రభుత్వం) కూడా "గోదావరి జలాల సమగ్ర వినియోగం" అనే పుస్తకంలో మ్యాప్‌లతో సహా టి.హన్మంతరావు ప్రణాళికనే స్థూలంగా సమర్థించారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి విడుదలయ్యే వరద నీటిని వినియోగించడానికి గాని, మధ్యలో గల గోదావరి నదికి ఇరువైపుల గల పరివాహక ప్రాంతంలోని అనేక నదులు, భారీ వాగుల ద్వారా లభ్యమయ్యే నీటిని వినియోగించుకోవటానికి అవసరమైనన్ని బారేజీలు గోదావరి నదిపై నిర్మించాలి. ముఖ్యంగా అవిభాజ్య ఆదిలాబాద్ జిల్లా నుండి వచ్చే అనేక నదులు గోదావరికి భారీ నీటిని అందించగా, గోదావరి నదిపై నిర్మించే బ్యారేజీలోనే నీరు ఎక్కడికక్కడ నిలువ వుంటుంది. అన్ని నీళ్లు కాళేశ్వరం పోవడం ఎందుకు, కాళేశ్వరం నుంచి శ్రీరాంసాగర్‌లో ఎత్తిపోసుడెందుకు.

ఈ అన్ని బ్యారేజీల నీటి నిలవ సామర్థ్యం అనేక పదుల టీఎంసీలు వుంటుంది. నదీగర్భం భారీ జలాశయంగా మారుతుంది. ఈ నీటిని సాగు అవసరాలకు, విద్యుదుత్పత్తికి, మత్స్య సంపదకు, పరిశ్రమలు, పర్యాటక రంగ అభివృద్ధికి ఉపయోగించవచ్చు. ఈ బ్యారేజీల క్రింద ముంపునకు గురి అయ్యే భూమి మొత్తం నది గర్భ ప్రాంతమవడం వల్ల భూసేకరణ అసలే అవసరం లేదు. పచ్చని పంటలు పండే భూమి ఏ బ్యారేజీలో ఒక్క ఎకరం కూడా మునగదు. మహారాష్ట్ర ప్రభుత్వం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ నుండి జయక్వాడ్ వరకు నిర్మించిన 12 బ్యారేజీలలో బాబ్లీ ప్రాజెక్టు కూడా కలిసి వుంది. ఇలాంటి వరుస బ్యారేజీలనే శ్రీపాదసాగర్ ప్రాజెక్టు నుండి శ్రీరాంసాగర్ వరకు నిర్మించాలి. ఈ విధంగా నిర్మించడం వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇరువైపుల వున్న విశాలమైన ఆయకట్టుకు పాత 5,6 జిల్లాలకు నల్గొండ వరకు గ్రావిటీ ద్వారా సాగునీరు సుస్థిరంగా అందించవచ్చు. మేడిగడ్డ(కాళేశ్వరం) నుండి ఎల్లంపెల్లి వరకు కేసీఆర్ ప్రభుత్వం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే 3 బ్యారేజీలు నిర్మించాలని ప్రతిపాదించి, పనులు ప్రారంభించింది. ఎల్లంపెల్లి నుండి శ్రీరాంసాగర్ వరకు ఎన్ని బ్యారేజీలు అవసరమైతే అన్ని నిర్మించాలి. మేడిగడ్డ వద్ద లభ్యమయ్యే నీటిని తక్కువ ఖర్చు, తక్కువ దూరంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తరలించవచ్చు. ఇక్కడి నుండి నిజాంసాగర్, సింగూర్‌కు ఆయా నదీ గర్భాల గుండా ఎలాంటి ముంపు లేకుండా భూసేకరణ అసలే అవసరంలేకుండా నీళ్లు తీసుకెల్లవచ్చు. ఈ ప్రక్రియకే "బహుళ ప్రయోజనాల స్టెప్ లాడర్ టెక్నాలజీ" అని దశాబ్దం క్రిందటే నామకరణం చేసినారు.

ప్రతి బ్యారేజీ దగ్గర 12 మీ. ఎత్తు నీళ్లు నిలువ వుండేలా పంపు చేయాలి. నౌకారంగానికి పనికి వచ్చేలాగా ప్రతి బ్యారేజీకి నౌకా లాకును ఏర్పాటుచేసి, నది పొడవునా ఎక్కడైనా నీటిలోతు 4 మీ. కంటే తక్కువ వుండకుండా చూడాలి. నితిన్‌గడ్కరీ



ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర నౌకాయాన రంగంలో లక్ష కోట్ల పైగా నిధులున్నాయి. అందులోనే ఈ బ్యారేజీల ఖర్చులకు నిధులు సమకూర్చుకునే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ధనం మిగులుతుంది. కేంద్ర జలనరుల మంత్రిత్వశాఖ పూర్తి ఖర్చు భరించే అవకాశం వున్నప్పటికీ, ఈ భారాన్ని తెలంగాణ ప్రజలపై వేయడమెందుకు.

రివర్సబుల్ పంపులు: ఈ అన్ని బ్యారేజీలలో నాగార్జున సాగర్‌లో మాదిరిగా రివర్సబుల్ పంపులు పెట్టాలి. దిగువ నుండి ఎగువ బ్యారేజీకి నీరివ్వాలన్నప్పుడు పంపులుగా పనిచేస్తాయి. నదిలో పైనుంచి వరద ప్రవాహం ఉన్నప్పుడు అవే పంపులు వరద నీటికి టర్బయిన్లుగా పనిచేసి జలవిద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. ఈ పంపులన్నీ బ్యారేజీలోనే ఒక పవర్ బ్లాకులో వుంటాయి. "ఆల్‌స్టామ్ అనే కంపెనీ ఈ ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 15 మీ. ఎత్తు దాకా ఉండే రివర్సబుల్ పంపులను ఇప్పటికే సప్లయ్ చేస్తున్నారు. కాళేశ్వరం నుంచి గోదావరి గుండా శ్రీరాంసాగర్‌కు తరలించే నీటికి ఈపంపులను వాడి బహుళ ప్రయోజనాలను పొందవచ్చని హన్మంతరావు స్వయంగా ప్రభుత్వానికి, హరీశ్‌రావుకు వెల్లడించారు.

ఈ బ్యారేజీ పనులకు ఒక లైన్ ఎస్టిమేట్ వేసి కేంద్ర ప్రభుత్వం అనుమతులు తీసుకోవాలని హన్మంతరావు సూచనలను కేసీఆర్ ప్రభుత్వం అంగీకరించింది. ఆ దిశగా కృషి చేస్తున్నట్టు, ముఖ్యమంత్రి కూడా అదే అభిప్రాయంతో ఉన్నట్టు, హరీశ్‌రావు టి.హన్మంతరావుకు తెలియజేసారు. కానీ ఆచరణలో ఈ పథకాన్ని ఆమోదించినట్టే ఆమోదించి నితిన్ గడ్కరీకి సమర్పిస్తామని చెప్పి ఊరించి మూలన పడేసింది కేసీఆర్ ప్రభుత్వం.

కేసీఆర్ ప్రభుత్వం మేడిగడ్డ నుండి శ్రీరాంసాగర్‌కు తరలించే ఎత్తిపోతలు హన్మంతరావు పథకంతో పోలిస్తే లాంఛన ప్రాయమైంది, పునరుజ్జీవం చేసే శక్తిలేదు. వరుద కాలువ ఎత్తిపోతల్లోని తీవ్రమైన లోపాలు:

1) కుడి ఎడమల గల భారీ వాగులు, ఉపనదులు గోదావరికి భారీనీటిని అందిస్తాయి. వరద కాలువలో అలాంటి ప్రకృతి సిద్ధమైన నదులు కలిసే వెసులుబాటు వుందా? కనీసం ఒక్క చిన్న వాగైనా వరద కాలువలో కలుస్తుందా? అనేక ఉపనదులు ఎక్కడికక్కడ గోదావరికి నీరు అందిస్తాయి. ఎగువనుంచి కాళేశ్వరం దిగువకు చేరిన తర్వాతా అదే నీటిని మళ్లీ భారీ ఖర్చుతో ఎగువకు పంపు చేసే అవసరం వుంటుంది. శాశ్వతంగా ఈ ఖర్చు తెలంగాణ సమాజం పై భారం పడదా?

2) గోదావరిలో ధవళేశ్వరం నుంచి కాళేశ్వరం ఎల్లంపెల్లి శ్రీరాంసాగర్‌ల మీదుగా త్రియం బకేశ్వర్‌ల వరకు జలరవాణా సాధ్యమౌతుంది. కృష్ణా నదిలో ఇలాంటి అవకాశం అసలేలేదు. సముద్రంలో ప్రయాణించే భారీ ఓడలు గోదావరిలో ఎగువ నుంచి దిగువకు, దిగువ నుంచి ఎగువకు వెళ్లే జలరవాణాతో పాటు, శ్రీరాంసాగర్‌కు నీరు తీసుకెల్లవచ్చు. అపారమైన ఆదాయంతో పాటు ప్రపంచంతో అనుసంధానించే జలరవాణా సౌకర్యాన్ని గోదావరిలో నెలకొల్పడం సాధ్యమౌతుంది. కాని వరదకాలువకు అలాంటి అవకాశాలు అసలు లేవు.

3) గోదావరిలో జలారవాణాతో తెలంగాణకు సముద్రం లేని లోటు తీరుతుంది. మొత్తం తెలంగాణలో ఒక్క గోదావరి దాని ఉప నదులైన ప్రాణహిత, వార్దానది, వైన్‌గంగ, పెనుగంగలో మాత్రమే జలరవాణా, బహుళ ప్రయోజనాలకు అవకాశాలున్నాయి.

4) మేడిగడ్డ నుంచి ఎత్తిపోసే దిగువనీరు గాని, ఎగువ నుంచి వచ్చే నీరు, వరదను గోదావరి భారీ లోయలా వుండటం వల్ల భారీ ఎత్తున ఎక్కడికక్కడ కట్టే బారేజీలలో నిలువచేయవచ్చు. ఈ బారేజీలన్నీ నిండితే గోదావరి పొడవాటి రిజర్వాయరులా కనిపిస్తుంది. ఏడాది అంతా గోదావరి నీటితో వుండి, రెండువైపుల అన్ని కాలువలకు గ్రావిటీ ద్వారా నీటిని సాగుకు అందించవచ్చు. అదే వరద కాలువ మొత్తంలో1,2 టియంసిలు మించి నీరు నిలువ చేయలేము.

5) అన్ని బ్యారేజీలు చేపల పరిశ్రమ అభివృద్ధికి విస్తృతంగా తోడ్పడుతాయి. 6) జలరవాణా వల్ల గోదావరికి ఇరువైపుల వస్తురవాణా చౌకై పరిశ్రమలు పెరుగుతాయి.

6) తుమ్మిడిహెట్టిని పక్కకుపెట్టి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం తలకెత్తుకున్న తర్వాత, మేడిగడ్డ నీళ్ళను ఎల్లంపెల్లి, మిడ్‌మానేరు (320 మీ) మీదుగా మల్లన్నసాగర్ (557 మీ) నుండి హలీట రివర్ ద్వారా దిగువ శ్రీరాంసాగర్(310 మీ)కు తరలించే మొదటి పథకాన్ని,"వరద కాలువ-శ్రీరాంసాగర్ రెండో లిఫ్టు" పెడుతున్నందున రద్దు చేస్తున్నారా? కొనసాగుతుందా? లేదా మల్లన్నసాగర్ వయా హల్దిరివర్ రిడిజైనింగ్ తప్పని ప్రకటిస్తున్నట్టేనా?

(సీఎం కేసీఆర్ శ్రీరాంసాగర్ వద్ద శంకుస్థాపన చేస్తున్న సందర్భంగా)

సెల్: 9701381799



జీవితం అంత సులభం కాదు. మహిళలకైతే మరీను. నా జీవితంలో అన్నీ పోరాడి సాధించుకున్నవే. చిన్న చిన్న విషయాల కోసం చాలా పోరాడాల్సి వచ్చింది. ప్రతి మహిళకూ ఇదే వర్తిస్తుంది. మనం ఏం సాధించాలన్నా పోరాడాల్సిందే!

- కంగనా రనౌత్, నటి

నోరూరించే లడ్డూ..

నోరూరించే లడ్డూలను ఇష్టపడని వారుండరు! పిల్లలు, పెద్దలూ ఎంతో ఇష్టంగా తింటారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన లడ్డూలు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. అలాంటి లడ్డూలను చిరుధాన్యాలతో ఓసారి ప్రయత్నించి చూడండి !

అటుకులతో...

కావలసిన పదార్థాలు : అటుకులు-ఒక కప్పు, పచ్చి కొబ్బరి తురుము-సగం కప్పు, బెల్లం-ఒక కప్పు, నువ్వులు-సగం కప్పు, యాలకులు-నాలుగు, జీడి పప్పు-రెండు చెంచాలు, నెయ్యి-ఒకకప్పు.

తయారీ విధానం: అటుకుల లడ్డూ పిల్లలకు, పెద్దలకు చాలా అవసరం. ఐరన్ లోపం ఉన్న వారు ఈ లడ్డూ తింటే సరిపోతుంది. దీన్ని తయారు చేసుకోవటానికి ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి అటుకులు వేయించుకోని పక్కన పెటుకోవాలి. అలాగే నువ్వులు కూడా వేయించుకోవాలి. ఆ తర్వాత అటుకులు, నువ్వులు, పచ్చి కొబ్బరి, బెల్లం, జీడి పప్పు, యాలకులు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమంలో నెయ్యి కలుపుకొని చిన్న చిన్న లడ్డూలుగా తయారు చేసుకుంటే సరి!



మల్టీ గ్రైన్ లడ్డు...

కావలసిన పదార్థాలు : బెల్లం-ఒక కప్పు, నెయ్యి-మూడు చెంచాలు, నువ్వులు-సగం కప్పు, అవిశ గింజలు-సగం కప్పు, డ్రై ఫ్రూట్స్-ఒక కప్పు, మల్టీగ్రైన్ పిండి-ఒక కప్పు, యాలకుల పొడి-ఒక చెంచా.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి నువ్వులను, అవిశ గింజలను దోరగా వేయించుకొని పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద మరో పాన్ పెట్టి దాంట్లో నెయ్యి వేసుకోవాలి. నెయ్యి కాస్త వేడి కాగానే దాంట్లో డ్రై ఫ్రూట్స్ వేసుకోవాలి. డ్రై ఫ్రూట్స్ వేగుతున్న క్రమంలోనే దాంట్లో మల్టీ గ్రైన్ పిండి(కొర్రలు, సజ్జలు, జొన్నలు, గోధుమలు మల్టీ గ్రైన్‌లో ఉంటాయి) వేసుకొని బాగా కలపాలి. పిండి ఉండలు లేకుండా చక్కగా కలుపుకోవాలి. దాంట్లోనే నువ్వులు, అవిశగింజలను వేసి కలుపుకోవాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని పక్కన పెట్టుకోవాలి. మరో పాత్రలో బెల్లం పాకం తయారు చేసుకోవాలి. ఈ పాకంలో యాలకుల పొడి వేసుకొని ముందుగా సిద్ధం చేసుకున్న పిండిలో బెల్లం పాకం కలుపుకొని లడ్డూలు కట్టుకుంటే సరిపోతుంది.





బాదం, జీడి పప్పు లడ్డు...

కావలసిన పదార్థాలు : బాదం-ఒక కప్పు, జీడి పప్పు-ఒక కప్పు, బెల్లం-ఒక కప్పు, కోవా-సగం కప్పు, నెయ్యి-మూడు చెంచాలు.

తయారీ విధానం : ముందుగా బాదం, జీడి పప్పును మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాత్ర పెట్టుకొని పాత్రలో బెల్లం పాకం పెట్టుకోవాలి. బెల్లం పాకంలో ముందుగా గ్రైండ్ చేసుకున్న మిశ్రమాన్ని కలుపుకోవాలి. తర్వాత దాంట్లో కొద్దిగా కోవా కలుపుకొని స్టవ్ మీద పెట్టి చిక్కబడే వరకు ఉడికించుకోవాలి. దాంట్లో నెయ్యి వేసుకొని చల్లారాక లడ్డూలు కట్టుకుంటే సరిపోతుంది. ఈ లడ్డూ చాలా రుచిగా ఉంటుంది. పోషకాహారం కూడా. పిల్లలు, పెద్దలు చాలా ఇష్టంగా తింటారు.

జొన్నలతో...

కావలసిన పదార్థాలు : జొన్న పిండి-ఒక కప్పు, బాదం, జీడి పప్పు-ఒక కప్పు(సన్నగా కట్ చేసుకోవాలి), బెల్లం తురుము-ఒక కప్పు, నెయ్యి-ఒక కప్పు, యాలకుల పొడి-ఒక చెంచా, చక్కెర-ఒక చెంచా, డ్రై ఫ్రూట్స్-రెండు చెంచాలు, పాలు-ఒక గ్లాసు.

తయారీ విధానం : ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేడి చేసుకోవాలి. నెయ్యి కాస్త వేడి కాగానే దాంట్లో బాదం, జీడి పప్పు వేయించుకోవాలి. జీడి పప్పు వేగాక దాంట్లోనే జొన్న పిండి వేసి బాగా వేయించుకోవాలి. దాంట్లోనే యాలకుల పొడి, డ్రై ఫ్రూట్స్, ఒక చెంచా చక్కెర, చెల్లం తురుము వేసి సన్న మంట మీద ఎక్కువ సమయం వేయించుకోవాలి. ఇది కాస్త చల్లారాక మరిగించిన పాలను కలుపుకొని లడ్డూలు కట్టుకుంటే సరిపోతుంది.



ఇట్లా చేద్దాం

పండ్లను నిల్వ చేసేటప్పుడు... వాటినుంచి అరటిపండ్లను వేరు చేయండి. లేకపోతే పండ్లు తొందరగా పండిపోయే అవకాశం ఉంది.

లింగ వివక్షపై పోరాటం



ఎరా బెల్ థాంప్సన్
(10ఆగస్టు, 1905 - 30డిసెంబర్, 1986)

సమాజంలో కొన సాగుతున్న జాతి, లింగ వివక్షలను రూపుమాపడానికి కృషి చేసిన ఆఫ్రికన్ అమెరికన్ జర్నలిస్టు ఎరా బెల్ థాంప్సన్. రచయితగా, పత్రికా సంపాదకురాలిగానే కాదు అథ్లెట్‌గా కూడా రాణించిన ఆమె తన స్వీయ చరిత్ర ద్వారా వివక్ష ఏ తీరుగా ఉంటుందో వివరించారు.

ఎరా బెల్ డియో మొయిన్స్, అయోవాలో జన్మించింది. ఆమె ఎనిమిది సంవత్సరాల వయసులో వారి కుటుంబం ఉత్తర డకోటాకు వలస వెళ్లింది. అక్కడే ప్రాథమిక విద్యను పూర్తిచేశారు. తోటి విద్యార్థుల నుంచి వివక్షను ఎదుర్కొన్నారు. సామరస్యంతో మెలిగి స్నేహితులను సంపాదించుకున్నారు. 1925లో ఆమె ఉత్తర డకోటా విశ్వవిద్యాలయంలో చేరారు. అప్పటికే రచయితగా రాణిస్తున్న ఆమె క్యాంపస్ వార్తాపత్రిక కోసం పని చేశారు. అంతేకాదు అథ్లెట్‌గా ట్రాక్ రికార్డులను సాధించారు. బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పూర్తి చేసి 1933లో చికాగో వెళ్లారు. ఆమె చదువుకు తగిన ఉద్యోగం దొరకలేదు. నిరాశపడకుండా ఆమె వర్క్స్ ప్రోగ్రెస్ అడ్మినిస్ట్రేషన్ కోసం ఒక వార్తాపత్రికను ప్రారంభించారు. పనిచేస్తున్న సమయంలో నార్త్ వెస్ట్రన్ యూనివర్శిటీ నిర్వహించిన మెడిల్ స్కూల్ ఆఫ్ జర్నలిజంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులో ఆమె చేరారు. ఆ తర్వాత జాన్సన్ పబ్లిషింగ్ కంపెనీలో చేరిన ఆమె ఆ సంస్థ ప్రచురించే నెగ్రో డైజెస్ట్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆమె ఎబొనీ ప్రచురణ సంస్థలో మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేశారు. 1986లో ఆమె మరణించేవరకు ఎబొనీ కోసం ఎంతో కృషి చేశారు.

1945 లో థాంప్సన్ తన స్వీయచరిత్రను 'అమెరికన్ డాటర్' రాశారు. ఈ పుస్తకానికి ఆమె ఫెలోషిప్ కూడా అందుకున్నారు. ఈ పుస్తకంలో ఆమె ఉత్తర డకోటాలో ఆమె బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ.. ఎన్నో విషయాలను, వివక్ష ఎలా ఉండేదో తెలియచేశారు.

జాన్సన్ పబ్లిషింగ్‌లో పనిచేస్తున్న సమయంలో ఆమె అనేక దేశాలలో పర్యటించారు. కథలను వెతకడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించారు. ఆమె తన కథనాలకు అక్షరరూపం ఇచ్చే ముందు అనేక కొన్ని వందల మంది వ్యక్తులను ఇంటర్వ్యూ చేసేవారు. ఆయా దేశాల్లో ఉన్న పరిస్థితులను స్థానికుల నుంచి తెలుసు కుంటూ వాస్తవికతకు దగ్గరగా ఉండేలా కథలు రాసేవారు. 1954 లో ఆఫ్రికలోని 18 దేశాలలో పర్యటించిన తర్వాత ఆమె రాసిన పుస్తకం 'ఆఫ్రికా, ల్యాండ్ ఆఫ్ మై ఫాదర్'

సమాజంలోని జాతి, లింగ వివక్షపై అవగాహన కల్పించడానికి నిరంతరం శ్రమించిన థాంప్సన్ అనేక పురస్కారాలు, ఎంతో మంది ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు. ❄

కళ తగ్గితే...



శరీరంలో వ్యర్థ పదార్థాలు ఎక్కువగా ఉంటే ముఖంలో కళ తగ్గిపోతుంది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే.. పండ్లరసాలను బాగా తాగాలి. చర్మం కళకళలాడాలంటే.. రోజూ ముఖాన్ని కడుక్కోవడంతో పాటు వారానికోసారి మృతకణాలు తొలగించాలి. అప్పుడే చర్మం మృదువుగా, తాజాగా కనిపిస్తుంది. దీనికోసం తేనె, చక్కెర కలిపి రాయాలి. కాసేపయ్యాక గోరువెచ్చని నీళ్లతో కడిగేయాలి.

- కలబంద గుజ్జును రాసి 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే చర్మం కోమలంగా తయారవుతుంది. నాలుగు చెంచాల కీరదోస గుజ్జుకు రెండు చెంచాల పెరుగు వేసి ముఖానికి రాయాలి. పావు గంట తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే ముఖం తాజాగా, తేమగా మారుతుంది.
- ఆపిల్, ఆరెంజ్, ద్రాక్ష, స్ట్రాబెర్రీ.. ఇలా ఏపండునైనా తీసుకుని బాగా పేస్టులా చేసి అందులో తేనె కలిపి ముఖానికి రాసుకోవాలి. 20 నిమిషాల తర్వాత ఫేస్ ప్యాక్‌ను తొలగిస్తే చర్మం కాంతివంతమవుతుంది. ❄

సహజంగా నియంత్రిద్దాం

వర్షాకాలంలో దోమలు విసుగు పుట్టిస్తాయి. వీటి నుంచి కాపాడుకోవడానికి కాయిల్స్, క్రీములు, లోషన్లు ఉపయోగిస్తాం. అయితే కొంత మందికి ఇవి పడక చర్మం, గొంతు సమస్యలు వస్తాయి. అందుకే సహజ పద్ధతుల్లో దోమలు నియంత్రించుకోడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి మొక్కల పెంపకం. కొన్ని మొక్కలు దోమలను రానీయకుండా సహాయపడతాయి. ఆ మొక్కల గురించి తెలుసుకుందాం...

రోజ్మెరీ: రోజ్మెరీ సహజమైన దోమల నివారిణి. ఈ మొక్క 4 నుంచి 5 అడుగుల వరకు పొడవు పెరిగి నీలం పువ్వులు కలిగి ఉంటుంది. రోజ్మెరీ మొక్క వెచ్చని వాతావరణంలో బాగా పెరుగుతుంది. దీన్ని వంటలలో మసాలా కోసం కూడా వాడతారు. పెరటిలో రోజ్మెరీ మొక్క ఉంటే చాలు. దోమలు మన దరిచేరవు.





వేప: దోమ నివారిణకు వేప మొక్క సమర్థవంతంగా పని చేస్తుంది. వేపతో తయారు చేసిన దోమనివారణ మందులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వేప ఆకులను మండించడం వల్ల కూడా దోమలను నియంత్రించవచ్చు. వేప నూనెను రాసుకున్నా దోమలు దూరంగా పోతాయి.

లావెండర్: లావెండర్ దోమల నివారణకు ఓ అద్భుతమైన మొక్క. దీన్ని పెంచడం చాలా తేలిక. ఈ మొక్కకు వేడి వాతావరణం అవసరం. నీటిలో కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్ వేసి చర్మానికి రాసుకుంటే దోమలు మన దరి చేరవు. దోమలను నియంత్రించడానికి ఇంట్లో మనం ఎక్కువగా కూర్చునే ప్రాంతాల్లో లావెండర్ మొక్కలు ఉంచాలి. అలాగే మెడ,మణికట్టు, చీలమండల వంటి ప్రాంతాలలో లావెండర్ ఆయిల్ రాసుకుంటే దోమల నుంచి కాపాడుకోవచ్చు.



బంతి పువ్వు: బంతి పువ్వు ఎవ్వరూ ఇష్టపడని విచిత్రమైన వాసన కలిగి ఉంటుంది. బంతిలో ఆఫ్రికన్, ఫ్రెంచ్ అనే రెండు రకాలు ఉన్నాయి. ఇవిరెండు దోమల నివారిణిగా ఉపయోగించవచ్చు. కూరగాయల మొక్కల సమీపంలో బంతి మొక్కలను వేస్తే ఇతర కీటకాలు దూరంగా పోతాయి. ముఖ్యంగా దోమల నియంత్రణకు ఇంటి వాకిలి వద్ద బంతి మొక్కలను పెంచాలి.





తైలం గడ్డి: దోమల నియంత్రణలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇది ప్రతి సంవత్సరం 2 మీటర్ల పొడవు పెరుగుతుంది. దీనికి లావెండర్ రంగు పువ్వులు పూస్తాయి.దోమల వలన వచ్చే డెంగ్యూ జ్వరం నివారణకు కూడా తైలం గడ్డి పయోగిస్తారు. తైలం గడ్డిలో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. దోమలు కుట్టకుండా ఈ నూనెను చర్మంపై కూడా రాసుకోవచ్చు

ఆసక్తి అభిరుచిగా మారి..

నలభై దాటిందంటే చాలు వయసు మీద పడిపోయింది.. ఏ పని చేతకావడం లేదు అనుకుంటారు. ఉద్యోగులు చేసేవారు తప్పదనుకుంటూ హడావుడిగా ఆఫీస్‌లకు బయలుదేరితే.. ఇంట్లో ఉండేవారు టీవీ సీరియల్స్ చూస్తూ సోఫాలకు అతుక్కుపోతారు. మరికొందరు డాక్టర్ ఇచ్చిన మందులన్నీ వేసుకుంటూ అసిడిటీతో ఆయాసపడుతారు. వీరంతా అనారోగ్యలను కొనితెచ్చుకుంటున్నారు. మరి ఇంకోరకం వ్యక్తులు కూడా ఉన్నారు. అరవై దాటినా నలభైలానే కనిపిస్తూ.. హుషారుగా తిరుగుతూ.. ఉన్నారు.. మరి వీరింతా ఎలా ఆరోగ్యంగా ఉంటున్నారో తెలుసుకోవాలని ఉంది కదూ! మేం ఆ ప్రయత్నమే చేశాం. అరవై దాటినా ఆయాసం లేకుండా రెండంతస్తులపైన టెర్రస్ గార్డెనింగ్ ద్వారా ఇంటికి కావల్సిన కూరగాయలు, పండ్లు పండిస్తున్న వైద్యుల లక్ష్మి ఇంటికి వెళ్లాం...మరి ఆ ఇంటి వాతావరణం, లక్ష్మి దినచర్య మీ కోసం..

మెహదీపట్నం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో గుడిమాల్కాపుర్, ఉషోదయం కాలనీ. ఇక్కడ నివసించేవారంతా ఉద్యోగాలు చేసేవారు... రిటైర్ట్ అయినవారు. ఆ కాలనీలో ప్రతి ఇంటి ముందు పచ్చదనమే. 39వ ఇంటి ముందు ఆగాను. గేటు తీసుకుని అడుగు లోపల పెట్టగానే స్వాగతం పలుకుతూ... విరబూసిన నూరు వరాలు..వంద బొకేలతో సమానంగా కనిపించాయి. గేటు చప్పుడుతో బయటకు వచ్చారు లక్ష్మి. ఆ ఇంటి యజమాని. ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా రిటైర్ట్ అయ్యారు. 1979లో షార్ట్ హ్యాండ్‌లో గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఆమె వయస్సు 65 అని ఆమె చెబితే కాని తెలియదు. ఇప్పటివరకు ఆమెకు షూగర్, బిపి, కాళ్లనొప్పులు అంటే ఎమిటో తెలియదు. ఆమే కాదు వాళ్ల ఇంట్లో వారు డాక్టర్ దగ్గరకు వెళ్ళిన సందర్భాలు వేళ్లపై లెక్క పెట్టవచ్చు.

బ్యాంక్ లోనుతో ఇల్లు కట్టుకున్నారు. ఇంటి చుట్టూ ఖాళీ ప్రదేశం వదిలారు. మామిడి, మల్లె, కరివేపాకు చెట్లు వేసుకున్నారు. ఉద్యోగం చేసే రోజుల్లో ఉదయం పరుగు.. సాయంత్రం అలసట తప్పెవి కావు. ఇంట్లో ఉన్న సమయంలో ఏ కాస్త తీరిక దొరికినా.. మొక్కలు పెంచడానికి ఎక్కువ ఆసక్తి చూపించేవారు. ఎక్కువగా ముడి బియ్యం, కొర్రలు, అరికెలు, వరిగెలు మొదలైన చిరుధాన్యాలు తీసుకునేవారు. ఇంట్లో వండిన ఆహారం తప్ప ఏ రోజు బయటి నుంచి తీసుకువచ్చిన ఆహారం వారు తినలేదు. అంతేకాదు రిటైర్ట్ అయిన తర్వాత ఆమె జీవనవిధానమే మారిపోయింది.

ఉదయమే నిద్రలేవడం. కుంపటి అంటించడం. (బొగ్గుల పొయ్యి) ఇంటిచుట్టూ శుభ్రం చేయడం. ఇంటి చుట్టూ పడిన ఎండిన ఆకులను, కిచన్ వెస్ట్‌ను ఇంటి బయట ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కంపోస్ట్‌లో వేయడం. ఆ తర్వాత బ్రేక్ ఫాస్ట్‌గా పండ్లు, మొలకెత్తిన గింజలు.

లంచ్ బొగ్గుల పొయ్యిపై వండిన అన్నం. ఇది కొర్రలు, అరికెలు, సామలు, వరిగెలలో ఏదో ఒకటి. ఇవేవి లేకపోతే ముడిబియ్యం. పప్పు, ఇంట్లో పండిన ఆకుకూరలు, కూరగాయలు, పెరుగు. నాలుగుగంటలకు మజ్జిగ లేదా పండ్లు. రాత్రి చిరుధాన్యాలతో చేసిన రొట్టె, కిచిడి, ఉప్మాలలో ఏదో ఒకటి. ఇవి వారు పాటించే ఆహార నియమాలు. మరి రోజంతా ఏం చేస్తారో తెలుసా! ఇంటి కప్పుపై కూరగాయలు, పండ్లు పెంచు తున్నారు. రోజుకు నాలుగు గంటలు ఆమె ఇక్కడే ఉంటారు. పార్ట్‌టైమ్ జాబ్ మాదిరిగా మరో రెండు గంటల పాటు ట్రాన్స్‌లేషన్ వర్క్స్ చేస్తారు.



మొక్కలు పెంచాలన్న ఆసక్తి ఎలా వచ్చింది అంటే మాత్రం.. మీ మీడియా కారణంగానే అంటూ నవ్వేశారు.

మీరు రోజూ తినే ఆకుకూరలు ఎక్కడ పండుతున్నాయో తెలుసా? అంటూ టీవీలో వచ్చిన కార్యక్రమమే తన చేత ఇంట్లో ఆకుకూరలు పెంచేలా చేసిందట. ఉద్యోగం చేసే సమయంలోనే ఇంట్లో ఆకుకూరలను పెంచడం ప్రారంభించారు. ఇందుకు ఫేస్‌బుక్‌లోని ఇంటిపంట పేజీ చాలా వరకు ఉపయోగపడింది అంటారు. తోట పెంచడానికి కూడా మీడియానే కారణమన్నారు. ప్రభుత్వం అర్బన్ ఫామింగ్‌ను ప్రోత్సహిస్తూ సబ్సిడీపై కూరగాయలు పెంచుకోవడానికి అవసరమైన పరికరాలను, గింజలను ఇవ్వడంతో పాటు శిక్షణ కూడా ఇస్తుందని పేపర్ తెలుసుకుని తాను ఆ కిట్ తెచ్చుకున్నారట. కింది నుంచి రెండంతస్తుల పైకి మట్టి మోయాలంటే కష్టం కదా అన్న నా ప్రశ్నకు సమాధానంగా మేడ పైన రెలింగ్‌కు ఏర్పాటుచేసిన గిలకను చూపించారు. దీని సహాయంతో ఒకరు కింద బకెట్‌లో మట్టి నింపితే.. మరొకలు పైకి చేద సహాయంతో చేర్చుతారు. ఇద్దరూ కలిసి మొక్కలకు కావల్సిన మట్టిని ఏర్పాటుచేస్తారు.

పూలు పూస్తూంటే.. కాయలు కాస్తుంటే ఎన్నో కొత్త మొక్కలు వచ్చి చేరాయి. తాజా కూరగాయల అవసరం కాస్త ఆసక్తిగా.. ఆసక్తి మరింత పెరిగి అభిరుచిగా మారింది. ఇప్పుడు ఆమెకు మొక్కల పెంపకమే ఉద్యోగం.

తాజా కూరగాయలు, పండ్లు తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణాన్ని కూడా పరిరక్షిస్తున్నారు. అరటి, పప్పాయ నుంచి కొత్తిమీర, పుదీన వరకు అన్ని రకాల కూరగాయలను, పండ్లను, పూలను ఆమె పెంచుతున్నారు. ఇటీవలే సోలార్ ప్లాంట్‌ను ఇంటిపై ఏర్పాటుచేసి ఇంటికి కావల్సిన విద్యుత్ అంటూ దీని నుంచే వాడుతున్నారు. అంతేకాదు రెయిన్ వాటర్ హర్వెస్టింగ్ చేశారు. వారి బోర్‌లో నీరు పుష్కలంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొక్కలకు కావల్సిన సేంద్రియ ఎరువును ఇంట్లోనే తయారుచేస్తున్నారు.

మొక్కల పెంపకంతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ఆర్థిక లాభం, సామాజిక బాధ్యత ముడిపడి ఉన్నాయంటున్నారు. ❄

పెత్తందారు పైశాచికం

- దళిత పాలేరు దారుణ హత్య




కంకిపాడు : కృష్ణాజిల్లా కంకిపాడు మండలం గొడవర్రులో ఓ పెత్తందారు చేతిలో దళిత పాలేరు దారుణ హత్యకు గురయ్యాడు. తీవ్రంగా కొట్టడంతోపాటు విద్యుత్ షాక్ ఇచ్చి అనంతరం ఉరివేశాడు. సేకరించిన, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గొడవర్రు గ్రామానికి చెందిన పెత్తందారు బొబ్బా బోసు ఇంట్లో ఉన్న గేదెలు, ఆవులు, పందెం కోళ్లను చూసుకునేందుకు అదే గ్రామానికి చెందిన పేరుబోయిన రామకృష్ణ, నాగలక్ష్మి చిన్న కుమారుడు గోపి(17) నెలకు రూ.3 వేలకు పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో పెత్తందారు బోసు గోపి ఇంటికి వెళ్లి ఇంకా పనికి రాలేదంటూ మందలించాడు. గోపి హడావుడిగా నిద్రలేచి పనికి వెళ్లాడు. పనులు చేసిన అనంతరం భోజనం చేసేందుకు మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్లి తిరిగి 3 గంటలకు మళ్లీ వెళ్లాడు. ఇంటి గేటు వద్ద ఉన్న బోసు ఆగ్రహంతో 'ఇంటికి వెళ్లి ఆలస్యంగా వస్తావా' అంటూ గోపీని తన్నుకుంటూ ఇంట్లోకి లాక్కెళ్లాడు. అంతేగాక ఇంటి వరండాలో విద్యుత్ బోర్డులో గోపి చెయ్యిపెట్టి షాక్‌కు గురయ్యేలా చేశాడు. అయితే గోపిని పట్టుకుని ఉన్న బోసుకు కూడా షాక్ తగలడంతో ఒక్కసారిగా గోపీని వదిలివేశాడు. అక్కడి నుండి గోపీని ఈడ్చుకుంటూ పశువుల చావడిలోకి తీసుకెళ్లాడు. అనంతరం చావడిలో ఉన్న వాసానికి ఉరివేసి చంపేశాడు. అక్కడి నుండి గోపి ఇంటికి వెళ్లి "నీ కొడుకును చంపా.. ఇంట్లో చావడికి వేళ్లాడుతున్నాడు" అని బోసు చెప్పి హడావుడిగా వెళ్లిపోయాడు. దీంతో గోపి తల్లి నాగలక్ష్మి పరుగున బోసు ఇంటికి వెళ్లి చూసేసరికి గోపి చావడిలో వాసానికి వేళాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గోపి మృతిచెంది ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోసు వచ్చేంత వరకూ మృతదేహాన్ని అక్కడి నుండి తరలించేదిలేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. సమాచారం అందుకున్న తూర్పు జోన్ ఎసిపి విజయభాస్కర్, సిఐ కె.శ్రీధర్‌కుమార్, ఎస్ఐ హనీష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గోపిని కొట్టుకుంటూ ఇంట్లోకి తీసుకురావడం చూసిన ఆకునూరి లక్ష్మి, దుర్గ, మరో మహిళ నుండి వివరాలు సేకరించారు.

పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు

గోపి మృత్యువాతపడిన విషయాన్ని తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో బోసు ఇంటి వద్దకు చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేంత వరకూ ఇక్కడి నుండి మృతదేహాన్ని తరలించేదిలేదన్నారు. గొడవర్రు సర్పంచి కోనేరు భానుప్రసాద్, మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో పోలీసులు మంతనాలు జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని, అందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. అయితే హత్యకు కారణమైన బోసును అరెస్టు చేయాలని మృతుడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా సింధూ బాధ్యతలు



అమరావతి : ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధూ డిప్యూటీ కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా గొల్లపూడి లోని ఆంధ్రప్రదేశ్ పరిపాలన (సిసిఎల్ఎ) కమిషనర్ కార్యాలయంలో సిసిఎల్ఎ ప్రధాన కమిషనర్ అనిల్‌కుమార్ పునేతాను కలిసి ఉద్యోగంలో చేరుతున్నట్టు రిపోర్ట్ చేశారు. అయితే ఆమెకు ఎటువంటి బాధ్యతలూ అప్పగించలేదు. మరి కొన్ని రోజుల్లో ఈ అంశం పై స్పష్టత వచ్చే అవకాశముంది. గతేడాది ఆగస్టులో జరిగిన ఒలింపిక్స్‌లో బ్యాట్మింటన్ విభాగంలో రజత పతకం సాధించిన సింధూకు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇటీవలే ఆమెకు డిప్యూటీ కలెక్టర్‌గా నియామక పత్రాన్ని సిఎం చంద్రబాబు అందజేశారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

నవతెలంగాణ-పాల్వంచ



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సున్నం రాజయ్య

జెన్‌కో కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ ఐదో గేటు ఎదుట అఖిల పక్షం ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నుంచి బుధవారం వరకు బైటాయించారు. ఈ క్రమంలోనే పోలీసులు కార్మికులపై లాఠీచార్జికి దిగారు. కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేశారు. పోలీసుల నిర్బంధం మధ్య కార్మికుని మృతదేహాన్ని తరలించారు. న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు చేయనివ్వబోమని కుటుంబ సభ్యులు, కార్మికులు తేల్చిచెప్పటంతో జెన్‌కో అధికారులు దిగొచ్చారు. న్యాయం చేస్తామని హామీనివ్వటంతో అంత్యక్రియలు జరిపారు.

కేటీపీఎస్ ఐదో గేటు ఎదుట బుధవారం తెల్లవారుజాము నాలుగు గంటల వరకు అఖిలపక్షం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన కొనసాగించారు. మధ్యలో జెన్‌కో అధికారులు థర్మల్ డైరెక్టర్ సచ్చిదానందం, చీఫ్ ఇంజనీర్ టిఎస్ఎన్. మూర్తి, గేటు దగ్గరకు వచ్చి అఖిలపక్షం నాయకులు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీఐటీయూ జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణలతో చర్చలు జరిపారు. తక్షణమే కుటుంబానికి సీఎల్ ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. కానీ, ఇతర డిమాండ్లకు అంగీకరించకపోవడంతో అఖిలపక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్లన్నీ నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో సీఐ షుకూర్ పోలీసు సిబ్బందితో కలిసి అఖిలపక్ష నాయకులు అరెస్ట్ చేసి బలవంతంగా నెట్టుకుంటూ వాహనం ఎక్కించారు. దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల నిర్బంధం మధ్య ట్రాలీ ఆటోలో నాగేశ్వరరావు మృతదేహాన్ని బొల్లోరిగూడెంకు తరలించారు. పోలీసులను అడ్డుకోబోయిన మృతుని కుటుంబ సభ్యులను పోలీసులు నెట్టేశారు. జెన్‌కో యాజమాన్యం, పోలీసుల తీరుకు నిరసనగా ఎన్‌టీపీసీ కార్మికులు పాల్వంచ బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్ సందర్భంగా కార్మిక సంఘ, అఖిలపక్షం నాయకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నాగేశ్వరరావు ఇంటికి చేరుకున్నారు. న్యాయం జరిగేదాకా అంత్యక్రియలు జరగనివ్వబోమని అఖిల పక్షం నాయకులు కాసాని ఐలయ్య, కోనేరు చిన్ని, వనమా రాఘవేంద్రరావు, బరిగెల సాయిలు మృతుని ఇంటి వద్ద బైటాయించారు. జెన్‌కో అధికారులకు డీఎస్పీ సమాచారం ఇవ్వగా... కార్మిక సంఘాల నాయకులను చర్చలకు పిలిచారు. మృతుని కుటుంబానికి తక్షణమే మూడున్నర లక్షల రూపాయలతో పాటు ఒకరికి సీఎల్ ఉద్యోగం ఇస్తామని అధికారు లు చెప్పారు. మరో రెండు డిమాండ్లను పరిశీలిస్తామని హామీనిచ్చారు. దీంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్మికుని మృతదేహానికి నివాళులర్పించారు.

పకడ్బందీగా హజ్ ఏర్పాట్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నుంచి మక్కా, మదీనాకు వెళ్లే హజీలు హజ్‌హౌస్‌లో ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని జిల్లాల నుంచి ఈనెల రెండో వారంలో హజ్‌కు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో హజీలు హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న విషయం తెలిసిందే.

మోడీ సర్కార్‌పై అసదుద్దీన్ ఆగ్రహం

హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసీ కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై తీవ్రమైన విమర్శలు చేశారు. మజ్లిస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వాహెదుద్దీన్ ఒవైసీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి ముర్గీచౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

రేపు సమావేశం ఉన్నట్టా..? లేనట్టా..?

హైదరాబాద్ : ఈనెల 11న డీఎస్సీ నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్టు డిప్యూటీసీఎం కడియంశ్రీహరి వరంగల్‌లో చెప్పారు. బుధవారం సాయంత్రం వరకూ ఈసమావేశానికి సంబంధించి ఎటువంటి సమాచారం లేదని పాఠశాల విద్యాశాఖఅధికారులు ప్రకటించారు. దీంతో ఈ సమావేశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గజల్ శ్రీనివాస్‌కు అఫ్ఘనిస్తాన్ ఒలింపిక్ శాంతి పతకం

నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్

గజల్ గాయకులు శ్రీనివాస్‌కు అఫ్ఘనిస్తాన్‌లో శాంతి యాత్రను ప్రశంసిస్తూ ఒలింపిక్ అధ్యక్షులు డా.మొహమద్ జహీర్ అక్బర్ ఒలింపిక్ అసోసియేషన్ అత్యున్నత శాంతి గౌరవ పతకాన్ని అందజేసి సత్కరించారు. అఫ్ఘనిస్తాన్ యూత్ సినిమా కౌన్సిల్ ఒక ప్రత్యేక సమావేశంలో చలనచిత్ర సూపర్‌స్టార్ సలీం షాహిన్ శాంతిదూత పురస్కారంతో శ్రీనివాస్‌ను సన్మానించారు.

'గిరిజన రిజర్వేషన్లను 9 శాతానికి పెంచాలి'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

గిరిజన రిజర్వేషన్లను 9 శాతానికి పెంచాలని గిరిజన సహకార సంస్థ చైర్మెన్ మోహన్ గాంధీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వెంటనే అసెంబ్లీ ఏర్పాటు చేసి గిరిజన రిజర్వేషన్ల బిల్లును పెట్టాలని కోరారు. బుధవారం గిరిజన సంక్షేమ భవన్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోహన్‌గాంధీ మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న అధికారులు నిజాయితీగా పని చేయాలని సూచించారు. ప్రొఫెసర్ భూక్యా భంగ్యా మాట్లాడుతూ ఇప్పటికైనా గిరిజనులను చూసే విధానంలో బ్రిటీష్ విధానాన్ని మార్చుకోవాలన్నారు. గిరిజనుల సమస్యలను మానవీ యకోణంలో చూడాలని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ లక్ష్మణ్ మాట్లాడుతూ గిరిజనులకు విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

జీఎస్టీపై ఏజెన్సీలకు అవగాహన కల్పించాలి : సీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీఎస్టీ ప్రభావం వల్ల అభివృద్ధి పనుల్లో వేగం తగ్గకుండా సంబంధిత ఏజెన్సీలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో జీఎస్టీపై అవగాహన, వివిధ అభివృద్ధి పనులపై పడే ప్రభావంపై ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

మోత్కుపల్లికి త్వరలో శుభవార్త:వెంకయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపరాష్ట్రపతిగా తెలుగుబిడ్డ ముప్పవరం వెంకయ్యనాయుడు ఎన్నిక కావడం గర్వకారణమని తెలంగాణ తెలుగుదేశం నేతలు కొనియాడారు. బంజారాహిల్స్‌లోని వెంకయ్యనాయుడు నివాసానికి వెళ్లిన ఆ పార్టీ అధ్యక్షులు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వరరావు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి అరవింద్ కుమార్‌గౌడ్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. వెంకయ్యనాయుడు ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ మోత్కుపల్లికి త్వరలో గవర్నర్ పదవి దక్కబోతోందని వ్యాఖ్యానించినట్టు పార్టీవర్గాలు చెప్పాయి. కాగా గులాబీ కూలీ పేరిట టీఆర్ఎస్ సర్కారు మంత్రులు చట్టవిరుద్ధంగా బహిరంగ దోపిడీకి పాల్పడ్డారని తెలుగుదేశం తెలంగాణ శాఖ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ. రేవంత్‌రెడ్డి విమర్శించారు. అవినీతికి పాల్పడిన ఆయా మంత్రులను వచ్చే ఎన్నికల్లో పోటీచేయడానికి అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి, కేంద్ర హోంశాఖకు, సీబీఐ. రాష్ట్ర ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రజల్లోనే ఉంటా : వెంకయ్య

ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించినా... ప్రజల్లో ఉండేందుకే ఇష్టపడతానని ఎమ్ వెంకయ్యనాయుడు అన్నారు. అయితే రాజకీయాల గురించి ఇకపై మాట్లాడబోనని, రాజ్యాంగ పరిధిలో ప్రజలతో ఎలా మమేకం కావాలో ప్రణాళికలు రూపొందించుకొనే పనిలో ఉన్నానని చెప్పారు. దీనికోసం మాజీ ఉప రాష్ట్రపతుల పరిపాలనా తీరుపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. బుధవారంనాడాయన హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇదే తన చివరి విలేకరుల సమావేశమని కూడా ఆయన చెప్పారు. కాగా వస్తుసేవల పన్ను (జీఎస్టీ)పై ముఖ్యమంత్రి కేసీఆర్ అంసదర్భ ప్రేలాపనలు చేస్తున్నారని బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు.

'ఆర్ఎస్ఎస్ బ్రిటీష్ ప్రభుత్వానికి సహకరించింది'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో మతతత్వం, నిరంకుశత్వం పెరిగిపోయిందని, ప్రజల ప్రజాస్వామిక హక్కులు యథేచ్ఛగా కాలరాయబడుతున్నాయని, దళితులు, గిరిజనులు, మైనార్టీ, మహిళలు నిత్యం అణచివేతకు గురవుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ బ్రిటీష్ ప్రభుత్వానికి సహకరించిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినట్టు ఆర్ఎస్ఎస్ గొప్పలు మాట్లాడుతుందని చెప్పారు. బుధవారం 75వ క్విట్ఇండియా వేడుకల సందర్భంగా ఆయన జెండావిష్కరించారు. అహ్మద్‌పటేల్ ఎన్నికల విషయంలో బీజేపీ అనేక రాజ్యాంగేతర పనులు చేసినా కూడా ప్రజాస్వామ్యం విజయం సాధించిందని, ఇది బీజేపీకి చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి విమర్శించారు. సంగారెడ్డికి కేటాయించిన మెడికల్ కాలేజీని కేసీఆర్ సిద్ధిపేటకు తరలించారని అందుకు నిరసనగా సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఈ నెల 15న అమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్ల నియోజకవర్గంలో నేరెళ్లలో దళితులు, బీసీలపై పోలీసులు దాడి చేసి, వారిచిత్రహింసలు పెట్టారని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం ఢిల్లీలో జాతీయ మానవహక్కుల సంఘానికి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆర్‌సీ కుంతియా నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు.

నేడు ప్రభుత్వ వైఖరిపై రౌండ్ టేబుల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మీడియా, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులతోపాటు ప్రభుత్వ వైఖరిపై పలు జర్నలిస్టు సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నాయి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య(టీడబ్ల్యూజేఎఫ్), తెలంగాణ ఇంగ్లీషు జర్నలిస్టుల అసోసియేషన్(టీఈజేఏ), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే), నేషనల్ అలయేన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే), తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియే షన్(టీబీజేఏ) సంఘాల ఆధ్వర్యంలో జరగనుంది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు దొడ్డి కొమరయ్య హాల్(మినీ హాల్) రౌండ్ టేబుల్ చేపట్టనున్నారు.

నేడు గాంధీ ఆస్పత్రిలో 65 ఐసీయూ పడకల ప్రారంభం

- హాజరు కానున్న గవర్నర్ నరసింహన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతిష్టాత్మక గాంధీ ఆస్పత్రిలో మరో 65 ఐసీయూ పడకలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం పది పడకలతో కొనసాగుతున్న ఇక్కడి ఐసీయూని 110 పడకలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రూ.10 కోట్ల వ్యయంతో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని సిద్ధం చేసింది. అత్యాధునిక హైడ్రాలిక్ పడకలతో ఏర్పాటు చేసిన ఈ ఐసీయూని గవర్నర్ నరసింహన్ గురువారం ప్రారంభిస్తారు. వివిధ ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య పరీక్షల కోసం అత్యాధునిక ఆల్ట్రాసౌండ్, ఎక్సరే మిషన్లను ఇప్పటికే సిద్ధమయ్యాయి. గతంలో ఆపదలో ఐసీ యూ విభాగానికి చేరుకున్న రోగులకు సకాలంలో వైద్యసేవలు అందేవికావు. సీనియర్లు లేక పోవడంతో అక్కడ ఉన్న పీజీలు కేవలం బాధితుల వివరాలు నమోదు చేసుకుని సం బంధిత విభాగానికి తరలించాల్సి వచ్చేది. వైద్య పరిభాషలో గోల్డెన్ అవర్‌గా చెప్పుకునే 30 నుంచి 60 నిమిషాల వ్యవధిలోనే ఆస్పత్రికి తీసుకొచ్చినా రోగి ప్రాణాలు దక్కేవికావు. దీంతో ఒక్కోసారి వైద్యులు బాధితుల ఆగ్రహానికి గురికావాల్సి వచ్చేది. ఇకపై ఇలాంటి ఇబ్బందులు తప్పుతాయని అధికారులు భావిస్తు న్నారు.

ఈసీ ఏఎన్ఎంల పోలీసు నిర్బంధం

- సమస్యలపై చర్చించుకుంటుండగా ఘటన
- గ్రాస్‌సాలరీ చెల్లించకపోతే ఎంఆర్ వ్యాక్సిన్‌కు దూరం : ప్రసన్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూరోపియన్ కాంట్రాక్టు ఏఎన్ఎంలను పోలీసులు నిర్బందించారు. మరికొంత మందిని అరెస్టు చేసి సుల్తాన్‌బజార్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై పలువురు ఈసీఏలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై చర్చించుకునేందుకు సమావేశమైతే అరెస్టులు, నిర్బంధం చేస్తారా అంటూ యాదాద్రి పీహెచ్‌సీకి చెందిన విజయ అనే ఏఎన్ఎం మండిపడ్డారు. కాగా, ఈ నెల 8న కొంతమంది ఏఎన్ఎంలు జగిత్యాల్‌లో ఎంపీ కవితను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. ప్రధానంగా గ్రాస్ సాలరీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారు. సమస్యను సీఎం కేసీఆర్‌కు వివరిస్తానని హామీనిచ్చారు. ఇదే విషయాన్ని మిగతా ఏఎన్ఎంలకు తెలియజేసేందుకు కోఠిలోని మేఘరాజ్ ఫంక్షన్ హాల్లో బుధవారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. సుమారు 200 మంది వరకు హాజరయ్యారు. అకస్మాత్తుగా పోలీసులు అక్కడికి చేరుకొని అరెస్టులు, నిర్బంధించడంతో నివ్వెరపోయారు. కాగా, ఇటీవల వీరు ప్రగతిభవన్ ముట్టడించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా హాల్ పక్కనే ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ప్రధాన కార్యాలయం ఉంది. ఈ నేపథ్యంలో ఏదైనా పథకం వేశారేమోననే అనుమానంతో పోలీసులు ముందుజాగ్రత్తగా మూడు గంటలపాటు నిర్బంధించారు. సాయంత్రానికి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ మహిళా విభాగం నాయకురాలు ప్రసన్న మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీలోపు అర్హులైన ఈసీ ఏఎన్ఎంలు అందరికి గ్రాస్ సాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న మీజిల్స్-రూబెల్లా కార్యక్రమానికి దూరంగా ఉంటామని హెచ్చరించారు. ఇదే విషయాన్ని తాము ఎంపీ కవితకు స్పష్టం చేసినట్టు 'నవతెలంగాణ'కు తెలిపారు.

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత




బి.వి. రాఘవులు

– 6–

(సోమవారం తరువాయి భాగం)

రెండో ముఖ్యమైన విషయం బూర్జువా ఆర్థిక వేత్తలకి, మార్క్స్ యొక్క ఆర్థిక శాస్త్రానికి తేడా ఏంటంటే..ఆర్థిక పరిస్థితుల్ని, ఆర్థిక పరిణామాల్ని లేకపోతే ఆర్థికశాస్త్రంలో వాడే భావాల్ని మార్క్స్ సామాజిక సంబంధాల వ్యక్తీకరణగా చూస్తాడు. బూర్జువా ఆర్థికవేత్తలు వస్తువుల మధ్య సంబంధాలుగా చూస్తారు. ధర అంటే మనం రోజూ చూసే పద్ధతి ఏంటి.? ధర అంటే ఒక వస్తువుకి, ఇంకో వస్తువుకి ఉండే సంబంధంగా చూస్తాము. ఈ వాచీ 100 రూపాయలు. ఈ సెల్‌ఫోన్ 40 వేల రూపాయలు. కాబట్టి ఈ వస్తువుకీ దానికి మధ్య సంబంధం వీటి మధ్య ఉండే నిష్పత్తి సంబంధంగా మనం చూస్తాము. మార్కెట్‌కు పోతే మీకు ఒక కేజీ వంకాయలు..ఇంకో చోట ఒక సబ్బు కనబడుద్ది. ఈ సబ్బుకు ధర, వంకాయలకు ధర మనకు వస్తువుల మధ్య సంబంధాలుగా కనబడుతాయి. కానీ మార్క్స్ చెప్పేదేంటంటే ఇది వస్తువుల మధ్య సంబంధం కాదు. ఈ ధరలన్నీ ఈ వస్తువు ధరలో ఉండే శ్రమకీ, ఆ వస్తువు ధరలో ఉండే శ్రమకీ మధ్య నిష్పత్తి. ఈ శ్రమ చేసిన మనిషికీ, ఆ శ్రమ చేసిన మనిషికీ మధ్య ఉండే సంబంధం. కాబట్టి ఇది మనుషుల మధ్య సంబంధాలు కానీ వస్తువుల మధ్య సంబంధాలు కావు. కాబట్టి సమాజంలో ఉండే ఉత్పత్తి చేసే మనుషులు ఆ ఉత్పిత్తిలో కొంత కొంత శ్రమను కొన్ని సరుకుల మీద వినియోగిస్తున్నారు. ఈ మనుషుల శ్రమల మధ్య ఉండే నిష్పత్తి సంబంధాలే ధరల మధ్య సంబంధాలుగా మనకు బయటకు కనబడుతాయి. బయటికి ధరల మధ్య సంబంధాలంటే ధరలు వస్తువులకు ఉంటాయి కాబట్టి వస్తువుల మధ్య సంబంధాలుగా మనకి కనబడుతాయి. వాటికి పునాది మనుషుల శ్రమల మధ్య సంబంధాల దగ్గర ఉంది. ఈ సబ్బును తయారు చేయడానికి రెండు గంటలు శ్రమ చేయాలి, ఇంకో సెల్‌ఫోన్ తయారు చేయడానికి 40 గంటలు, ఇంకో కారుని తయారు చేయడానికి 400 గంటలు పట్టొచ్చు. కాబట్టి ఈ నిష్పత్తుల యొక్క సంబంధం. ఈ నిష్పత్తులన్నీ ధరల రూపంలో వ్యక్తమవుతాయి. అందుకని వస్తువుల మధ్య సంబంధాలు వాస్తవంగా మనుషుల మధ్య సంబంధాల యొక్క వ్యక్తీకరణ. కాబట్టి మనుషుల మధ్య సంబంధాలను బయటకి తీయడమే నిజమైన ఆర్థ శాస్త్రం. మనకు కనబడే వాటినే చెప్పి అది అర్థశాస్త్రం అని అనడం అవివేకం. కనబడే వాటికి వెనకున్నదేమో చూపిస్తే అదీ అర్థశాస్త్రం. కనబడే దాన్నే చెప్పడానికైతే శాస్త్రమెందుకండీ. ఇప్పుడూ చంద్రుడున్నాడు. సూర్యుడున్నాడు. భూమి ఉన్నది. చంద్రుడు అక్కడున్నాడు. సూర్యుడు అక్కడున్నాడు. భూమి ఇక్కడుంది అని చెప్పడానికి ఎ ందుకండీ శాస్త్రం. ఈ సూర్యుడు, భూమికి ఆకర్షణ శక్తి ఉంది. ఈ ఆకర్షణతోనే చుట్టూ తిరుగుతున్నయి. ఈ ఆకర్షణ శక్తితోనే అవి ఆ స్థానాలలో ఉన్నయి. అని చెప్పడమే శాస్త్రం. ఒక రాయేస్తే పైకి కొంత దూరంబోయి కింద పడుతుంది. రాయి పైకేస్తే కిందపడుతుంది అని చెప్పడానికి శాస్త్రమెందుకండీ. భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉంది. దాని మూలంగా పైకి విసిరిన ఏ వస్తువైనా కిందికి వస్తుంది అని చెప్పడం శాస్త్రం. అందుకని మార్క్స్ చెబుతడు. శాస్త్రం అంటే ఉన్నది చెప్పడం కాదు. కనపడేది చెప్పడం కాదు. కనపడేదాని వెనకేదుందో చెప్పడం. బూర్జువా ఆర్థికశాస్త్రం కనపడేది చెప్పుద్ది. ఆ కనపడేది కాస్త లెక్కలేసి చెప్పుద్ది. కూడికలూ తీసివేతలేసి చెప్పుద్ది. ఇంకా కంప్యూటర్లొచ్చాయి కాబట్టి రకరకాల ఫార్ములాలు, ఆల్జీబ్రాలు చెప్పుద్ది అంతే తప్ప దాని వెనుకున్న నిజాలు చెప్పదు. దీన్నే నిజమైన శాస్త్రమంటే ఏం చేయాలని చెప్పేసి డెవిడ్ హార్వే అనే మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రవేత్త చెబుతాడు. పెట్టుబడి గ్రంథమెట్లుంటదంటే ఉల్లిపాయలాంటదట. ఉల్లిగడ్డ ఒక పొర ఒలిస్తే ఇంకోపొర. దాన్ని ఒలిస్తే ఇంకోపొర కనబడుద్ది. ఇంకోటొలిస్తే లోపల గడ్డ కనబడుద్ది. అంటే ఉల్లిపాయను అర్థం చేసుకోవాలంటే కేవలం పైననే చూస్తే అర్థం కాదు. ఒకసారి లోపలికెళ్లి మళ్లీ ఒక్కో పొరా కప్పుతూ వస్తే తిరిగి ఉల్లిగడ్డ కనబడుద్ది. కాబట్టి ఉల్లిగడ్డనెలా పొరలు పొరలుగా తీసి లోపలున్నదేంటో చూసి మళ్లీ పొరలు కప్పుకుంటూ మళ్లీ ఉల్లిపాయ అని మనం ఎలా చెబుతామో సమాజాలను కూడా, ఆర్థిక విషయాలను కూడా పై పొరను చూసే ఉల్లిగడ్డ అనుకోకూడదు. పై పొరను తీసి లోపలున్నదేమో చూసి ఆ ఆలోపలున్నదాన్ని బయటకు చెప్పడమే నిజమైన



ఆర్థికశాస్త్రం అని చెబుతాడు. అదీ మార్క్స్ చేశాడు. డబ్బు అనేది మనకు పైకి కనబడేది. ఆ పైకి కనబడేదాన్నుంచే అనేకనేక సామెతలొచ్చాయి. డబ్బుంటే కొండమీది కోతినైనా తీసుకొచ్చేయొచ్చని. ఆ డబ్బుకోసమే దొంగతనాలు, దోపిడీలు, యుద్ధాలు చేస్తున్నారు. నిజంగానే కొండమీదున్న కోతిని తీసుకొచ్చేది కాబట్టే ఇలా జరుగుతోంది. ఆ కొండమీదుండే కోతిని తీసుకొచ్చే శక్తి ఈ డబ్బుకు ఎట్లొచ్చింది. మార్క్స్ అంటాడూ..డబ్బుకు ఆశక్తి లేదు. దానికి మనుషులు ఆ శక్తిని ఇచ్చారు. నేను చిల్లపెంకలుతీసుకొొచ్చి ఇచ్చేయమంటే ఇస్తావా నువ్వు. తుగ్లక్ తోలు తెచ్చి గుండ్రంగా కత్తిరించి ఇచ్చాడు. నాలుగు రోజులు పనిచేశాయి. తర్వాత దాన్ని వొదిలేశారు. ఎందుకని అలా జరిగింది. మన దగ్గరి ఈ కాగితం డబ్బు కాగా లేంది ఆ తోలెందుకు డబ్బుకాదు. మనం చిన్నపిల్లలుగా ఉన్నపుడు ఆడుకుంటాము. పెంకులన్నింటినీ ఒక దగ్గరేసి లెక్కలేసుకుంటాము. లెక్కలవరకే పనికొస్తాయి. డబ్బనేది ఇవాల సామాజిక సంబంధాల వ్యక్తీకరణ. మనమందరమూ సమాజమందరమూ కూర్చొని సోషల్ అగ్రిమెంటుకొచ్చి ఇదిగో దీన్ని డబ్బుగా మనం అంగకరిద్దాము. ఈడబ్బుని ఎవరైనా ఎక్కడైనా అంగీకరించి ఒకరికొకరు ట్రాన్సాక్షన్ చేసుకోవచ్చు అనుకున్నాము. కాబట్టి అది డబ్బు అయ్యింది. అందుకని సామాజిక సంబంధాన్ని ఇది వ్యక్తం చేసుద్ది తప్ప దానికి అంతర్గత విలువ లేదు. అందుకని ఆర్థిక అంశాలను దానికి వెనకేదుందో తీసుకొచ్చి దాన్ని చూపించడం డబ్బు విషయంలో కూడా మనం చూడొచ్చు. కాబట్టి పెట్టుబడిదారీ విధానానికి సంబంధించి మనకు పైపై విషయాలు కనబడుతయ్. ఆ కనబడేవన్నీ ఫినామినా అంటాం. అవి సంపూర్ణమైన వాస్తవాలు కాదు. పైపైన చూస్తే కనిపించే వాస్తవాలు. కేవలం అప్పియరెన్స్. గతితార్కిక భౌతికవాదంలో దృగ్విషయాలు, సారాంశం అంటాం అప్పియరెన్స్ అండ్ ఎసెన్స్. మనకు కనిపించేవన్నీ అప్పియరెన్సెస్ లేదా దృగ్విషయాలు. ఫినామినా అంటాం. అటువంటి వాటినే శాశ్వతమని బూర్జువా శాస్త్రవేత్తలు చెబుతారు. వాటి వెనక అడుగునేముందో తీయడమే కారల్‌మార్క్స్ పెట్టుబడి గ్రంథంలో చేశాడు. దానికి సంబంధించి కొన్ని ఉదాహరణలు నేను తర్వాత చెబుతాను.

(తరువాయి భాగం సోమవారం సంచికలో)



చాకేటి రాజు

ప్రజాస్వామ్యం– 'ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కొరకు ప్రభుత్వ రూపమే ప్రజాస్వామ్యం' అని అబ్రహం లింకన్ ఉపోదేటించాడు. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు, ప్రజలే నిర్ణయాధికారులు. ఇంతవరకు బాగానే ఉంది, మరీ ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు అయినప్పుడు సమాజంలో వారే ఎందుకు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు? ప్రజలే నిర్ణయాధికారులు అయినప్పుడు వారి నిర్ణయాలు పాలన విధానంలో ఎందుకు అమలు కావు? ఇక్కడ ప్రజాస్వామ్యం అనే భావన విఫలమైందని కాదు, దాని ఆచరణ పద్ధతియే ఉనికిని కోల్పోతుందని వివరణ. దీనికి కారణం పాలక వర్గాల మెదడులో నాటుకుపోయినా సంకుచిత ఆధిపత్య ధోరణి. ఒకవర్గం వారిని అధికారంలోకి రాకుండా మరొకవర్గం అహర్నిశలు ప్రయత్నించటం ప్రజాస్వామ్యానికి పట్టిన చీడ పురుగులాంటిది. ఇదంతా ఎందుకంటే, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని "సామాజిక తెలంగాణకై ప్రజాస్వామ్య పోరాటం"గా అభివర్ణించారు కాబట్టి. నాడు ఉద్యమానికై కనిపించిన సామాజిక తెలంగాణ నేడు ప్రభుత్వ పరిపాలనలో కనుమరుగైందని ఆరోపణ.

తెలంగాణ రాష్ట్ర విషయానికి వస్తే ఉద్యమ నేపథ్యం, దాని వాగ్దానాలు, లక్ష్యాలు ప్రభుత్వ పాలన విధానంలో స్పష్టంగా ప్రతిబింబించాలి. రాష్ట్రంలో ఉన్న జనాభా నిష్పత్తిని గమనిస్తే దాదాపు 90శాతం వెనుకబడిన, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రాతినిథ్యం ఉంది. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఈ అణగారిన వర్గాల పోరాటం, తెగువ మరువలేనిది. ప్రాంత వెనుకబాటుతనం, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో చిన్నతనం వంటి ముఖ్యాంశాలను తెలంగాణ ఉద్యమంలో ఉదాహరించవచ్చు. అణగారిన వర్గాల వారికి రాజకీయ అవకాశాలను కల్పించి ప్రభుత్వ పరిపాలనలో భాగస్వామ్యం చేయడం చాలా ప్రధానమైన అంశం. రాజకీయ సమానత్వం, సాధికారత లేకుండా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని ఆశించటం నిష్ఫలం. సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న బడుగు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వ పాలనలో మొండిచేయి ఉద్యమ ఆశలను నీరు కార్చటమే. తెలంగాణకి మొట్టమొదటి ముఖ్యమంత్రి దళిత వ్యక్తే అవుతారని, సామాజిక సాధికారతే లక్ష్యమని అరచేతిలో వైకుంఠం చూపించడం జరిగింది. పాలక వర్గాల్లో కూడా బలహీన

సామాజిక తెలంగాణమా

ఏదీ నీ చిరునామా?

వర్గాల వారు కొందరు ఉన్నప్పటికి వారికి తూతూ మంత్రంగా ఏవో ప్రాధాన్యంలేని శాఖలను ఇచ్చి సామాజిక న్యాయం చేసామని చేతులు దులుపుకోవటం వారి అవకాశాలకు తూట్లు పొడవటమే కాకుండా అవమానించటం లాంటిదే. సమర్థవంతమైన నాయకులు ఉన్నప్పటికి వారిని పాలకవర్గం అదుపులో పెట్టుకోవటం, వారినుంచి ఆశించి గెలిపించిన సామాజిక వర్గానికి మోసం చేయటమే అవుతుంది.బలహీన వర్గాల ఓట్ల ఆధారంగా గెలిచిన కొందరు నాయకులను తొత్తులుగా ఉపయోగించుకోవటం, వ్యతిరేకంగా మాట్లాడిన వారిని వేదించటం, ఇతర ఉద్యమ నాయకులను గుర్తించకపోవటం ఎంతమాత్రం ప్రజాస్వామ్య పరిపాలన అనిపించుకోదు. ఇందులో భాగంగా ఎస్సీలకు ఇస్తామన్న మూడెకరాల భూమి, రెండు పడక గదుల ఇండ్ల వంటి పథకాలు ముందుకు సాగటము లేదు. ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్ బిల్లు రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిన ఇంకా పూర్తి స్థాయిలో నోచుకోవటం లేదు. ఇలా ఉద్యమంలో వారికిచ్చిన వాగ్దానాలు ఒక్కసారి గుర్తుచేసుకోవటం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరు సామాజిక తెలంగాణ గూర్చి మాట్లాడతారు కాని దానిని ఆచరణలో పెట్టే నాయకులు ఎంతమంది ఉన్నారు.సామాజిక తెలంగాణ అంటే చేతి వృత్తుల వారిగా బడ్జెట్‌ని విభజించి కేవలం వారి వారి వృత్తినే ఎంచుకునేలా చేయటం కాదు. సామాజిక తెలంగాణ అంటే పదిగా ఉన్న జిల్లాలను 31 వరకు పెంచటం అంతకన్నా కాదు. సామాజిక తెలంగాణ అంటే జోనల్ వ్యవస్థను రద్దు చేయటం కాదు. సామాజిక తెలంగాణ అంటే పండుగలను ఆడంబరంగా నిర్వహిస్తు కోట్ల కానుకలు సమర్పించటం కాదు. నిజమైన సామాజిక తెలంగాణ అంటే అన్ని వర్గాల వారికి రాజకీయ వికేంద్రీకరణ కలిపించి ప్రభుత్వ విధాన రూప కల్పనలో వారిని సమ భాగస్వామ్యం చేయటం, ఉద్యోగాలలో, ఆర్థిక వనరుల పంపిణీలో న్యాయంగా సమాన అవకాశాలను కల్పించటం లాంటివి. ఇదేకదా తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన అంశం. ప్రత్యేక రాష్ట్రంలో మాత్రమే ఇది సాధ్యమవుతుందనే కదా బలహీన వర్గాలు, యువత, రైతులు, కళాకారులు ఏకమయింది.ప్రభుత్వం చేసే ఎటువంటి విధాన రూపకల్పనలో అయిన వీటిని దృష్టిలో ఉంచుకునే నిర్ణయం తీసుకోవాలి. అందుకే నాయ కులను నమ్మి, ఉద్యమంలో భాగంగా వారిని గుర్తించి ఓట్లు వేసి గెలిపించింది. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి పంథాలో నడిపించాల్సినా బాధ్యత ఎంతైన ఉంది. ఉద్యమ సమయంలో కనిపించిన నాయకత్వ స్ఫూర్తి రాజకీయ ప్రవేశం తర్వాత కనిపించక పోవటం నిరాశను కలిగించే అంశం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే "ఉద్యమంలో నాయకుడిగా విజయవంతమై గుర్తింపు తెచ్చుకున్నా, ప్రభుత్వంలోకి వచ్చే సరికి రాజకీయ పరిపాలకుడిగా నిరూపించుకోవటంలో విఫలం" అవ్వటం. దీనికిగాను కావల్సింది ధృఢమైన రాజకీయ సంకల్పం. ముఖ్యంగా ఇటువంటిది లోపించటం బాధకరం. ఈ విధంగా నాయకులలో కచ్చితంగా మంచి చేయాలనే దృఢ సంకల్పం ఉన్నప్పుడు మాత్రమే సమాజం మార్పునకు లోనై బడుగు, బలహీన వర్గాల వారికి రాజకీయ, ఆర్థిక రంగాలలో సమాన అవకాశలు కల్పించటమే నిజమైన సామాజిక తెలంగాణ.

–రచయిత పీహెచ్‌డీ. పరిశోధకుడు, జేఎన్‌యూ,న్యూఢిల్లీ
–సెల్: 9868328761

గ్రంథాలయ సేవకుడు 'కూరెళ్ళ'



డా. రవి కుమార్ చేగొని

ప్రభుత్వం ప్రారంభించక ముందే 1960 లో నాటి నల్లగొండ జిల్లా భువనగిరి మండలం లోని వడాయి గూడెం అనే గ్రామంలో "అక్షర ఉద్యమం" ప్రారంభించి అక్షరాస్యత ఉద్యమానికి పునాది వేశారు. పగటి పూట పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ రాత్రి పూట వయోజనుల కొరకు ఇల్లు ఇల్లు తిరిగి చదువు ప్రాముఖ్యతను చాటి చెప్పుతూ రాత్రి బడి నిర్వహించే వారు మన అక్షర కళా సామ్రాట్ కూరెళ్ళ విఠలా చారి గారు. వారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట మండలంలోని వారి అమ్మమ్మ గారి గ్రామమైన నిర్నేముల లో లక్ష్మమ్మ మరియు వెంకటరాజం దంపతులకు జూలై 09వ తేదిన 1938 లో జన్మించారు.

పల్లెలో కవితోద్యమం, ఊరూర పోతన పేరిట పల్లెలో ఉండి కవితా సేద్యం చేస్తున్న స జన కారులను వెలుగులోకి తేవడానికి "ఊరూర పోతన" అనే ఉద్యమం నిర్వహిస్తున్నారు. వారు చేస్తున్న ఈ మహా క్రతువులో ఎందరో పల్లె ప్రాంత నైపుణ్యం ఉన్న ఔత్సాహికులకు కవులుగా, సాహిత్య కారులుగా మరియు వాగ్గేయకారులు గా సమాజంలో మంచి గుర్తింపు పొందేందుకు ఒక దారి చూపిన కవితా శ్రీ మన కూరెళ్ళ విఠలా చారి. పల్లెల మీద ఉన్న అబిమానం తో వారు రాసిన గేయం

"పల్లియలోనె పుట్టితిని పల్లియయే నను పెంచె, పల్లియె ఇల్లును వాకిలిన్ కలిమినిచ్చె బతుక్కు మెరుంగుపెట్టె, ఆ పల్లియె"అమ్మ""అవనుచు" పలకులు పల్కగానేరిపించే, నా పల్లియె నాకు దైవతము ప్రాణము ఓ ప్రభు విఠలేశ్వారా!

వివిధ సాహిత్య, సాంస్క తిక, సామాజిక, విద్యా, ఆద్యాత్మిక సంస్థలను స్థాపించి పల్లె పట్టులలో, విద్యా వ్యాప్తికి , సాహిత్య వ్యాప్తికి, విజ్ఞానాన్ని అందించేందుకు ఆహర్నిశలు క షి చేసారు. వీరూ నగరాల్లో స్థిరపడిన గ్రామాలను, గ్రామ పట్టులను, సంస్క తిని, సాహిత్యాన్ని మరిచి పోతున్న చాలా మంది ఉన్నతుల వలె/విద్యాదికుల వాలే గాక కాకుండా తన స్వగ్రామం లోని తన ఇంటిని "సాయి సాహితి కుటిరం" గా ఏర్పరుచుకొని దానినే "ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయం' తీర్చిదిద్ది ఈ విజ్ఞాన ఆలయాన్ని (గ్రంథాలయాన్ని) ఈ సమాజానికి/జాతికి అంకితం చేసిన అభినవ వట్టికోట.

ఆచార్యుల వారు కొంత మంది పేద మరియు వికలాంగ విద్యార్దులను చేరదీసి వారికి ఇంటిలోనే ఆశ్రయం కల్పించి దాతల సహకారంతొ వారికి చదువు నేర్పించారు మరియు వారికి ఉన్నత చదువులు చదివేందుకు ఆర్దిక వనరులు కల్పించారు. కోందరికి ఉద్యోగాలు ఇప్పించి మరికోందరికి గ్రామాల్లో పాఠశాలలు పెట్టించారు. పల్లెలోం అనే ఉద్దేశ్యం తో నల్లగొండ జిల్లా లోని రామన్నపేట, వలిగొండ, చిట్యాల మరియు చౌటుప్పల్ పరిసర ప్రాంతాలల్లో గ్రంథాలయాల స్థాపనకు మరియు భారతుల స్థాపనకు నడుంబిగించారు మన అభినవ నల్లగొండ కాళోజి .

పల్లె ప్రాంత ప్రజలను, విద్యార్థులను నైతిక విలువలు గల, సామాజిక బాధ్యత గల, మానసిక వికాసాన్ని మరియు మానవతా విలువలు గల తయారు చేయడమే కాదు ఉత్తమ పౌరులుగా, నాణ్యమైన సమాజాన్ని తయారు చేయడంలో ఈ విజ్ఞాన కోవెల ల పాత్ర (గ్రంథాలయాల పాత్ర)వెలకట్టలేనిది అని భావించి తను ఉంటున్న ఇ0టినే గ్రంథాలయం గా మార్చిన సరస్వతి పుత్రుడు ఆచార్య కూరెళ్ళ విఠలా చారి గారు 13.02.2014 నాడు "ఆచార్య కూరెళ్ళ విఠలా చారి సాహిత్య గ్ర0థాలయం" స్థాపించారు. దాదాపు 16 వేల గ్ర0థాలు వివిధ విషయ పరిజ్ఞానం కల పుస్తకాలు, కథలు , నవలలు, సాహిత్య రచనలు, వివిధ గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర లు, రాజనితి, సాహిత్యం, ఆర్దిక, రాజకీయ, సాంఘిక అంశాలకు సంభందించినజాతీయ అంతర్జాతీయ విషయాలకు సంబందించిన గ్రంథాలు పల్లె ప్రాంతంలో ఉన్న ఈ గ్రంథాలయంలో సేకరించారు

పల్లెలల్లోని ప్రజలకు విద్యను అందించాలనే ఉద్దేశ్యం తో 1960 లోనే వడాయి గూడెం అనే పల్లెలో అక్షరాస్యత ఉద్యమాన్ని స్థాపించారు. వారు ఇల్లు ఇల్లు తిరుగుతూ సంతకం నెర్పేటందుకు ప్రయత్నం చేశారు పెద్దలకు పిల్లలకు రాత్రింబవళ్ళు తిరిగి విద్య నేర్పేటందుకు క షి చేశారు.

పల్లెలోని ప్రజలను మరియు యువతను సాంస్క తికంగా, సాహిత్య పరంగా, విద్యాపరంగా, సామాజికంగా, రాజకీయంగా చైతన్య పరచాలి అనే ఉద్దేశ్యం తో ఆచార్య కూరెళ్ళ చాలా చోట్ల " భారతి సంస్థలు" స్థాపించడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేశారు. ఆచార్య కూరెళ్ళ విఠలా చారి చేసిన సాహిత్య సేవకు మరియు రచనలకు వారిని వివిధ రూపాలలో వివిధ సంస్థలు బిరుదులతో సత్కరించారు వాటిలో అభినవ పోతన, మదుర కవి, ఆచార్య, సాహిత్య బ్రహ్మ, వెల్లంకి వేమన, నల్లగొండ కాళోజీ, కవితాశ్రి, అక్షర కళా సామ్రాట్, కవి భూషణ, సాహిత్య ప్రపూర?, మదుర కవితా కళానిది మరియు సుధీతిలకం మున్నగున్నవి. అస్ప్రుశ్యత నివారనోద్యమంలొ బాగ0గా నీర్నేముల గ్రామంలో1954 లో సబ్బండ వర్ణాల వారికి సహపంక్తి భోజనం ఏర్పాటు చేసి సామాజిక చైతన్యానికి మరియు సమైక్యతను చాటి



చెప్పిన మన సుదీ తిలక మన ఆచార్య కూరెళ్ళ

సుఖదు:ఖాలు సమంగా భావించి కష్ట పడే సుఖజీవులు, సుఖించే కష్టజీవులు అరుదుగా ఉంటారు. అట్టి అరుదైన వ్యక్తులుఒక ఆదర్శం కొసం,ఒక ఆశయం కొస, ఒక ద్యేయసాదన కొసంనిరంతరం శ్రమిస్తు ఇతరులను అనందింపచేస్తారు. అట్టి అరుదైన వ్యక్తుల్లోమన ఆచార్య కూరెళ్ళ విఠలా చారి ముందు వరసలో ఉంటారు.

(తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ గ్రంథాలయాలకు చేసిన సేవలకు ఆచార్య కూరెళ్ళ విఠలా చారి గారికి (ఉత్తమ గ్రంథపాలకునిగా) పురస్కారం ప్రకటించిన సందర్భంగా...)

ఫ్రెండ్లీ పోలీస్ అంటే ఇదేనా?



కిల్లె గోపాల్

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత పోలీసుశాఖకు చాలా ప్రాధాన్యతనిచ్చారు. పోలీసుస్టేషన్స్ ఆధునీకరణ, ఇన్నోవా వాహనాలు సమకూర్చడం, స్టేషన్ నిర్వహణ ఖర్చుకు నిధులు కేటాయించడం, పోలీసు ఉద్యోగాల రిక్రూట్‌మెంట్, రాష్ట్రస్థాయినుండి స్టేషన్ స్థాయి అధికారులతో ముఖ్యమంత్రి సమావేశాలు నిర్వహించడం, తదితర అంశాలు పరిశీలిస్తే ఈ ప్రాధాన్యత అర్థమవుతుంది.

రాత్రనక, పగలనక ప్రజల ధన, మాన ప్రాణాలను, శాంతిభద్రతలను కాపడడం తదితర బృహత్తర బాధ్యతలు నిర్వహించే ఈ శాఖకు, దీనిలోని సిబ్బంది, అధికారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంది.కానీ, కొన్ని సందర్భాల్లో ఈ శాఖలోని సిబ్బంది నుండి ఉన్నతాధికారుల వరకు సోయిమరిచి అధికారంలో వున్నవారి మెప్పుకోసం పడరాని పాట్లు పడడం మనరాష్ట్రంలో పదేపదే జరుగుతున్నవి. ఇలాంటి సందర్భంగా వెంటనే స్పందించాల్సిన హెూంశాఖామత్యులు, చివరకు ముఖ్యమంత్రి వీరిని వెనుకేసురావడం చూస్తే "ఫ్రెండ్లీ పోలీసు" అంటే ఎవరికి ఫ్రెండ్లీ అనే అనుమానం కలుగకమానదు. ఫ్రెండ్లీ పోలీసు అంటే అధికారంలోకి వున్నవారికా? కార్పొరేట్ శక్తులకా? మచ్చుకు కొన్ని సంఘటనలు పరిశీలిద్దాం.

1. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆ జిల్లాలో ఒక శాసనసభ్యుడు అసభ్యంగా వ్యవహరించారు. ఈ విషయం స్వయంగా కలెక్టరే పోలీసులకు ఫిర్యాదుచేయగా ఎఫ్.ఐ.ఆర్.చేయడానికి తాత్సారం చేశారు. చివరికి కలెక్టర్ తన మెజిస్ట్రీరియల్ అధికారాలు ఉపయోగించాల్సి వస్తుందని హెచ్చరిక చేస్తేతప్ప ఎఫ్.ఐ.ఆర్. నమోదు కాలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకే స్పందన ఇలావుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి?

2. భువనగిరి జిల్లా పల్లెర్ల గ్రామానికి చెందిన స్వాతి, అంబోజు నరేష్ కులాంతర వివాహం చేసుకున్నారు. అమ్మాయి తండ్రి ఫిర్యాదుపేరిట ముంబయిలో వున్నవారిని పిలిపించి, పెండ్లి పత్రాలను చించివేసి వారిని విడగొట్టి బెదిరించి అమ్మాయిని ఆమె తల్లిదండ్రుల దగ్గరకు పంపించారు. కానీ కొన్నిరోజులకే అమ్మాయి తిరిగి అబ్బాయిని కలుసుకోవడానికి ముంబాయి వెళ్ళింది. అమ్మాయితండ్రి కుట్రపన్ని పథకం ప్రకారం అబ్బాయిని మాయచేశారు. అతనితండ్రి ఫిర్యాదు చేసినా పోలీసుశాఖలో కదలిక లేదు. హైకోర్టు జోక్యంతోనే కేసులో కదలిక వచ్చింది. చివరకు అమ్మాయి ఆత్మహత్య అనుమానాస్పదం కాగా అబ్బాయి ఆచూకే తెలియకుండా పోయింది. ఈసమస్యలో తర్వాత ఫిర్యాదుచేసినప్పటికీ సకాలంలో స్పందించలేదు. కోర్టు జోక్యంతో పోలీసులు ఇంటరాగేషన్‌లో అమ్మాయి తండ్రి అబ్బాయిని చంపి కాల్చివేసినట్టు పోలీసులకు చెప్పాడు. అతను చెప్పిన మాటల్నే నమ్మి వాస్తవాలను పరిశీలించే ప్రయత్నం చేయలేదు. ఇటీవల అబ్బాయి ఎముకలు, సగంకాలిపోయిన బట్టగుడ్డలు గుట్టపై పశువుల కాపరి గమనించి సమాచారంఇచ్చాడు. అంటే పోలీసు విచారణ ఎంత లోపభూయిష్టంగా వుందో తెలుస్తుంది. పోలీసులపాత్ర అడుగడుగునా అనుమానాలకు తావిస్తోంది.

3. సిరిసిల్ల జిల్లా నేరెళ్ళలో జరిగిన ఇసుకలారీ ప్రమాదం విషయాన్ని పరిశీలిస్తే జులై 2న భూమయ్య అనే గిరిజనుడు లారీ ప్రమాదంలో చనిపోయాడు. ఇది కళ్ళారాచూసిన ప్రజలు అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేయడం, లారీని కాల్చడం జరిగింది. పోలీసులు పరిస్థితి గమనించకుండా ప్రజలపై విచ్చలవిడిగా లాఠీఛార్జి చేయడం, ప్రజలు తిరగబడడం ఇంకా కొన్ని లారీలపై దాడిచేయడం వరుసగా జరిగాయి. ఇది ప్లాను ప్రకారంగా చేసిన సంఘటన కాదు. జులై 4నరాత్రి నేరెళ్ల, జిల్లెల్ల గ్రామాలపై పడి పోలీసులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 8మందిని అరెస్టుచేసి సిరిసిల్ల తీసుకెళ్ళి చిత్రహింసలపాలు చేశారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. చివరికి వాళ్ళు నడవలేని పరిస్థితి. వారిని కరీంనగర్ జైలుకు తీసుకెళ్ళగా జైలు అధికారులు గాయాలతో బాధపడుతున్న వారిని జైల్లోకి తీసుకోకుండా వెనక్కి పంపారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి తరువాత అధికారులపై ఒత్తిడితెచ్చి జైల్లోకి పంపారు. కానీ ఈ కేసులో ఎస్పీ స్థాయి అధికారి వ్యవహరించిన తీరు పోలీసువ్యవస్థకే మాయనిమచ్చగా మిగిలింది. బాధితుల కుటుంబాలవారు పోలీసుస్టేషన్‌లో పరామర్శించడానికి వెళ్ళినవారిని వారికి తగిలిన గాయాలగూర్చి బయట ఎవరికి చెప్పినా ఆడవారిపై వ్యభిచార కేసు పెడ్తామని, మగవారిపై మాదకద్రవ్యాల కేసుపెడ్తామని ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించి పంపారు. ఈ సంఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించిన వివిధ సంస్థల ప్రతినిధులు, పార్టీల ప్రతినిధుల స్పందన ఒక తీరుగావుంటే, పాలకపార్టీ, హెూంశాఖామాత్యుల తీరు మరోరకంగా వుంది. రోజుకు మానేరువాగు నుండి వందలాది లారీల ఇసుక చేరవేస్తూ పలు ప్రమాదాలు సంభవించినప్పటికీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పోలీసులు యజమానులకు వత్తాసు పలకడానికి బలమైన కారణాలు ఉన్నాయని వీరివెనకాల పాలకపార్టీ నాయకుల బంధువులున్నారని సర్వత్రా చర్చ జరుగుతుంది.

4. ఖమ్మం టౌన్‌లో ఒక షాపు యజమాని తనషాపుకు బురద చెప్పులతో రావొద్దని చెప్పినందుకు ఇద్దరు ట్రైనీ ఎస్ఐలు ఆ యజమానిని చితకబాదారు. ఈ విషయం పత్రికల్లో వివరంగా వార్తలు వచ్చాయి. ప్రొబేషన్ పీరియడ్‌లోవున్న వారే ఇలా వ్యవహరిస్తే వీరు పూర్తి విధుల్లోకి వస్తే ప్రజలతో ఎలా వ్యవహరిస్తారో ఆలోచించండి?5. ఇందిరాపార్కు దగ్గర ధర్నాచౌక్ కోసం వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు నెలరోజులు ఉద్యమంచేసి ధర్నాచౌక్‌ను ఆక్రమించండి పేరిట జులై 15న ఇందిరాపార్కు దగ్గరకు ఊరేగింపుగా వెళ్తే "ఇందిరాపార్కు దగ్గర ధర్నాచౌక్‌ను ఎత్తివేయండి అని ప్లకార్డులు ప్రదర్శించడం, బ్యానర్లు కట్టటం చట్టవిరుద్ధం కాదా? చివరికి కన్నంలో చిక్కిపోయిన దొంగలా సీఐస్థాయి అధికారిణి ప్లకార్డులు పట్టుకుని కూర్చోగా, 200మంది పోలీసులు మఫ్టీలో టెంటుల్లో కనిపించారు. ఇది మీడియాకంట పడి సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తే తరువాత అక్కడినుండి మెల్లగా జారుకున్నారు.

6. జులై 28న పాఠశాలలు, కళాశాలల్లో కనీస వసతులు కల్పించాలని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కరీంనగర్ కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులపట్ల పోలీసులు క్రూరంగా వ్యవహరించారు. విద్యార్థినులను మగ పోలీసులు పిడిగుద్దుల వర్షం కురిపించి ఈడ్చివేశారు. గాయాలైన విద్యార్థులను 100మందిని ట్రైనింగ్ సెంటర్లలో నిర్బంధించారు. 30మంది సొమ్మసిల్లి పడిపోయారంటే పోలీసుల హింస ఎంత తీవ్రస్థాయిలో వుందో అర్థమవుతుంది. విద్యార్థులను అదుపుచేయడానికి వేరే మార్గాలు లేవా? వారు పోలీసులపై దాడికి ప్రయత్నించారా? ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారా? అధికారులను నిర్బంధించారా? ఇలాంటి ఏ సంఘటనలు లేకుండానే ఇంతటి దుశ్చర్యలకు పాల్పడడం చూస్తుంటే ఫ్రెండ్లీ పోలీస్ అనేదానికి అర్థమేమిటి? ఇలా వందల సంఘటనలను చెప్పవచ్చు. దీనినిబట్టి ఈ డిపార్టుమెంట్ ఫ్రెండ్లీపోలీసు అంటే అధికారంలో వున్నవారికి అండగా వుండడానికి, వారిని అన్ని విధాలుగా కాపాడడానికి పడరాని పాట్లు పడ్తున్నారన్నది స్పష్టం. ఫ్రెండ్లీపోలీసు బోర్డుల ద్వారా కాదు ఆచరణలో నిరూపించుకోవాలి.

–సెల్:9490098760

సంక్షోభంలో సామాజిక శాస్త్రాలు



వినోద్ సుద్దాల

ఆది మానవుడు వ్యక్తిగత జీవితం నుండి సమూహంగా మారి ప్రకతిలో దొరికిన వనరులతో పాటు ఇతర జీవులపై ఆధిక్యతకై, ఆహారానికై ఇతరత్రా అవసరాలకై ఏర్పరుచుకున్న అలిఖిత ఒడంబడిక పునాది నుండి సామాజిక శాస్త్రాల పయనం మొదలైందని చెప్పవచ్చు. గత కొన్నేండ్ల వరకూ సామాజిక శాస్త్రాల ఆధిపత్యం బాగానే సాగినా ప్రస్తుతం అవి చదివే విద్యార్థులు తీవ్ర అయోమయానికి గురయ్యేలా పరిస్థితి దిగజారింది. గతంలో సాధారణంగా బి.ఎ అంటేనే బాగా చదువుకున్న వ్యక్తి గా గౌరవించిన దశ నుండి ' బి.ఎ నా' అని హేళన చేసే దుస్థితి ఏర్పడింది. అయినప్పటికీ కొంత మంది తమ అభిరుచి,ఆసక్తి కి అనుగుణంగా అవే కోర్సులు చేస్తూ ఇతరత్రా అవకాశం ఉన్నా వాటిని బతికించటమే గాక తమ అభిరుచి ముందు ఎన్ని సమస్యలైనా దిగదుడుపే అని రుజువు చేస్తూనే ఉన్నారు. కానీ ఆధునిక ఆవిష్కరణలు అంతర్జాల వినియోగం పెరిగిన ప్రస్తుత తరుణంలో చాలా మంది వీటిని అవహేళన చేస్తూ వీటి ఉనికిని ప్రశ్నిస్తున్నా నిజానికి ప్రస్తుత పరిస్థితులు సామాజిక శాస్త్రాల ఆవశ్యకతను మరింత బోధపడేలా చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచం సరికొత్త సవాళ్ళను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో మనిషికి ఓపిక తగ్గటమే గాక ప్రతి పని వేగంగా జరుగాలనే ఆరాటం , ఎక్కువగా మర యంత్రాలపై ఆధారపడటం, మనిషికి మనిషికి మధ్యలో డబ్బు అనే జబ్బు వ్యాప్తి చెందటం, నైతిక విలువల పతనం, విద్యా వైద్యం పూర్తిగా సేవా భావన నుండి వ్యాపార లాభాపేక్ష దష్టికి మరలటం, మనిషి 'మనీషిగా మారటం, అరచేతిలో ప్రపంచం అద్భుతమైన ఆవిష్కరణయే ఐనా అనేక సౌకర్యాలకు తోడు అనేక అవలక్షణాలను కూడా సమాజానికి మోసుకొచ్చింది. ఇలాంటి పరిస్థితి లో శాస్త్ర విద్య నేర్చిన వారి బ్రతుకుకు భరోసా వచ్చినా నిజమైన పరిపూర్ణ మనిషిగా మార్చే సత్తా కేవలం సామాజిక శాస్త్రాలకే కలదు.

ముఖ్యంగా మన భౌగోళిక పరిస్థితులు, మన చరిత్ర, మన పాలనా వ్యవస్థ, సమాజ సమస్యలు, ఆర్థిక రంగంలో మన దేశం ఇలా అనేక నిత్య జీవితంలో ఉపయోగపడే అంశాలను చేర్చి సాంఘిక శాస్త్రంగా విద్యార్థి ప్రాథమిక దశలో బోధిస్తున్నప్పటికీ తదనంతరం వాటి జాడ లేకుండా మన విద్యా ప్రణాళిక నిజానికి మన సమాజానికి చాలా చేటు చేసిందనే చెప్పాలి. కారణమేంటంటే మనిషి ఎంత ఎదిగినా ఎంత సంపాదించినా సైన్స్ యందు దిట్ట ఐనా ఇతరులతో ప్రవర్తించే శైలి సమాజంలో కలసి పోకపోతే హక్కులు బాధ్యతలు విలువలు సామాజిక ద కృథం లేక పోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుంది. అంతే గాక కుల,మత,జాతి, ప్రాంత,లింగ,భాషాభేదాలు,విభిన్న సంస్క తి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు గల మన దేశంలో ఎలా ప్రజలను విడగొట్టవచ్చో ఆంగ్లేయులు రుజువు చేసి చూపారు. ఆంగ్లేయులను తరిమికొట్టి మనకు స్వంత రాజ్యాంగం రాసుకొనే ప్రయత్నంలో మన రాజ్యాంగవేత్తల ముందు చూపు నిజంగా మనకు వరం అనే చెప్పాలి. కారణం జాతి విభజన అనంతరం మళ్ళీ అలాంటి పరిస్థితి ఉత్పన్నం కావద్దని వారు తమ లక్ష్యాన్ని స్పష్టంగా రాజ్యాంగంలో చేర్చారు. మన రాజ్యాంగం ప్రతి పౌరునికి అనేక హక్కులకు పూచీకత్తు ఇస్తూనే ప్రభుత్వాలకు పాలన ఎలా ఉండాలో ఆదేశిక సూత్రాలు ద్వారా గుర్తు చేస్తూ ఉంది. మన రాజ్యాంగ ప్రవేశికలో చెప్పిన మాదిరిగా లౌకిక సామ్యవాద ప్రజాస్వామ్య రాజ్యమైన మన దేశం కొన్ని బాధ్యతలు కూడా పౌరులకు ఉండాలని తదనంతరం నిర్దేశించటం తగ్గుతున్న జాతీయ భావనను పునరుత్తేజం చేయటానికేనని అర్థం చేసుకోవచ్చు. పాలనలో ప్రతీ వ్యక్తి భాగమయ్యేలా చేసినా మనకి ఓటు హక్కు తో పాటు దాని వినియోగం పార్టీల సిద్ధాంతాలు వాటి హామీలు అందులో నిజానిజాలు బేరీజు వేసే కనీస జ్ఞానం లేనిచో జరిగే అనేక పరిణామాలు మన కళ్ళ ముందే కలవు.

కావున ఇలా అనేక విధాలుగా ఉపయోగపడే సామాజిక శాస్త్రాలను ఇంకా నిర్లక్ష్యం చేయడం సబబు కాదు. సామాజిక శాస్త్రాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా త్వరిత ఉపాధి కలిగేలా తీర్చి దిద్దాలి.నిజానికి ఈ శాస్త్రాలపై పట్టున్న వారికి అధికంగా పాలనలో భాగస్వాములను చేయాల్సింది పోయి వారిని దూరం చేయడం తప్పు. అంతేకాక ఈ శాస్త్ర సమస్యలు సులభంగా వచ్చే లా ఇచ్చి ఇతరాలు చదివిన వారికి మేలు చేయటం గత కొన్నేళ్ళుగా పెరిగింది. అలాకాక అందరికీ సమాన ప్రాధాన్యత ఉండాలి. కొన్ని ప్రత్యేక పోస్టులు వీరికి నిర్దేశించాలి. అలాగే ప్రస్తుతం ఉన్న విద్యా వ్యవస్థ ను పూర్తిగా ప్రక్షాళన చేయాలి.

-vinod.suddala@gmail.com

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. - ఎడిటర్

మీరచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228

ప్రిజమ్ సిమెంట్ లిమిటెడ్

CIN : L26942TG1992PLC014033
నమోదిత కార్యాలయం: 305, లక్ష్మినివాస్ అపార్ట్‌మెంట్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500016. ఫోన్ : +91 40 23400218 ; ఫ్యాక్స్ : +91 40 23402249 ; ఇ-మెయిల్: investor@prismcement.com ; వెబ్‌సైట్ : www.prismcement.com
ఫిక్స్‌డ్ డిపాజిట్ ప్రాసెసింగ్ సెంటర్: "విండ్సర్", 7వ అంతస్తు, సి.ఎస్.టి.రోడ్ కలినా, శాంతాక్రజ్ (ఈస్ట్), ముంబై-400 098. టెలిఫోన్ నెం.: 3064 7300 / 7444 / 2654 7300 ; ఫ్యాక్స్ : 3064 7400 / 2654 7400

డిపాజిట్లు కోరుతూ ప్రకటన

(కంపెనీస్ (డిపాజిట్ల స్వీకరణ) రూల్స్, 2014 యొక్క సెక్షన్ 73 (2) (ఎ) మరియు సెక్షన్ 76 మరియు రూల్ 4(1) మరియు 4(2)ను అనుసరించి)

1. సాధారణ సమాచారం

a.	కంపెనీ పేరు నమోదిత కార్యాలయం చిరునామా నమోదిత కార్యాలయం సంప్రదించు వివరాలు ఫిక్స్‌డ్ డిపాజిట్ ప్రాసెసింగ్ సెంటర్ సంప్రదించు వివరాలు ఇ-మెయిల్ చిరునామా వెబ్‌సైట్	ప్రిజమ్ సిమెంట్ లిమిటెడ్ 305, లక్ష్మినివాస్ అపార్ట్‌మెంట్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500016 ఫోన్: +91 4023400218; ఫ్యాక్స్: +91 40 23402249 "విండ్సర్"7వ అంతస్తు, సి.ఎస్.టి.రోడ్, కలినా, శాంతాక్రజ్ (ఈస్ట్), ముంబై-400098 ఫోన్: +91 223064 7300/7444/2654 7300; ఫ్యాక్స్: +91 223064 7400/ 2654 7400 investor@prismcement.com www.prismcement.com
b.	కంపెనీ యొక్క ఇన్‌కార్పొరేషన్ తేది	26 మార్చ్, 1992
c.	కంపెనీ దాని అనుబంధ సంస్థలు నిర్వహించే వ్యాపారం, శాఖలు లేదా యూనిట్ ఏవైనా ఉంటే వాటి వివరాలతో	కంపెనీ ప్రధానంగా పోర్ట్‌ల్యాండ్ సిమెంట్ తయారీ వ్యాపారం, టైల్స్, బాత్ అండ్ కిచెన్స్ మరియు రెడీమిక్స్‌డ్ కాంక్రీట్ & అగ్రిగేట్ తయారీ, ట్రేడింగ్‌లో నిమగ్నమై ఉంది. **1) సిమెంట్ డివిజన్:** సిమెంట్ డివిజన్ ప్లాంట్స్ సత్నా, మధ్యప్రదేశ్‌లో, సిమెంట్ ప్యాకింగ్ ప్లాంట్ అలహాబాద్, ఉత్తరప్రదేశ్ మరియు సెంట్రల్ మార్కెటింగ్ ఆఫీస్ వారణాశి, ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. ప్రాంతీయ మార్కెటింగ్ కార్యాలయాల డివిజన్ మధ్యప్రదేశ్-సత్నా, జబల్‌పూర్, భోపాల్, ఉత్తరప్రదేశ్-లక్నో, బరేలి, కాన్పూర్ మరియు బీహార్-పాట్నా **2) హెచ్ & ఆర్ జాన్సన్ (ఇండియా) డివిజన్ (హెచ్ఆర్‌జె):** హెచ్ఆర్‌జె డివిజన్ దీని ప్లాంట్స్ దేవాస్, మధ్యప్రదేశ్; కునిగల్, కర్ణాటక; పెన్, మహారాష్ట్ర మరియు కరైకల్, పుదుచ్చేరి. డివిజన్ బ్రాంచులు: అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, కలికట్, చండీఘడ్ చెన్నై, కోయంబత్తూరు, డెహ్రాడూన్, ఎర్నాకులం, గోవా, ఘజియాబాద్, గువహతి, హుబ్లి, హైదరాబాద్, ఇండోర్, జబల్‌పూర్, జైపూర్, జలంధర్,జమ్ము, కొల్‌కతా, లక్నో, మదురై, నాగ్‌పూర్, నేపాల్, న్యూ ఢిల్లీ, పాట్నా, పూణె, రాయ్‌పూర్, సేలం, శ్రీలంక, సిలిగురి, థానే, త్రిస్సూర్, తిరుపతి, ట్రిచి, త్రివేండ్రమ్, వెల్లూరు, విశాఖపట్నం, విజయవాడ, వారణాశి మరియు ట్యూటికోరిన్. **3) ఆర్ఎంసి రెడీమిక్స్ (ఇండియా) డివిజన్ (ఆర్ఎంసి):** ఆర్ఎంసి డివిజన్‌కు దేశంలోని వివిధ ప్రాంతాలలో రెడీమిక్స్‌డ్ కాంక్రీట్ ప్లాంట్స్ ఉన్నాయి మరియు ప్రస్తుతం ఇది దేశంలోని 40 ప్రదేశాలలో 87 రెడీమిక్స్‌డ్ కాంక్రీట్ ప్లాంట్ మరియు 5 అగ్రిగేట్ క్రషర్స్ వ్యాప్తించిఉన్నాయి. **కంపెనీకి దిగువ సబ్సిడరీలు ఉన్నాయి:** 1. రహేజా క్యూబీఇ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, జనరల్ ఇన్సూరెన్స్ బిజినెస్ నిర్వహిస్తోంది 2. సిలికా సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, టైల్స్ తయారీని నిర్వహిస్తోంది. 3. హెచ్ & ఆర్. జాన్సన్ (ఇండియా) టీబీకె లిమిటెడ్ (హెచ్ఆర్‌జెటీబీకె), రిటైలింగ్ టైల్స్, బాత్ & కిచెన్‌ను నిర్వహిస్తోంది. 4. ఆర్ఎంసి రెడీమిక్స్ పోర్సెలానో (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, టైల్స్ తయారీ మరియు ట్రేడింగ్‌లో నిమగ్నం కావాలని ప్రతిపాదిస్తున్నది 5. మిలానో బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బాత్‌రూమ్ ఫిట్టింగుల తయారీ నిర్వహిస్తోంది. **హెచ్ఆర్‌జెటీబీకె కి దిగువ సబ్సిడరీలు ఉన్నాయి:** 1. టీబీకె వెంకటరామయ్య టైల్ బాత్ కిచెన్ ప్రైవేట్ లిమిటెడ్ 2. టీబీకె రంగోలి టైల్ బాత్ కిచెన్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్‌జెటీబీకె యొక్క పై సబ్సిడరీలు బాత్ మరియు కిచెన్‌ను రిటైలింగ్ టైల్స్ నిర్వహిస్తున్నాయి.
d	కంపెనీ మేనేజ్‌మెంట్ యొక్క సంక్షిప్త వివరాలు	కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల పర్యవేక్షణకు లోబడి మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మరియు ప్రొఫెషనల్ ఎగ్జిక్యూటివ్‌ల టీమ్ ద్వారా నిర్వహించబడుతున్నది.
e	డైరెక్టర్ల పేర్లు, చిరునామాలు, డిఐఎన్ మరియు వృత్తులు	

క్ర.సం	చిరునామా	పేరు	DIN	హోదా	వృత్తి
1	శోభన్ ఠాకూర్	కల్పతరు హెరిటేజ్, 3వ అంతస్తు, 127, ఎం.జి.రోడ్, ఫోర్ట్, ముంబై-400001	00031788	ఛైర్మన్	అడ్వకేట్ & సోలిసిటర్
2	శ్రీ రాజన్ రహేజా	"రహేజాస్", 1వ అంతస్తు, మెయిన్ అవెన్యూ, వి.పి.రోడ్, శాంతాక్రజ్ (వెస్ట్), ముంబై-400054	00037480	డైరెక్టర్	బిజినెస్
3	శ్రీ విజయ్ అగర్వాల్	"రహేజాస్", 2వ అంతస్తు, మెయిన్ అవెన్యూ, వి.పి.రోడ్, శాంతాక్రజ్ (వెస్ట్), ముంబై-400054	00515412	మేనేజింగ్ డైరెక్టర్	కంపెనీ డైరెక్టర్
4	శ్రీ వివేక్ అగ్నిహోత్రి	"రహేజాస్", 2వ అంతస్తు, మెయిన్ అవెన్యూ, వి.పి.రోడ్, శాంతాక్రజ్ (వెస్ట్), ముంబై-400054	02986266	ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సిఇఓ (సిమెంట్)	కంపెనీ డైరెక్టర్
5	శ్రీ జోయ్‌దీప్ ముఖర్జీ	"విండ్సర్" 7వ అంతస్తు, సి.ఎస్.టి.రోడ్, కలినా, శాంతాక్రజ్ (ఈస్ట్), ముంబై-400098	06648469	ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సిఇఓ (హెచ్ఆర్‌జె)	కంపెనీ డైరెక్టర్
6	శ్రీ అతుల్ దేశాయ్	"విండ్సర్" 7వ అంతస్తు, సి.ఎస్.టి.రోడ్, కలినా, శాంతాక్రజ్ (ఈస్ట్), ముంబై-400098	01918187	ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సిఇఓ (ఆర్ఎంసి)	కంపెనీ డైరెక్టర్
7	శ్రీ జె.ఎ.బ్రూక్స్	రామ్స్‌వెల్స్, హర్ట్‌మోర్ రోడ్, గోడల్‌మింగ్ జియు72ఆర్‌టి, యూనైటెడ్ కింగ్‌డమ్	00142045	డైరెక్టర్	డైరెక్టర్
8	Ms. అమీత పర్సియా	మెసర్స్ ఎ.హెచ్.పార్సియా & కంపెనీ, 203/204, ప్రభాత్ చాంబర్స్, 2వ అంతస్తు, 92, ఎస్.వి.రోడ్, ఖార్ (వెస్ట్), ముంబై-400052	02654277	డైరెక్టర్	అడ్వకేట్ & సోలిసిటర్

f.	రిస్క్ ఫ్యాక్టర్లకు సంబంధించి మేనేజ్‌మెంట్ భావన	రిస్క్ మేనేజ్‌మెంట్ కంపెనీలో అంతర్భాగంగా ఉంటుంది మరియు అది అవగాహన, శిక్షణ, క్రమశిక్షణ, నిబద్ధత, ప్రూడెంట్ రిస్క్ మెనేజ్‌మెంట్ వ్యూహాల ద్వారా నియంత్రించబడుతుంది. కంపెనీ యొక్క రిస్క్ మేనేజ్‌మెంట్ అనునది ఆస్తులు, వనరులు మరియు కంపెనీ ఆర్జన సామర్థ్యాన్ని దెబ్బతీసే అట్టి అన్ని రిస్కుల గుర్తింపు.
g.	తిరిగిచెల్లింపులో ప్రమేయమున్నవాటితో డిఫాల్ట్ వివరాలు, డిఫాల్ట్ వ్యవధి మరియు ప్రస్తుత స్థితి: 1) చట్టబద్ధమైన బకాయిలు 2) డిబెంచర్లు మరియు దానిపై వడ్డీ 3) ఏదేని బ్యాంకు లేదా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ నుండి రుణం మరియు దానిపై వడ్డీ	లేదు

2. డిపాజిట్ స్కీమ్ వివరాలు:

a.	బోర్డు తీర్మానం ఆమోదం తేది	మే 25, 2017
b.	అట్టి డిపాజిట్లు కోరుతూ ఆథరైజింగ్ సర్వసభ్య సమావేశంలో తీర్మానపు ఆమోద తేది	జులై 31, 2014
c.	డిపాజిట్ల రకం (అనగా సెక్యూర్డ్ లేదా అన్‌సెక్యూర్డ్)	అన్‌సెక్యూర్డ్
d. i	చట్ట ప్రకారం, దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం డిపాజిట్ల రూపంలో కంపెనీ సేకరించగల మొత్తం	₹ కోట్లు ప్రజల నుండి 205.87 వాటాదారుల నుండి 82.35 మొత్తం 288.22
ii	గత ఆర్థిక సంవత్సరంకు ముందు తక్షణం ఆఖరి తేది నాటికి వాస్తవంగానున్న డిపాజిట్ల మొత్తం	₹ 21.40 కోట్లు
iii	ప్రకటనజారీ తేదినాటికి వాస్తవంగా ఉన్న డిపాజిట్ల మొత్తం	₹ 20.40 కోట్లు
iv	సేకరించదలచిన ప్రతిపాదిత డిపాజిట్ మొత్తం	₹ 100.00 కోట్లు
v	రాబోవు పన్నెండు నెలల కాలంలోగా తిరిగి చెల్లించదగు డిపాజిట్ మొత్తం	₹ 11.87 కోట్లు
e.	డిపాజిట్లు సేకరించే నిబంధనలు 1) కాలవ్యవధి: 2) వడ్డీ రేటు: 3) చెల్లింపు విధానం: 4) తిరిగి చెల్లింపు విధానం:	 1 మరియు 2 సంవత్సరాలు 8.50% p.a చెక్కు ద్వారా చెక్కుద్వారా / ఎలక్ట్రానిక్ విధానం ద్వారా
f.	పథకం ప్రారంభ తేది, ప్రకటన చెల్లుబాటగు కాలవ్యవధి	10 ఆగస్టు, 2017. 30 సెప్టెంబర్, 2017 వరకు లేదా కంపెనీ తరువాయి వార్షిక సర్వసభ్య సమావేశం తేది వరకు లేదా ఏదేని సవరణ వరకు ఏది ముందయితే అంత వరకు చెల్లుబాటు.
g.	డిపాజిట్ల సేకరణ కారణాలు లేదా లక్ష్యాలు	సాధారణ వ్యాపార ప్రయోజనాలు
h.	పొందిన క్రెడిట్ రేటింగ్: • క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల పేరు: • పొందిన రేటింగ్ • పొందిన రేటింగ్ అర్థం • రేటింగ్ పొందిన తేదీ	ఇండియా రేటింగ్ అండ్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇండియా రేటింగ్ ఏ ఫిచ్ గ్రూప్ కంపెనీ) ఐఎన్‌డి టిఏ దేశంలో ఇతర ఇష్యూయర్‌లకు లేదా ఇష్యూలనో పోలిన ఆర్థిక కమిట్‌మెంట్స్ సకాలంలో చెల్లింపు కోసం తగినంత సామర్థ్యాన్ని సూచిస్తోంది. అయితే అట్టి సామర్థ్యం అధిక రేటెడ్ కెటగిరిలలో ఆర్థిక కమిట్‌మెంట్ కన్నా ప్రతికూల సమీప మార్పులకు మరింత గ్రహించతగింది. 16 మే, 2017
i.	డిపాజిట్ బీమా పరిధి: • బీమా కంపెనీ పేరు: • బీమా కవరేజీ నిబంధనలు • కవరేజీ కాలవ్యవధి • కవరేజి పరిధి: • డిఫాల్ట్‌అయిన సందర్భంలో క్లెయింకు పద్ధతి మొ॥నవి.,	వర్తించదు
j.	అట్టి డిపాజిట్లు పొందుటకు చేసిన లేదా ఏర్పాటు చేయబడే చార్జ్ సంక్షిప్త వివరాలు, ఉంటే:	ఫిక్స్‌డ్ డిపాజిట్లు అన్‌సెక్యూర్డ్ కనుక వర్తించదు
k.	అట్టి డిపాజిట్లలో డైరెక్టర్లు, ప్రమోటర్లు లేదా ప్రధాన నిర్వహణ సిబ్బంది యొక్క ఏదేని ఫైనాన్షియల్ లేదా ఇతర ప్రధాన ప్రయోజనం, ఇతర వ్యక్తుల ప్రయోజనాల నుండి అది వేరు కనుక ఇంత వరకు అట్టి ప్రయోజన ప్రభావం.	లేవు

3. బకాయి డిపాజిట్ల వివరాలు:

a.	బకాయి మొత్తం	₹ 20.40 కోట్లు
b.	స్వీకరణ తేది	వివిధ
c.	స్వీకరించిన మొత్తం	₹ 20.40 కోట్లు
d.	వడ్డీరేటు	వివిధ
e.	డిపాజిటర్ల మొత్తం సంఖ్య	3,756
f.	డిపాజిటర్ల సంఖ్య, మొత్తం, డిఫాల్ట్‌అయిన కాలవ్యవధితోసహా డిపాజిట్లు తిరిగి చెల్లించడంలో, వడ్డీ చెల్లింపులో వైఫల్యం ఏదైనా ఉంటే:	లేవు
g.	డిపాజిటర్లచే డిపాజిట్లపై ప్రాప్తించబడిన ఏదేని వడ్డీ రద్దు	లేవు

4. కంపెనీ యొక్క ఆర్థిక స్థితి:

ఎ. సర్క్యూలర్ లేదా ప్రకటన జారీ తక్షణం ముందు మూడు ఆర్థిక సంవత్సరాల కోసం పన్ను ఏర్పాటు చేయడానికి, ఆ తర్వాత కంపెనీ లాభం/(నష్టం)

₹ కోట్లు

వివరాలు	31 మార్చ్, 2017తో ముగిసిన ఆర్థిక సంవత్సరం	31 మార్చ్, 2016తో ముగిసిన ఆర్థిక సంవత్సరం	31 మార్చ్, 2015తో ముగిసిన ఆర్థిక సంవత్సరం
పన్నుకు ముందు లాభం/(నష్టం)	28.13	(21.88)	(10.75)
పన్ను తరువాత లాభం/(నష్టం)	17.51	8.11	14.70

బి. సదరు మూడు సంవత్సరాలకు సంబంధించిన కంపెనీ ప్రకటించిన డివిడెండ్, గత మూడు సంవత్సరాలకు వడ్డీ కవరేజీ నిష్పత్తి (పన్ను తరువాత నగదు లాభం ప్లస్ చెల్లించిన వడ్డీ)

వివరాలు	31 మార్చ్, 2017తో ముగిసిన ఆర్థిక సంవత్సరం	31 మార్చ్, 2016తో ముగిసిన ఆర్థిక సంవత్సరం	31 మార్చ్, 2015తో ముగిసిన ఆర్థిక సంవత్సరం
ప్రకటించిన డివిడెండ్	-	-	-
వడ్డీ కవరేజీ నిష్పత్తి	2.03	1.56	1.49

ప్రదేశం: ముంబాయి
తేది: 25 మే, 2017

సి. సర్క్యూలర్ లేదా ప్రకటన జారీ తేదీకి ముందుగా వెంటనే మూడు ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్స్‌లోఉన్న కంపెనీ యొక్క ఆర్థిక స్థితి యొక్క సారాంశం:

₹ కోట్లు

వివరాలు	31 మార్చ్ నాటికి 2017	31 మార్చ్ నాటికి 2016	1 ఏప్రిల్ నాటికి 2015
ఆస్తులు			
ప్రస్తుతేతర ఆస్తులు			
ఆస్తి, ప్లాంట్ మరియు ఈక్విప్‌మెంట్	1,971.60	2,024.64	2,055.52
క్యాపిటల్ వర్క్-ఇన్-ప్రోగ్రెస్	94.51	68.30	68.80
ఇతర టంజిబుల్ ఆస్తులు	17.61	18.69	21.25
ఫైనాన్షియల్ ఆస్తులు			
ఇన్వెస్ట్‌మెంట్స్	381.93	329.57	337.81
రుణాలు	49.89	50.78	48.66
ఇతర ఫైనాన్షియల్ ఆస్తులు	60.03	0.81	0.47
వ్యత్యాస పన్ను ఆస్తులు (నెట్)	63.91	36.26	-
ఇతర ప్రస్తుతేతర ఆస్తులు	181.10	188.59	169.93
మొత్తం ప్రస్తుతేతర ఆస్తులు	**2,820.58**	**2,717.64**	**2,702.44**
ప్రస్తుత ఆస్తులు			
ఇన్వెంటరీలు	399.74	471.70	549.95
ఫైనాన్షియల్ ఆస్తులు			
ట్రేడ్ రిసీవబుల్	605.47	608.65	557.39
నగదు మరియు నగదు తత్సమాలు	54.12	75.03	56.63
బ్యాంకు బ్యాలెన్సులు నగదు మరియు నగదు తత్సమాలు కాకుండా ఇతరాలు	12.58	40.12	23.07
రుణాలు	5.18	4.99	3.77
ఇతర ఫైనాన్షియల్ ఆస్తులు	40.17	218.09	98.89
ప్రస్తుత పన్ను ఆస్తులు (నెట్)	26.84	48.28	51.69
ఇతర ప్రస్తుత ఆస్తులు	125.67	108.34	232.96
మొత్తం ప్రస్తుత ఆస్తులు	**1,269.77**	**1,575.20**	**1,574.35**
మొత్తం ఆస్తులు	**4,090.35**	**4,292.84**	**4,276.79**
ఈక్విటీ మరియు లయబిలిటీస్			
ఈక్విటీ			
ఈక్విటీ వాటా మూలధనం	503.36	503.36	503.36
ఇతర ఈక్విటీ	452.29	437.13	465.78
మొత్తం ఈక్విటీ	**955.65**	**940.49**	**969.14**
లయబిలిటీస్			
నాన్-కరంటు లయబిలిటీస్			
ఫైనాన్షియల్ లయబిలిటీస్			
రుణాలు	1,009.36	1,327.39	1,473.11
ఇతర ఫైనాన్షియల్ లయబిలిటీస్	208.15	190.81	138.62
ప్రొవిజన్స్	20.93	42.81	19.94
వ్యత్యాస పన్ను లయబిలిటీస్ (నెట్)	-	-	13.60
ఇతర నాన్-కరెంటు లయబిలిటీస్	32.07	22.89	20.30
మొత్తం నాన్-కరెంటు లయబిలిటీస్	**1,270.51**	**1,583.90**	**1,665.57**
కరెంట్ లయబిలిటీస్			
ఫైనాన్షియల్ లయబిలిటీస్			
రుణాలు	290.25	313.95	275.11
ట్రేడ్ పేయబుల్	745.36	763.99	789.82
ఇతర ఫైనాన్షియల్ లయబిలిటీస్	621.96	489.71	432.86
ఇతర కరెంటు లయబిలిటీస్	164.16	172.08	117.70
ప్రొవిజన్స్	31.18	28.72	26.59
ప్రస్తుత పన్ను లయబిలిటీస్ (నెట్)	11.28	-	-
మొత్తం ప్రస్తుత లయబిలిటీస్	**1,864.19**	**1,768.45**	**1,642.08**
మొత్తం ఈక్విటీ మరియు లయబిలిటీస్	**4,090.35**	**4,292.84**	**4,276.79**

డి. సర్క్యూలర్ లేదా ప్రకటన జారీ తేదీకి ముందుగా వెంటనే మూడు సంవత్సరాల కొరకు ఆడిట్‌చేసిన క్యాష్ ఫ్లో స్టేట్‌మెంట్ :

₹ కోట్లు

	వివరాలు	31 మార్చ్, 2017	31 మార్చ్, 2016	31 మార్చ్, 2015
i.	ఆపరేటింగ్ కార్యకలాపాల నుండి క్యాష్ ఫ్లో	543.10	371.63	230.71
ii.	ఇన్వెస్టింగ్ కార్యకలాపాల నుండి క్యాష్ ఫ్లో	(167.55)	(104.43)	(75.11)
iii.	ఫైనాన్షియల్ కార్యకలాపాల నుండి క్యాష్ ఫ్లో	(396.46)	(248.80)	(139.41)
iv.	నగదు మరియు నగదు తత్సమాలలో నికర పెరుగుదల	(20.91)	18.40	16.19

5. గత మూడు సంవత్సరాలలో అకౌంటింగ్ విధానాలలో ఏవేని మార్పులు, లాభాలపై వాటి ప్రభావం, కంపెనీ రిజర్వులు: కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 133 క్రింద నిర్దేశించినట్లుగా ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (Ind AS) అన్నింటిని కంపెనీ ఆమోదించింది. AS 101ను అనుసరించి గత GAAP నుండి ట్రాన్సిషన్ నిర్వహించడమైనది. ఇప్పటివరకు ఉపయోగంలోఉన్న అకౌంటింగ్ విధానాలలో అవసరమైన మార్పులతో ఇండియన్ AS ఆమోదం మినహా అకౌంటింగ్ విధానాలు నిలకడగా కంపెనీకి వర్తించినవి.

6. డైరెక్టర్ల డిక్లరేషన్ ఈ విధంగా ఉంది:

ఎ. చట్టం ప్రారంభానికి ముందు లేదా ఆ తర్వాత అంగీకరించిన డిపాజిట్ల తిరిగి చెల్లింపులో లేదా వాటిపై వడ్డీ చెల్లింపులో కంపెనీ తప్పిదానికి పాల్పడలేదు.

బి. కంపెనీ వ్యవహారాలు, ప్రాస్పెక్ట్స్‌కు సంబంధించి డైరెక్టర్ల బోర్డు తమకు తాము పూర్తిగా సంతృప్తిచెందారు. కంపెనీ భవిష్యత్ అంచనా పరిస్థితికి సంబంధించి తమ అభిప్రాయం ప్రకారం కంపెనీ అప్పులు బకాయిలు ఉన్నప్పుడు వాటిని తీర్చగలిగే స్థితిని కలిగియుంది. సర్క్యూలర్ లేదా ప్రకటన జారీ తేది నుండి ఒక సంవత్సరంలోగా కంపెనీ దివాలాకోరు (ఇన్‌సాల్వెంట్) అవ్వదు.

సి. చట్టంలోని నిబంధనలు మరియు దానిలో రూపొందించిన రూల్స్‌ను కంపెనీ పాటించింది.

డి. చట్టంను, నిబంధనలను పాటించినంత మాత్రాన డిపాజిట్లు తిరిగి చెల్లింపుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు అన్వయించుకోరాదు.

ఇ. చట్టం ప్రారంభానికి ముందు కంపెనీ స్వీకరించిన డిపాజిట్లు తిరిగి చెల్లించబడుతున్నాయి (లేదా సంబంధిత గడువు తేదిలోపు వాటిని తిరిగి చెల్లించేంతవరకు వడ్డీతోపాటు తిరిగి చెల్లించబడతాయి, అవి అన్‌సెక్యూర్డ్‌గా భావించబడతాయి, ఇతర అన్‌సెక్యూర్డ్ లయబిలిటీస్‌తో సమానంగా హోదా కలిగి ఉంటాయి)

ఎఫ్. క్రెడిట్ రేటింగ్‌లో ఏదేని ప్రతికూల మార్పుఉన్న విషయంలో, ఎటువంటి పెనాల్టీ లేకుండానే డిపాజిట్లు ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వబడుతుంది.

జి. సర్క్యూలర్‌లో లేదా ప్రకటన రూపంలో సర్క్యూలర్‌లో సూచించిన దాని కోసం మాత్రమే డిపాజిట్లు ఉపయోగించబడతాయి. హెచ్. కంపెనీ స్వీకరించిన డిపాజిట్లు అన్‌సెక్యూర్డ్, అవి కంపెనీ యొక్క ఇతర అన్‌సెక్యూర్డ్ లయబిలిటీస్‌తో సమాన హోదాను కలిగి ఉంటాయి.

సర్క్యూలర్ కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల పేరున మరియు అధికారంపై జారీచేయబడినది, 25 మే, 2017న నిర్వహించబడిన సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా టెక్స్ట్ ఆమోదించబడినది మరియు కంపెనీ యొక్క డైరెక్టర్ల మెజారిటీ ద్వారా సంతకంచేసిన దాని కాపీ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణ వారికి దాఖలుచేయబడినది.

డిక్లరేషన్: ఇది ద్వారా స్పష్టంగా తెలియజేయునది ఏమనగా రిజిస్ట్రార్‌తో ప్రకటన రూపంలోని సర్క్యూలర్ లేదా సర్క్యూలర్ యొక్క దాఖలుకు అర్థం ఏమనగా రిజిస్ట్రార్ లేదా కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రకటించిన లేదా ఆమోదించినట్లుగా ఏ విధంగాను భావించరాదు లేదా అన్వయించకూడదు. ప్రకటన రూపంలోని సర్క్యూలర్ లేదా సర్క్యూలర్‌లో వ్యక్తపరిచిన అభిప్రాయాలు లేదా దానిలో నివేదికల దిద్దుబాట్ల కొరకు లేదా ఆమోదించిన లేదా ఆహ్వానించిన డిపాజిట్ కోసం ఏదేని డిపాజిట్ స్కీమ్‌కు సంబంధించి ఏదేని ఆర్థిక సౌలభ్యం కోసం రిజిస్ట్రార్ లేదా కేంద్ర ప్రభుత్వం ఏలాంటి బాధ్యత వహించదు. డిపాజిట్ పథకాలలో పెట్టుబడికి ముందు డిపాజిట్‌దారులు శ్రద్ధతో వ్యవహరించవలెను.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఉత్తర్వుల మేరకు
ప్రిజమ్ సిమెంట్ లిమిటెడ్
అనీత ఎస్. కులకర్ణి
కంపెనీ సెక్రటరీ

నవచిత్రం

వి.వి.వినాయక్ నయా సినిమా షురూ..


సాయిధరమ్ తేజ్, పరుచూరి వెంకటేశ్వరరావు, వి.వి.వినాయక్, ఆకుల శివ, సత్యానంద్, సి.కళ్యాణ్ తదితరులు

సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లిమిటెడ్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న నూతన చిత్రం బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. చిరంజీవి ఆశీస్సులతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. హీరో సాయిధరమ్ తేజ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్‌నివ్వగా, రచయిత సత్యానంద్ కెమెరా స్విచాన్ చేశారు. మరో రచయిత ఆకుల శివ గౌరవ దర్శకత్వం వహించారు. సాయిధరమ్‌తేజ్ మదర్ విజయదుర్గ స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ, 'మెగాస్టార్ చిరంజీవిగారి ఆశీస్సులతో ఈ చిత్రాన్ని ప్రారంభించడం చాలా చాలా ఆనందంగా ఉంది. ఇదొక విశేషమైతే, ముగ్గురు ప్రముఖ రచయితలు ఈ చిత్ర ప్రారంభోత్సవాన్ని చేయటం మరొక విశేషంగా భావిస్తున్నాను. ఇలాంటిది చాలా అరుదుగా జరుగుతుంటుంది. ఇప్పటి వరకు చేసిన సినిమాలతో ఎనర్జిటిక్ హీరోగా పేరు తెచ్చుకున్న సాయిధరమ్‌తేజ్, పవర్‌ఫుల్ సినిమాలకు చిరునామా అనిపించుకుంటున్న వి.వి.వినాయక్ కాంబినేషన్‌లో పవర్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమవుతుంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియజేస్తాం' అని అన్నారు.

ప్రేమ లేకుండా ఏ సినిమా ఉండదు..


హను రాఘవపూడి

'ప్రేమ అనేది యూనివర్సల్. నాకు తెలిసి ప్రేమ లేకుండా ఏ సినిమా లేదు. సినిమాను బట్టి ప్రేమ రూపం మారొచ్చు, లెవల్ మారొచ్చు, కానీ ప్రేమ మాత్రం ఉంటుంది' అని అంటున్నారు దర్శకుడు హను రాఘవపూడి. నితిన్, మేఘా ఆకాష్ జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లై'. ఈ నెల 11న ఈ చిత్రం విడుదల కానుంది.

ఈ సందర్భంగా బుధవారం మీడియాతో హనురాఘవపూడి మాట్లాడుతూ, 'ప్రేమ ప్రధానంగా సాగే యాక్షన్ చిత్రం. ఒక్కమాటలో చెప్పాలంటే రివేంజ్ డ్రామా చిత్రం. నెరేషన్ చాలా కొత్తగా ఉంటుంది. ఎప్పుడూ అబద్దాలాడే ఓ కుర్రాడు చెప్పిన ఒక అబద్ధం అతన్నొక పెద్ద సమస్యలో ఇరుక్కునేలా చేస్తుంది. దీంతో కథ టర్నై ఆ తర్వాత ఏం జరిగిందనేది సినిమా. అబద్దాలాడే కుర్రాడిగా నితిన్ నటించాడు. ఈజీ మని కోసం ట్రై చేస్తుంటాడు. మేఘా ఆకాష్ చాలా బాగా చేసింది. ఇందులో విలన్ పాత్ర చాలా బలంగా ఉంటుంది. మూడేండ్ల క్రితం ఈ కథ ఆయన పాత్రతోనే మొదలైంది. పాత విలన్లు చేస్తే అందులో వైబ్రేషన్ పోతుంది. అందుకే కొత్తగా ఉండాలని విలన్‌గా అర్జున్‌ను ఎంచుకోవడం జరిగింది. మొదట ఆయనకు కథ చెప్పడానికే భయమేసింది. చెప్పగానే వెంటనే ఒప్పుకున్నారు. ఆయన ఒప్పుకున్నప్పుడే సినిమా సక్సెస్ అవుతుందని భావించా. అర్జున్‌గారి పాత్ర చాలా స్టయిలీష్‌గా ఉంటుంది. అలాగే కథలో భాగంగానే కామెడీ ఉంటుంది. కథ డిమాండ్ మేరకు అమెరికాలో షూటింగ్ చేశాం. షాట్ మేకింగ్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. సినిమా చాలా రిచ్‌గా తెరకెక్కించాం. నిర్మాతలు బాగా సహకరించడంతోపాటు నాకు కావాల్సిన స్వేచ్ఛ ఇచ్చారు. మణిశర్మ మంచి మ్యూజిక్ అందించారు. ఆయన ట్యూన్స్ కొత్తగా ఉంటాయి. బిజిఎం అదిరిపోయింది. నెక్స్ట్ నానితో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమది. దీనికి ముందు మరో సినిమా చేయబోతున్నాను. దర్శకుడిగా నా జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను. సినిమా హిట్ అయితే పొంగిపోవడం, ఫ్లాప్ అయితే కుంగిపోవడం తెలియదు. ఎప్పుడూ బ్యాలెన్స్‌గా ఉంటాను' అని అన్నారు.

విలువలున్న ప్రేమకథ..


అజయ్, నవీన్ చంద్ర, కొత్తపల్లి.ఆర్.రఘుబాబు

నవీన్ చంద్ర, నివేదా థామస్ జంటగా అజయ్ వోధిరాల దర్శకత్వంలో కొత్తపల్లి అనురాధ సమర్పణలో అనురాగ్ ప్రొడక్షన్స్ పతాకంపై కొత్తపల్లి ఆర్.రఘుబాబు, కె.బి.చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్'. ఈ చిత్ర టీజర్ లాంచ్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నవీన్ చంద్ర మాట్లాడుతూ, 'ప్రతి లవర్ ఒక ఇడియట్టే. టైటిల్‌లో ఉన్నట్టే నేనొక ఇడియట్ లాంటి లవర్‌లా కనిపిస్తాను. ఓ కొత్త కథతో దర్శకుడు అజయ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. డైలాగ్స్ బాగున్నాయి. నివేదా థామస్ చాలా ప్రొఫెషనల్. ఈ సినిమాలో కొత్తగా కనిపిస్తుంది. కామెడీతోపాటు విలువలున్న ప్రేమ కథ ఇది' అని అన్నారు. 'ఓ జూలియట్‌ని ఓ ఇడియట్ లవ్ చేస్తే ఎలా ఉంటుందనేది సినిమా. సీన్స్‌లో కామెడీ, ఎమోషన్స్ ఆకట్టుకునేలా ఉంటాయి. సినిమా చూసిన వారు చాలా బాగుందని అంటున్నారు' అని దర్శకుడు తెలిపారు. నిర్మాత కొత్తపల్లి ఆర్.రఘుబాబు మాట్లాడుతూ, 'నవీన్, నివేదా థామస్ మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది. మేకింగ్‌లో ఎక్కడా రాజీపడకుండా నిర్మించాం. దర్శకుడు అజయ్ చాలా కేర్ తీసుకుని చాలా బాగా తెరకెక్కించాడు' అని చెప్పారు.

నా గత చిత్రాలను మించిన స్థాయిలో..


బోయపాటి శ్రీను

'చేసే ప్రతి సినిమాను నా మొదటి చిత్రంగానే భావించి చేస్తా. హిట్ అయితే ఇండస్ట్రీలో ఉంటా, లేకపోతే ఇంటికి వెళ్ళిపోతాను అని అనుకుని సినిమా చేస్తాను' అని అంటున్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ హీరో, హీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'జయ జానకి నాయక'. ఈ నెల 11న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో బోయపాటి శ్రీనుతో మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

చాలా రోజుల తర్వాత లవ్ స్టోరీ చేస్తున్నారు. కారణం?

– 'భద్ర' సినిమా తర్వాత ఆ స్థాయిలో లవ్‌స్టోరీ చేయలేదు. చాలా రోజులుగా లవ్ స్టోరీ సినిమా చేయాలని ఉండేది. కొన్ని ఏండ్ల క్రితమే లవ్‌స్టోరీతో చేద్దామనుకున్నా. కుదరలేదు. ఈ కథకు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ యాప్ట్ అనిపించింది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది. చాలా రోజుల క్రితమే కథ అనుకున్నప్పటికీ నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశాను. ఆడియెన్స్‌తో పాటు మనం కూడా అప్‌డేట్ అవుతుండాలి కదా (నవ్వుతూ)!.

మీరేమో మాస్.. టైటిల్ చూస్తే క్లాస్.. ఈ సినిమానెలా బ్యాలెన్స్ చేశారు?

– నేను యాక్షన్ లేకుండా సినిమా చేయను. లవ్‌స్టోరీ చేసినా, మాస్ సినిమా చేసినా మరేదైనా..యాక్షన్ ఉంటేనే అది సినిమాకు హెల్దీగా ఉంటుందనేది నా నమ్మకం. యాక్షన్ కథలో భాగంగా ఉంటుంది. సీట్లో కూర్చున్న ప్రేక్షకుడు ఇప్పుడు హీరో కొట్టాలి అని ఫీలవుతాడు. అంతలా కథలో యాక్షన్ భాగమై ఉంటుంది. అలాగే హ్యూమన్ ఎమోషన్స్‌ని కూడా వదిలిపెట్టను. యాక్షన్, హ్యూమన్ ఎమోషన్స్ కలిపే ఉంటాయి. ఈ సినిమా చూస్తే టైటిల్ జస్టిఫికేషన్ చేశానని అందరూ ఫీలవుతారు. ఇది లవ్‌స్టోరీ ప్రధానంగా సాగే చిత్రం. కష్టం వచ్చినప్పుడల్లా ప్రేమనే వదులుకుంటాం. నేను ప్రేమించాను. కాబట్టి వదులుకోలేను అనే తరహా సినిమా ఇది. లవ్‌స్టోరీతోపాటు కుటుంబ అనుబంధాలు, బ్యూటిఫుల్ హ్యూమన్ ఎమోషన్స్‌కు అద్భుతమైన పాటలను జోడించి సినిమా రూపొందించాను. ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. అందుకే రెగ్యులర్‌గా మాస్ టైటిల్స్ కాకుండా క్లాస్ టైటిల్‌ను పెట్టడం జరిగింది. కచ్చితంగా ప్రేక్షకుల అంచనాలను అందుకునేలా ఉంటుంది. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ముఖ్యంగా రీ-రికార్డింగ్ సూపర్‌గా ఉంటుంది.

మీ సినిమాల్లో ఉండే అంతర్లీన సందేశం ఈ చిత్రంలోనూ ఉంటుందా?

– నేను సమాజానికి మంచి చేయకపోయినా ఫర్వాలేదు, చెడు మాత్రం చేయను. అలాగే నేను చేసే ప్రతి సినిమాలోనూ ఏదో ఒక సందేశం ఉంటుంది. 'సింహా'లో స్కూల్స్, కాలేజ్‌ల్లో విజృంభించిన డ్రగ్స్ గురించి చెప్పాం. 'లెజెండ్'లో ఆడపిల్లను వద్దనుకుంటున్న వారి గురించి హీరో రియాక్ట్ అయిన తీరుకు మంచి స్పందన వచ్చింది. ఇలానే 'దమ్ము', 'సరైనోడు'లో కూడా సందేశం ఉంటుంది. ఈ చిత్రంలో మహిళలకు సంబంధించి ఓ సోషల్ మెసేజ్ ఉంటుంది. ప్రేమకు సంబంధించిన సందేశమది.


షూటింగ్ స్పాట్‌లో ఆర్టిస్టులకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు బోయపాటి శ్రీను

అప్‌కమింగ్ హీరోతో ఈ సినిమా చేయడానికి కారణం?

– 'సరైనోడు' తర్వాత నాకు పెద్ద ప్రాజెక్ట్‌లే వచ్చాయి. కానీ చాలా రోజుల క్రితం బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో సినిమా చేస్తానని మాటిచ్చాను. మన బ్లడ్‌కో కలర్ ఉండాలి. మన మాటకో విలువుండాలి. మనకో క్యారెక్టర్ ఉండాలి. అది లేని రోజు మనం లేం. క్యారెక్టర్ కోసం ఎంత దూరమైనా వెళ్తాను. మాటిచ్చాను కాబట్టి ఈ చిత్రం చేశాను. నా సినిమాలో స్టార్ హీరో ఉన్నాడా లేదా అనేది చూడను. గత సినిమా కంటే ఈ సినిమా మరో లెవల్‌లో ఉండేలా చూసుకుంటాను. ఈ చిత్రం కూడా అంతే పెద్ద స్థాయిలో ఉంటుంది. నా గత 6 సినిమాలకంటే ఓ పాయింట్ ఎక్కువగానే ఉంటుంది.

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పర్‌ఫార్మెన్స్ గురించి?

– చాలా అద్భుతంగా చేశాడు. సినిమా చూశాక ప్రతి ప్రేక్షకుడు హీరోను చూసి ఇలాంటి కుర్రాడు సొసైటీకి అవసరం. ఇలాంటి కుర్రాడు మా ఇంట్లో ఉంటే బాగుంటుందని ఫీలవుతారు. ఇలాంటి అన్యాయం మరే అమ్మాయికి జరగ కూడదనుకుంటారు. ఒక తండ్రి కొడుకుగా, ఒక తల్లి కొడుకులా, ఓ చెల్లి అన్నలా, ఓ అక్క తమ్ముడిలా ఫీలవ్వాలని అద్భుతంగా కాయిన్ చేసి హీరో పాత్రను, కథను డిజైన్ చేశాం. సాయి ఏజ్‌కి తగ్గట్టే డైలాగ్స్ ఉంటాయి.

హీరో మార్కెట్‌కు మించి బడ్జెట్ అయిందట?

– కథపై నమ్మకంతో చేశాం. నేను ఓ సినిమాకు కొబ్బరికాయ కొట్టానంటే నన్ను నమ్మి సినిమాను కొనడానికి బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు రెడీగా ఉంటారు. అయితే ఈ సినిమాకు ఉన్న ఒక గొప్ప వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి. నన్ను కలిసి 'సార్ నాకు డబ్బు ముఖ్యం కాదు, మంచి సినిమా కావాలి. నా బ్యానర్ ద్వారకా క్రియేషన్స్, నా పేరు నిలిచిపోయేలా సినిమా తీయండి' అని అడిగారు. అలాగని అతిగా ఖర్చుపెట్టలేదు. దేనికి ఎంత అవసరమో అంతే పెట్టాం. నేను ఏ సినిమా చేసినా నా మొదటి చిత్రంగానే భావించి చేస్తా. 'సినిమా హిట్ అయితే ఉంటా. లేదంటే ఊరెళ్ళిపోవాల్సిందే' అని అనుకునే సినిమా చేస్తా.

షూటింగ్ టైమ్‌లో మీరొక హెడ్‌మాస్టర్‌లా ఉంటారట?

– (నవ్వుతూ) అవును. ఈ రోజు చేసే సన్నివేశాలపై హీరో,హీరోయిన్‌తోపాటు జూనియర్ ఆర్టిస్టులకు కూడా అవగాహన, క్లారిటీ ఉండాలి. ఆ సీన్ చేస్తున్నంత సేపు ఆర్టిస్టులందరూ అదే మూడ్‌లో ఉండాలి. అలా ఉంటేనే సీన్స్‌లో సోల్, ఎమోషన్స్ క్యారీ అవుతాయి. అందుకే అందరికి సన్నివేశాలను సౌండ్, ఎక్స్‌ప్రెషన్స్‌తో సహా అన్నీ వివరిస్తాను. నేను అనుకున్నట్టు అవుట్‌పుట్ వచ్చే దాకా చేయిస్తూనే ఉంటాను.

నెక్స్ట్ సినిమాలు గురించి?

– మహేష్‌తో ఓ సినిమాకు సంబంధించిన డిస్కషన్స్ జరిగాయి. ఆయనకు ఓ కొత్త జోనర్‌లో కథ రెడీగా ఉంది. అలాగే చిరంజీవికి కూడా స్క్రిప్ట్ సిద్ధంగా ఉంది. వచ్చే ఏడాది మేలో లేదా జూన్‌లో బాలకృష్ణతో సినిమా ఉంటుంది. అఖిల్‌కి రెండు లైన్లు అనుకున్నాను. నా తదుపరి చిత్రం ఎవరితో అనేదానిపై ఇంకా ఆలోచించాల్సి ఉంది. దానికి కొంచెం టైమ్ పడుతుంది.

ఒకేసారి మూడు సినిమాలు విడుదలవ్వడంపై మీ కామెంట్?

– ఒకేసారి ఎన్ని సినిమాలు విడుదలైనా నా సినిమాకి వచ్చే నష్టం ఏమీ ఉండదు. నా గత సినిమాలు వెయ్యి థియేటర్స్‌లో విడుదల చేశామనుకుందాం. ఈ చిత్రానికి రెండు వందల థియేటర్లు తగ్గుతాయి. అంతకు మించి ఏమీ జరగదు. అయితే ఈ చిత్రం గత నెలలోనే విడుదల కావాల్సింది. కానీ కుదరలేదు. సోలోగా వద్దామని ఆగస్టు 11న రిలీజ్ అని అప్పుడే ప్రకటించాం. ఇప్పుడు మూడు సినిమాలొస్తున్నాయి అయినా ఫర్వాలేదు. ఇంకా ఆగే ప్రసక్తి లేదని ముందుకు వెళ్తున్నాం. డిస్ట్రిబ్యూటర్లు కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. వాళ్ళు కొన్నారంటే నాపై నమ్మకంతోనే కదా. డిస్ట్రిబ్యూటర్లు, ఆడియెన్స్ నాపై నమ్మకం పెట్టుకుని వస్తారు. వాళ్ళను ఎట్టిపరిస్థితుల్లోనూ డిజప్పాయింట్ చేయను. సినిమాపై నమ్మకంతో ఉన్నాం.

థ్రిల్లర్ కామెడీ నేపథ్యంలో..


రేలంగి నరసింహారావుతో 'రావోయి.. మా ఇంటికి' చిత్రయూనిట్ సభ్యులు

సంగీత దర్శకుడు సాకేత్ సాయిరామ్ దర్శకుడిగా మారి రూపొందించిన చిత్రం 'రావోయి మా ఇంటికి'. శ్రీధర్, కావ్యాసింగ్, అవంతిక హీరో,హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని బ్లాక్ పెప్పర్ స్క్రీన్స్ పతాకంపై డాలీభట్ నిర్మిస్తున్నారు. దర్శకుడు సాకేత్ సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో లాంచ్ బుధవారం ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన తమ్మారెడ్డి భరద్వాజ ఆడియో సీడీలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సాకేత్ నా చిత్రంతోనే సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యారు. తను మంచి మ్యూజిక్ డైరెక్టర్. థ్రిల్లర్ కామెడీ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించాడు. సినిమా బాగా వచ్చిందని నమ్ముతున్నా. పాటలు, సినిమా పెద్ద విజయం సాధించి యూనిట్ అందరికీ మంచి పేరును తీసుకురావాలి' అని అన్నారు. 'టైటిల్ చాలా బాగుంది. క్రైమ్‌స్టోరీలోనే కామెడీని హైలైట్ చేస్తూ తెరకెక్కించిన చిత్రమని టైటిల్ చూస్తే అర్థమవుతుంది. యువతతోపాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది' అని రేలంగి నరసింహారావు తెలిపారు. దర్శకుడు సాకేత్ సాయిరామ్ చెబుతూ, '30శాతం థ్రిల్లర్, 70శాతం కామెడీ అంశాలతో తెరకెక్కించిన సినిమా ఇది. కాన్సెప్ట్‌ను నమ్ముకుని తెరకెక్కించాం. కథే హీరో. ప్రతీ పాత్రలోనూ వైవిధ్యం ఉంటుంది. ఇందులో మొత్తం ఐదు పాటలున్నాయి. పాటలన్ని వేటికవే ప్రత్యేకంగా డిఫరెంట్ జోనర్‌లో ఉంటాయి. సినిమా చాలా క్వాలిటీగా ఉంటుంది. పాటలు, సినిమాల పెద్ద విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అని చెప్పారు. 'సినిమా కష్టపడి, ఇష్టపడి తెరకెక్కించాం. మంచి అవుట్‌పుట్ వచ్చింది. తెలుగు ప్రేక్షకులంతా మా చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కె.దిలీప్ కుమార్‌రెడ్డి తెలిపారు.


సోనాక్షి సిన్హా

క్రీడా నేపథ్య చిత్రాల్లో..

'నాకు విభిన్నమైన క్రీడలంటే ఇష్టం. మేరీకోమ్, గీతా ఫోగత్, సాక్షి మాలిక్ వంటి క్రీడాకారులు, మహిళా క్రికెట్ టీమ్ నుంచి స్ఫూర్తి పొందుతాను' అని అంటోంది బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా. గ్లామర్ పాత్రలతో పాటు అవకాశం వచ్చినప్పుడలా శక్తివంతమైన పాత్రలు పోషిస్తూ అందరినీ అలరిస్తోంది సోనాక్షి. మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అకిరా'లో బాక్సర్‌గా కనిపించింది. క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ అంటే ఇష్టమని చెబుతున్న సోనాక్షి మాట్లాడుతూ, 'నేను స్కూల్‌కి వెళ్లే టైమ్‌లో వాలీబాల్, ఫుట్‌బాల్ బాగా ఆడేదాన్ని. ఇవే కాదు టెన్నిస్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్ అంటే కూడా చాలా చాలా ఇష్టం. చిన్నప్పుడు ఆటలకే నా టైమ్ ఎక్కువగా కేటాయించాను. కొన్ని కారణాల వల్ల 'అకిరా' చిత్రానికి సైన్ చేసేంత వరకు కూడా బాక్సింగ్‌గాని, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌గానీ నేర్చుకోలేకపోయాను. ఇటీవల కాలంలో కమల్ ముజితబ్ వద్ద బాక్సింగ్, కుల్‌దీప్ శషి వద్ద మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. వాళ్ళు నన్ను బాగా మోటివేట్ చేసి నేర్పిస్తున్నారు. వారి శిక్షణ 'అకిరా' చిత్రానికి బాగా హెల్ప్ అయ్యింది. ఇకపై కూడా క్రీడా నేపథ్య చిత్రాల్లో నటిస్తాను. వీటితోపాటు క్రీడాకారుల బయోపిక్‌ల్లోనూ నటించేందుకు రెడీగా ఉన్నాను' అని తెలిపింది. సోనాక్షి ప్రస్తుతం 'ఇత్తేఫాక్', 'సర్కస్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

నేరెళ్లలో దళితులపై దాడి జరిగిందా?

విలేకరుల చిట్‌చాట్‌లో మంత్రి కేటీఆర్‌ ఆశ్చర్యం

- వేగంగా వెళ్లిన లారీల వల్లే ప్రమాదం

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

నేరెళ్లలో దళితులపై దాడి జరిగిందా? అని మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇసుకను తరలిస్తున్న క్రమంలో వేగంగా వెళ్లిన లారీల వల్ల ప్రమాదం జరిగిన మాట వాస్తవమన్నారు. ఒకరిద్దరు ప్రమాదానికి గురయ్యారని చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ అక్కడ ఉండగానే అక్కడికి నాలుగైదు లారీలు వచ్చాయని, దీంతో కోపంలో అక్కడి బాధితులు వాటిని దహనం చేశారని, దీనిపైనే పోలీసులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ విషయం ఎవరో వెలికి తీసింది కాదన్నారు.. పోలీస్‌లు రిమాండ్‌కు పంపినప్పుడు వారి గాయాలను చూసి జైలర్‌ రిమాండ్‌కు తిరస్కరించారని, అప్పుడే ఈ ఘటన బయటికి వచ్చిందని వెల్లడించారు. దీనిపై స్పందించే లోపే టూరిస్టుల్లా ప్రతిపక్షాల పార్టీల సందర్శన మొదలు పెట్టాయన్నారు. తాను రాజకీయాల్లో ఉన్నంతవరకు సిరిసిల్ల నుంచే పోటీ చేస్తానని కేటీఆర్‌ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోనే తన చాంబర్‌లో ఆయన విలేకరులతో చిట్‌చాట్‌ చేశారు. ఈ సందర్భంగా నేరెళ్ల ఘటన, హిమాన్షు మోటర్స్‌ వ్యవహారం, ఎన్నికలు, తదితర అంశాలపై మంత్రి స్పందించారు.

బాధితులు నేను కారణమని చెప్పలేదు

నేరెళ్ల ఘటనలో బాధితులు పోలీసులు కొట్టారని చెప్పారు కానీ, తాను కారణమని చెప్పలేదని మంత్రి కేటీఆర్‌ తెలిపారు. దీనిపై డీఐజీ విచారణ కొనసాగుతున్నదని, విచారణ రిపోర్టర్‌ రాగానే అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. వాస్తవానికి ఘటన బయటికి వచ్చేత వరకు అక్కడ ఎం జరిగిందో తనకు తెలియదన్నారు. సమాచారాన్ని అందించడంలో పార్టీ స్థానిక నాయకత్వ లోపం ఉందన్నారు. కాలిన లారీలతో తమకు గానీ, మా కుటుంబానికి గానీ సంబంధం లేదన్నారు.


హిమాన్షు వ్యవహారంలో తప్పుడు ప్రచారం

హిమాన్షు మోటర్స్‌ వ్యవహారంలో తప్పుడు ప్రచారం జరుగుతున్నదని కేటీఆర్‌ చెప్పారు. హిమాన్షు మోటర్స్‌ను 2004లో స్థాపించబడిందన్నారు. అమెరికా నుండి తాను వచ్చిన తర్వాత తన మిత్రుడు శ్రీనివాస్‌రెడ్డి, తమ పార్టీ నేత అచ్చా విద్యాసాగర్‌తో కలిసి హిమాన్షును పెట్టామని అన్నారు. విద్యాసాగర్‌కు మారుతి సుజీకి మోటర్స్‌ పెట్టిన అనుభవం ఉండడంతో హిమాన్షు మోటర్స్‌ అనే ఎస్కార్ట్‌ ట్రాక్టర్ల డీలర్‌ కంపెనీ పెట్టామన్నారు. సిద్ధిపేటలో రాజీవ్‌ రహదారి పక్కన స్టాక్‌ డిపో పెట్టామని, అది 2008 వరకు లాభాల్లో నడిచినా ఆ తర్వాత నష్టాలు వచ్చాయని చెప్పారు. దీంతో 2011 నుంచి మోటర్స్‌ కంపెనీ కార్యకలాపాలు బంద్‌ అయ్యాయని అన్నారు.

మళ్లీ మళ్లీ చెబుతున్నా హిమాన్షు మోటర్స్‌ సాంకేతికంగా మాత్రమే మూసివేయలేదన్నారు. 2014 ఎన్నికల అఫిడవిట్‌లో దాని విలువ ఎంతో చూపించామన్నారు. రాష్ట్రప్రభుత్వం పోలీస్‌ వాహనాల కొనుగోలు చేసింది టాయోటా కంపెనీ నుండి ఇన్నోవా కార్లనని, మాది ట్రాక్టర్ల సంస్థ అని, ట్రాక్టర్లకు, ఇన్నోవాలకు ఏమిటి సంబంధమని ప్రశ్నించారు.

రాజకీయాలకు ఎందుకొచ్చానా అని బాధిస్తోంది

'నా కొడుకు లావుగా ఉన్నాడు. దాన్ని కూడా కలిపి తిడతారా' అని ప్రతిపక్షపార్టీల నేతలపై కేటీఆర్‌ మండి పడ్డారు. కుటుంబాలను, వ్యక్తిగత అంశాలను రాజకీయాలకు వాడు కోవడం సరికాదన్నారు. ఇలాంటివి జరుగు తున్నప్పుడు అసలు రాజకీయాలకు ఎందుకు వచ్చానా అని అనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



హరీశ్‌తో విభేదాల్లేవ్‌..

నాకు, మా బావ హరీశ్‌రావుకు మధ్య ఏ మాత్రం విభేదాలు లేవని కేటీఆర్‌ చెప్పారు. తమకు అన్ని విషయాలపై అవగాహన ఉందన్నారు. ఆదివారమైనా సెలవు తీసుకోవాలని హరీశ్‌ను కోరానని, అందరి ఎమ్మె ల్యేల కంటే హరీశ్‌రావే ఎక్కువగా తన నియోజకవర్గానికి వెళ్తుంటారని ఆయన తెలిపారు. 2029లో కూడా కేసీఆరే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నామని' అని అన్నారు.

జీఎస్టీపై న్యాయపోరాటం చేస్తాం

జీఎస్టీపై రాష్ట్రం తరపున అభ్యంతరాలు స్పష్టంగా చెప్పామని కేటీఆర్‌ చెప్పారు. మొన్న జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని చెప్పానని, దీనిపై కోర్టుకు వెళతామని కూడా అన్నానని, దీనికి బీహార్‌ మంత్రి కూడా మద్దతు పలికారని చెప్పారు. ఇది మినిట్స్‌ లో కూడ ఉందన్నారు. సెప్టెంబర్‌ 9న జరిగే సమావేశంలో సానుకూల నిర్ణయం వస్తుందని అనుకుంటున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు.

మేం అధికారంలోకి రాలేమన్న అనుమానం ఎవరికీ లేదు

టీఆర్‌ఎస్‌ అధికారంలోకి వస్తుందంటే ఎవరూ పార్టీని వీడరని, రాదని అనుమానం ఉంటేనే పార్టీని మారతారని కేటీఆర్‌ అన్నారు. 2019లో టిఆర్‌ఎస్‌నే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జానారెడ్డి, ఉత్తమ్‌కుమారరెడ్డి, భట్టి విక్రమార్క సహా ప్రతిపక్షాలకు చెందిన వారందరూ తమకు రాజకీయంగా శత్రువులే నన్నారు. తాము అధికారంలోకి రాలేమన్న అనుమానం కాంగ్రెస్‌నేతలకు కూడా లేదన్నారు. ఏ పార్టీకి లేని 75 లక్షల సభ్యతం టిఆర్‌ఎస్‌పార్టీకి ఉందన్నారు. బీజేపీ ఇప్పుడున్న ఐదు స్థానాలు కూడా గెలవదని ఎద్దేవాచేశారు. హైదరాబాద్‌లో మాత్రం తమకు బీజేపీనే ప్రతిపక్షమన్నారు. పొత్తుల విషయాన్ని ప్రస్తావిస్తూ సింహం సింగిల్‌గానే ఉంటుందని తెలిపారు.

రాజధానిలో కాంగ్రెస్‌ పార్టీ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. రాష్ట్రంలో టీడీపీ, వామపక్షాల ఊసే కనబడడం లేదన్నారు.

మెట్రో ప్రారంభోత్సవానికి ప్రధానికి ఆహ్వానం

నవంబర్‌ చివరలో జరిగే మెట్రో ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోడీని రావాలని సీఎం ఆహ్వానించారని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో మూడు అంతర్జాతీయ సెమినార్లకు ప్రధాని రావాల్సి ఉందన్నారు.'కేంద్రంలో మిత్రుత్వంలేదు శతత్తం లేదు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది ఏమీ లేదు. బయ్యారం, రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ హైకోర్టు విభజన ఐఐఎం ఇందులో ఏమి ఇవ్వలేదు. అదనంగా కూడా ఇవ్వలేదు.' అని అన్నారు. జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో దేశంలోని అంశాలను ప్రాతిపదికనే మద్దతు ఇచ్చామన్నారు.

కోర్టులొద్దంటుంటే ఏమి చేయాలి

కాంట్రాక్ట్‌ విద్యుత్‌ ఉద్యోగులను కోర్టు క్రమబద్ధీకరించొద్దంటే తామేం చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కావాలని ఎవరైనా చేస్తారా" అని ఆయన ప్రశ్నించారు.

ధర్నాచౌక్‌కు అడ్డంకులెందుకు?

- ఇప్పుడు అధికారంలో ఉన్నవారు గతంలో ఎక్కడ ధర్నాలు చేసారో మర్చిపోతే ఎలా?: ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- చౌక్‌ వద్ద ధర్నాలకు ఎందుకు అనుమతివ్వడం లేదో చెప్పండి..16కు విచారణ వాయిదా

నవతెలంగాణ-హైదరాబాద్‌

ఇందిరాపార్క్‌ వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో ధర్నాలు, నిరసనసభలు, నిరాహారదీక్షలు, ర్యాలీలు, బహిరంగ సభలకు ఎందుకు జరగనీయడం లేదో, అనుమతి ఇవ్వకపోవడానికి కారణాలు ఏమిటో తెలియజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు వివరణ కోరింది. ధర్నా చౌక్‌ వద్ద ధర్నాలకు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. బుధవారం ఆ పిల్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌ రంగనాథన్‌, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్‌ బెంచ్‌ విచారించింది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే హక్కు ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిందని, ధర్నాలు చేయడానికి వీల్లేదనేలా ధర్నా చౌక్‌లో నిరసనలు చేసే వీలు లేకుండా చేస్తున్నారని పిటిషనర్‌ న్యాయవాది బి.ప్రభాకర్‌ వాదించారు. నిరసనలు చేయవచ్చునని, అయితే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆ నిరసనలు ఉండాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫలానా చోటే ధర్నాలకు అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఎలా ఆదేశాలిస్తుందని బెంచ్‌ ప్రశ్నించింది. మేం ప్రభుత్వానికి ఎలా ఆదేశాలు జారీ చేయగలం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇందిరాపార్క్‌, ధర్నాచౌక్‌ ప్రధాన ఉద్ధేశమే నిరసన ప్రదర్శనలకు కేటాయించిందని న్యాయవాది బదులిచ్చారు. హైదరాబాద్‌కు శివారు ప్రాంతాలైన శంషాబాద్‌,జవహర్‌నగర్‌, మేడిపల్లి, షామీర్‌పేట మొదలైన చోట్ల ధర్నాలకు అనుమతి ఇస్తామనే ప్రభుత్వ విధానం సబబుగా లేదన్నారు. ఇందిరాపార్క్‌ వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతుండటం వల్ల స్థానికులకు చాలా ఇబ్బందులు కలుగుతున్నదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్‌కుమార్‌ ప్రతివాదన చేశారు. పైగా ట్రాఫిక్‌ సమస్యలు తీవ్రంగా ఉంటోందన్నారు. ఇటీవల అధికార టీఆర్‌ఎస్‌ పార్టీ సైతం ఇందిరాపార్క్‌ వద్ద కార్యక్రమాలు చేసిందని పిటిషనర్‌ న్యాయవాది గుర్తు చేశారు. దీనిపై బెంచ్‌ స్పందిస్తూ.. ఇప్పుడు అధికారంలో ఉన్న వారు గతంలో ఎక్కడ ఏం చేశారో మర్చిపోతే ఎలాగని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ధర్నాలకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదో తెలియజేయాలని కోరిన బెంచ్‌ తదుపరి విచారణ16కి వాయిదా వేసింది.

మహిళలతో భర్తీకి హైకోర్టు సూత్రప్రాయ అంగీకారం

నవతెలంగాణ-హైదరాబాద్‌

బాలికలు, మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన విద్యా సంస్థల్లో పనిచేసే బోధనేతర, బోధనా సిబ్బంది పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీ చేయడానికి హైకోర్టు సూత్రప్రాయంగా అంగీకరించింది. రాజ్యాంగంలోని అధికరణం 15(3) కింద ప్రభుత్వాలకు అధికారం ఉందని, ఇలా చేయడం రాజ్యాంగంలోని అధికరణ 15(4), 16(4)లకు విరుద్ధం కాబోదని న్యాయమూర్తులు నాగార్జునరెడ్డి, శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్‌ బెంచ్‌ అభిప్రాయపడింది. విజయకుమార్‌ వర్సెస్‌ స్టేట్‌ ఆఫ్‌ ఏపీ, విజయలక్ష్మీ వర్సెస్‌ పంజాబ్‌ యూనివర్సిటీ వంటి కేసుల్లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులు కూడా అందుకు అనుకూలంగా ఉన్నాయని బెంచ్‌ గుర్తు చేసింది. మైనారిటీ, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ గురుకుల బాలికలు, మహిళ విద్యా సంస్థల్లో ఖాళీ పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీకి వీలుగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో 1274పై సింగిల్‌ జడ్జి స్టే ఆదేశాల్ని బెంచ్‌ రద్దు చేసింది. జీవో 1274 ప్రకారం పోస్టుల భర్తీ ప్రక్రియ చేయవచ్చునని, అయితే భర్తీ మాత్రం తాము వెలువరించే తీర్పుకు లోబడి ఉండాలని బెంచ్‌ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మహిళల విద్యా సంస్థల్లో పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీ చేయ వచ్చునని తెలంగాణ అడ్వకేట్‌జనరల్‌ ప్రకాశ్‌రెడ్డి వాదిం చారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. పోస్టులన్నింటినీ మహిళలతోనే భర్తీ చేయడం వివక్ష చూపడమేనని పిటిషనర్ల న్యాయవాదులు సత్యంరెడ్డి, రమేష్‌లు వాదించారు. అధికరణ 15(3) ప్రకారం మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం ఈ విధంగా చేయవచ్చునని, జీవో మేరకు భర్తీ చేసినా అవి తుది తీర్పుకు లోబడి ఉంటాయని, ఒకవేళ ఈ కేసుల్లో పిటిషనర్లు గెలిస్తే వారికి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా పదోన్నతులు కల్పించాల్సివుంటుందని మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది.

ప్రజావ్యతిరేక విధానాలు పోవాలి

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతోంది. సాధారణ ప్రజలు రోజురోజుకి పేదలుగా మారుతున్నారు. ధనవంతలు మరింత ధనవంతులవుతున్నారు. ఈ విధానాల వల్ల ప్రయోజనం ఏమిటో అర్థం కావడం లేదా' అని నిలదీశారు. 2014వ సంవత్సరంలో 49శాతం జిడిపి దేశ జనాభాలో ఒక్కశాతంగా ఉన్న వారి వద్ద ఉందని, 2016లో 58.4 శాతం జిడిపి ఒక్క శాతం చేతిలో ఉన్నట్లు తేలిందని చెప్పారు. '1947లో భారత ప్రజానీకం కన్న కలలు ఇవేనా... ప్రాణాలకు తెగించి, ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యం ఇందుకేనా' అని ఆయన ప్రశ్నించారు. ' క్విట్‌ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా నా దేశాన్ని విడిచి వెళ్లాల్సినవి ఏవైనా ఉంటే అవి మతోన్మాదం... సంకుచిత ఆర్థిక విధానాలే' అని అన్నారు. 'మతోన్మాదం నా దేశాన్ని ముక్కలు చేస్తోంది. ఈ సమయంలో తక్షణం చేయల్సింది సెక్యులర్‌ విధానాలను మరింతగా బలోపేతం చేయాలి. కానీ అలా జరుగుతోందా లేదు. దేశంలో హిందూపాకిస్తాన్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అటువంటి ప్రయత్నాలను ఎటువంటి పరిస్థితుల్లోనైనా అడ్డుకుని తీరుతాం' అని చెప్పారు. ఈ సందర్భంగా దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కమ్యూనిస్టు వీరులను, వారు చేసిన సేవలను వివరించారు.

నినాదం మారింది : మోడీ

మహాత్మాగాంధీ పిలుపుతో 1942లో ప్రారంభమైన 'క్విట్‌ ఇండియా' ఉద్యమం నినాదం మారిందని ప్రధాని మోడీ అన్నారు.లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. "సాధిద్దాం లేదా మరణిద్దాం" అనే నినా దంతో క్విట్‌ ఇండియా ఉద్యమం జరిగిందని, ఇప్పుడు ఆ నినాదం "సాధించి తీరు దాం"గా మారిందని, 125 కోట్ల మంది జనాభా ఇదే నినాదంపై నమ్మకంతో ఉన్నారని అన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

- ఆత్మహత్యకు ప్రభుత్వం, యాజమాన్యానిదే బాధ్యత
- నష్ట పరిహారం రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్‌: సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

నవతెలంగాణ - హైదరాబాద్‌ సిటీబ్యూరో

కేటీపీఎస్‌లో యాజమాన్యం అవమానించిన కారణంగానే కాంట్రాక్ట్‌ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నారని, ఇది ఆత్మహత్య కాదనీ ప్రభుత్వం, యాజమాన్యం చేసిన హత్యగానే భావించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు అన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్‌ ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్‌ చేశారు. తెలంగాణ స్టేట్‌ యునైటెడ్‌ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మింట్‌ కాంపౌండ్‌లోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నాగేశ్వర్‌రావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సాయిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం 23 వేలకు పైగా కాంట్రాక్ట్‌ కార్మికులను రెగ్యులర్‌ చేయాల్సి ఉండగా, వారి అనాలోచిత విధానాల కారణంగా 20 వేల 903 మందికే ఉద్యోగ భద్రత కల్పించారన్నారు. ఉన్నతాధికారులు, అధికారుల చర్యలతో మరో మూడువేల మంది కార్మికుల పేర్లను జాబితా నుంచి అధికారులు దురుద్దేశంగానే తప్పించారన్నారు. ఇది సరిగాదన్నారు. మృతుడు



హైదరాబాద్‌ మింట్‌ కాంపౌండ్‌ వద్ద నిరసన ర్యాలీలో సీఐటీయూ నాయకులు

నాగేశ్వరరావు కుటుంబం చుట్టూరా 300 మంది పోలీసులు పహారా కాయడం సిగ్గుచేటన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్‌ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌.రమ మాట్లాడుతూ కేటీపీఎస్‌ యాజమాన్యం సుమారు 1200 మంది కాంట్రాక్ట్‌ కార్మికులకు అన్నిరకాల అర్హతలున్నప్పటికీ, క్రమబద్ధీకరించే జాబితా నుంచి తొలగించడం అన్యాయమన్నారు. అర్హులందరినీ రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. సీఐటీయూ హైదరాబాద్‌ సెంట్రల్‌ సిటీ అధ్యక్షులు ఈశ్వర్‌ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు, రాష్ట్ర నాయకులు యాటాల్ల సోమన్న, పి.శ్రీకాంత్‌, బి.సాంబశివరావు పాల్గొన్నారు.

పోడు భూముల జోలికొస్తే గద్దె దింపుతాం

(మొదటిపేజీ తరువాయి)

సున్నం రాజయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గిరిజన భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజును సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. స్పెషల్‌ ఏజెన్సీ డీఎస్సీని నిర్వహించాలని, పోడు పట్టాలివ్వాలని డిమాండ్‌ చేశారు. ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్‌ మాట్లాడుతూ...హరితహారం, టైగర్‌జోన్‌ పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నుతున్నాయని విమర్శించారు. గిరిజనులు, ఆదివాసుల డిమాండ్లన్నింటినీ వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఏజీఎస్‌ జిల్లా అధ్యక్షులు కనక గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం భీంరావు, జిల్లా ఉపాధ్యక్షులు లంక రాఘవులు, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసం సచిన్‌ పాల్గొన్నారు. ఖమ్మం మంచికంటి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు ముక్తి భాస్కర్‌రావు, భద్రా తిరుపతయ్య పాల్గొన్నారు. కారేపల్లిలో ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఏరియాస్పత్రిలో, తుర్కపల్లిలో ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఆదివాసీ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నదని టీజేఏసీ చైర్మెన్‌ కోదండరామ్‌ విమర్శించారు. కాగజ్‌నగర్‌ పట్టణంలో ఆదివాసీ దినోత్సంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోడు భూముల సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు ఉన్న భూములను లాక్కుంటున్నారని వాపోయారు. భూమి కోసం ఆదివాసీలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గురిజాల రవీందర్‌రావు, రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయన్న పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా అచ్చంపేట, అమ్రాబాద్‌ మండల కేంద్రాల్లో, ప్రొఫెసర్‌ జయశంకర్‌-భూపాలపల్లి, మహబూబాబాద్‌, నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గిరిజనులు ర్యాలీలు నిర్వహించారు.

అటవీ హక్కు పత్రాలిచ్చేది కేంద్రమే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్‌

ఆదివాసులకు అటవీహక్కు పత్రాలు ఇచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, ఆ అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి రామన్న మాట్లాడారు. ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని ఎప్పుడూ చెప్పలేదన్నారు. 300 ఎకరాల్లో గిరిజన విశ్వవిద్యాలయం బ్రాంచ్‌ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజనుల సమస్యలను

రాష్ట్రానికి ఆ అధికారం లేదు

- ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయ శాఖ ఏర్పాటు చేస్తాం : ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి రామన్న

పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రిమ్స్‌లో గిరిజనుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. జోడేఘాట్‌లో రూ.25 కోట్లతో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేసిన ఘనత టీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మాజీ ఎమ్మెల్యే సోయం బాపురావు, ఆదివాసీ సంఘాల నాయకులు దుర్వ నగేష్‌, మడావి రాజు, తానాజీ, మనోహర్‌, ఆత్రం వెంకటేష్‌, నగేష్‌ పాల్గొన్నారు.

ఆట.. జీవితానికి మంట

(మొదటిపేజీ తరువాయి)

వీడియోగేమ్‌ సెట్‌ కొనివ్వలేదని భవనంపై నుంచి దూకి హైదరాబాద్‌లోని హయత్‌ నగర్‌ కి చెందిన ఓ బీటెక్‌ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన విదితమే! వీడియో గేమింగ్‌ వల్ల మానసిక అలసట, ఏకాగ్రత లోపించడంతో పాటు ఆలోచన శక్తి సన్నగిల్లుతుందన్న విషయం పరిశోధనల్లో ఇప్పటికే రుజువైంది.. అదే పనిగా వీడియో గేమ్‌లు ఆడటం మూలంగా మెదడులోని హిప్పోకాంపస్‌లో ఉండే ఒక రకం కణజాలం క్రమక్రమంగా క్షీణిస్తూ.. డిప్రెషన్‌, మతిమరుపు వంటి అసాధారణ మానసిక వ్యాధులను కలిగించే అవకాశం మెండుగా ఉన్నట్టు కెనడాలోని మాంట్రియల్‌ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు సుమారు 100మందిపై నిర్వహించిన పరీక్షల ద్వారా పేర్కొనడం గమనార్హం.

శారీరకంగానూ కష్టమే!

వీడియోగేమ్స్‌ ను అదే పనిగా ఆడటం వల్ల మానసిక రుగ్మతలు పెరగడంతో పాటూ శారీరక సమస్యలు సైతం ఉత్పన్నమయ్యే ప్రమాదమున్నట్టు నిపుణులు హెచ్చరిస్తున్నారు. గంటల తరబడి ఒకేచోట కూర్చొని లేదా పడుకొని ఆటలాడుతున్నారు.ఇలా ఆటధ్యాసలో పడిపోవడం వల్ల ఆహార పరిమాణంలో, నియమాలలో, సమయాల్లో మార్పులు వస్తున్నాయి.ఈ విధంగా వర్చువల్‌ ఆటలు ఆడే సమయంలో అడ్రాలిన్‌ గ్రంథి విడుదల చేసే హార్మోన్‌ల మోతాదులో మార్పులు సంభవిస్తున్నాయని వైద్యులు అంటున్నారు. వీడియోగేమ్స్‌ ఆడే యువత ముఖ్యంగా పిల్లల్లో ఊబకాయం వంటి సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఊబకాయం మూలంగా పిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం వంటి అనారోగ్యాలు కలగడానికి అవకాశముందని వైద్యులు ఈ సందర్భంగా అంటున్నారు.

వీడియో గేమ్స్‌ ఆసక్తికర అంశాలు

- చైనాలోని హాంగ్జులో 2022లో జరిగే ఆసియా క్రీడల్లో ఈ-స్పోర్ట్స్‌ (వీడియో గేమింగ్‌)ను అధికారికంగా నిర్వహించనున్నట్టు ఆసియా ఒలింపిక్‌ కౌన్సిల్‌ (ఓసీఏ) పేర్కొనడం విశేషం.
- అమ్మాయిల కంటే అబ్బాయిలే వీడియో గేమ్స్‌కి ఎక్కువ ఆకర్షితులు అవుతున్నారు. కాగా.. బీభత్స యుద్ధాలు, చేజింగుల వంటి ఆటలపై అబ్బాయిలు మక్కువ చూపుతుండగా.. పజిల్స్‌, ప్లాట్‌ ఫారమ్స్‌ తదితర ఆటలను అమ్మాయిలు ఇష్టపడుతున్నారట!
- గత యేడు ప్రారంభమైన పోక్‌ మన్‌ గో వర్చువల్‌ రియాలిటీ గేమ్‌ మాయలో పడి అమెరికాలోని ఓ కుటుంబానికి చెందిన నలుగురు ప్రమాదాలకు గురవ్వడంతో ఆ గేమ్‌ కు ఎడిక్ట్‌ అయిన వారిని బాగు చెయ్యడానికి కాగ్నిటివ్‌ బిహేవిరల్‌ థెరపిని ఆ ఫ్యామిలీ ఉపయోగించడం కొసమెరుపు.

శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం

(మొదటిపేజీ తరువాయి)

ఆధారపడిన రైతులందరికీ మేలు జరగనుంది. రూ.1000 కోట్లతో చేపట్టనున్న ఎస్సారెస్పీ పునర్జీవన పథకానికి సీఎం కేసీఆర్‌ గురువారం పోచంపాడ్‌ డ్యామ్‌ వద్ద శంకుస్థాపన చేయనున్నారు. రూ.863 కోట్లలో కాకతీయ ప్రధాన కాలువ మరమ్మతుల కోసం రూ.385.56 కోట్లు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతుల కోసం రూ.356.13 కోట్లను కేటాయించారు. నిజామాబాద్‌ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో ఆయకట్టుకు నీరందించే లక్ష్మీకెనాల్‌ మరమ్మతుల కోసం రూ.20కోట్లా 44లక్షలు, నిర్మల్‌ జిల్లా నిర్మల్‌, ఖానాపూర్‌ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆయకట్టుకు నీరందించే సరస్వతి కెనాల్‌ మరమ్మతుల కోసం రూ.49కోట్ల 30లక్షలు మంజూరయ్యాయి. నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌ నియోజకవర్గంలో ఆయకట్టుకు నీరందించేందుకు గాను సదర్మాట్‌ కాలువల మరమ్మతుల కోసం రూ.21 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసి ఎండీ, ఎస్సారెస్పీ డ్యామ్‌, లోయర్‌ మానేరు డ్యామ్‌ల మరమ్మతుల కోసం రూ.31.32 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

చెరువుకు గండి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తంగా 26.6 మి.మీ. వర్షం కురిసింది. చర్ల మండలంలోని తాలిపేరుకు భారీగా వరదనీరు రావడంతో నాలుగు గేట్లు ఎత్తి 5542క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మహాదేవ్‌పూర్‌ మండలంలోని పెద్దంపేటవాగు వర్షాలకు పొంగిపొర్లుతోంది. దీంతో లోతట్టు 17 గ్రామాలకు, మహదేవపూర్‌ మండలకేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. వాగుపై బ్రిడ్జీ నిర్మాణం చేపట్టకపోవడంతో యేటా వర్షాకాలంలో మూడు నెలలపాటు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాగులపై కాలి నడకన, నాటుపడవల ద్వారా ప్రయాణిం చడంతో ఇప్పటికే నలుగురు మృత్యువాతపడ్డారు. రెండేండ్ల కిందట పెద్దంపేట బ్రిడ్జీ నిర్మాణానికి రూ.5.25కోట్లు మంజూరైనా కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తికావడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కేతేపల్లి మండలంలో వర్షం భారీ వర్షం కురిసింది. మూసీ నీటి మట్టం 633 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 645 అడుగులు. పైన కురుస్తున్న వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతుండడంతో క్రమంగా పెరుగుతుంది. మండలంలోని చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరాయి. పత్తిచేలల్లో నీళ్లు నిలిచాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ నియోజకవర్గంలో కురిసిన వర్షం రైతులకు ఊరట కలిగించింది. 3 సెం.మీ వర్షం కురిసినట్టు అధికారులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రాయపోల్‌, జగదేవపూర్‌, ప్రజ్ఞాపూర్‌, మర్కుక్‌, ములుగు, మిరుదొడ్డి, మనోహరాబాద్‌ మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో మోస్తరు వర్షం పడింది. 15రోజులుగా వర్షాలు పడక మెట్ట పంటలు ఎండుతున్న క్రమంలో ఈముసురుతో పంటలకు కొంత ప్రాణం పోసినట్టయింది. భారీ వర్షాలు లేక బోర్ల కింద సైతం వరినాట్లు మొదలు కాలేదు. న్యాల్కల్‌ మండలంలో 40మి.మీ., పటాన్‌చెరువులో 80మి.మీ., రామచంద్రాపురంలో 50.4ఎంఎం చొప్పున వర్షపాతం నమోదైంది. వట్‌పల్లి, అందోలు మండలాలు మినహా వర్షప్రభావం కనిపించింది. నాగర్‌కర్నూల్‌ జిల్లా కొల్లాపూర్‌లో మంగళవారం రాత్రి నుండి చిరుజల్లులు పడుతున్నాయి. పెద్దకొత్తపల్లి మండల కేంద్రం, షాతాపూర్‌, కొత్తపేట, లింగాల ప్రాంతాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రొఫెసర్‌ జయశంకర్‌-భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని అటవీ గ్రామాలు వర్షం రాకతో విలవిల్లాడుతున్నాయి.

ఎగువ అటవీ ప్రాంతంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పలిమెల, మహదేవపూర్‌ ప్రధాన రహదారి మధ్యలో గల పెద్దంపేట, లెంకలగడ్డ, పంకెన వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో తాత్కాలిక వంతెనలు పూర్తిగా కొట్టుకుపోయాయి. వివిధ పనుల రీత్యా మహాదేవపూర్‌ రావడానికి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దంపేట వాగు అసంపూర్తి వంతెనపై నిచ్చెన వేసుకొని దాటే ప్రయత్నం చేస్తున్నారు. పలిమెల, పంకెన, సర్వాయిపేట, ముకునూరు, నీలంపల్లి గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. రెండ్రోజుల కిందట వివిధ అవసరాల రీత్యా మహదేవపూర్‌కు వచ్చిన ప్రయాణికులు వారి సొంత గ్రామాలకు చేరుకోలేక, ఇటు మహాదేవపూర్‌లో వసతి లేక రోడ్లపాలయ్యారు. వాగుల్లో నీటి ఉధృతి పూర్తిగా తగ్గుముఖం పడితేగానీ ప్రయాణం సాగేట్టు లేదు.

బీజేపీకి భంగపాటు

(మొదటిపేజీ తరువాయి)

కేవలం 38 ఓట్లు మాత్రమే లభించడంతో ఓటమిని అంగీకరించాల్సివచ్చింది. గుజరాత్‌లో మూడు సీట్లకు నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. మంగళవారం ఓటింగ్‌ జరిగింది. మొత్తం 182 మంది సభ్యులకు గాను 176 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన ఆరు సీట్లు గుజరాత్‌ అసెంబ్లీలో ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్‌ నుంచి ఇద్దరు రెబల్‌ ఎమ్మెల్యేలు ఎన్నికల నియామళిని ఉల్లంఘిస్తూ తమ బ్యాలెట్‌ పేపర్లను అమిత్‌ షాకు చూపించారని, ఆ ఓట్లను రద్దు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రిటర్నింగ్‌ అధికారి మొదట వీరి అభ్యర్థనను తిరస్కరించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్‌, మాజీ మంత్రి ఆర్‌పిఎన్‌ సింగ్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ నేతలు ఢిల్లీలోని ఎన్నికల సంఘ అధికారులను కలిశారు. రిటర్నింగ్‌ అధికారి నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటింగ్‌ వీడియో ఫుటేజ్‌ను అందించి దాని ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆ రెండు ఓట్లను రద్దు చేయాలని అహ్మద్‌ పటేల్‌ కూడా ఎన్నికల సంఘానికి ఈ మెయిల్‌ పంపారు. అయితే బీజేపీ కూడా తమ కేంద్రమంత్రులు అరుణ్‌ జైట్లీ, రవిశంకర్‌ ప్రసాద్‌లతో కూడిన బృందాన్ని పంపింది. వెనువెంటనే కౌంటింగ్‌ ప్రారంభించాలని వారు ఈసీని కోరారు.. రాజ్యసభ ఎన్నికల్లో రహస్య ఓటింగ్‌కు ఎంతమాత్రం విలువ లేదని, రాజ్యసభ ఎన్నికలను పార్లమెంట్‌ బహిరంగ బ్యాలెట్‌తో జరుపుతుందని వారు వాదించారు. ఆ తర్వాత గులాం నబీ ఆజాద్‌ నేతృత్వంలో మరో కాంగ్రెస్‌ బృందం వచ్చి ఎన్నికల సంఘం అధికారులను కలిసి వారి వాదనను వినిపించింది. కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఈసీ, ఓటింగ్‌ వీడియో ఫుటేజ్‌ను కూడా తెప్పించుకుంది. ఇద్దరు ఎమ్మెల్యేలు పోలింగ్‌ నియమాలను ఉల్లంఘించారని నిర్ణయం ప్రకటించింది. ఆ రెండు ఓట్లను చెల్లనవిగా తేల్చింది. అహ్మద్‌ పటేల్‌ను మరోసారి రాజ్యసభకు రానీయకుండా చేయాలని బీజేపీ పెద్ద ఎత్తున ప్రయత్నించింది. కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలను లోబరుచుకునేందుకు సర్వవిధిలా ప్రయత్నించింది. బీజేపీ ప్రభావం నుండి తప్పించేందుకే కాంగ్రెస్‌ పార్టీ తన ఎమ్మెల్యేలను కర్నాటకు పంపించింది. ఎన్నికల సమయానికి తిరిగొచ్చిన ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌ పార్టీకే ఓటు వేశారు. దీంతో బిజెపికి భంగపాటు తప్పలేదు. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు, దిగజారుడు రాజకీయాలకు పాల్పడినా బీజేపీకి ఫలితం మాత్రం దక్కలేదు.

బీజేపీ వైఖరి బయటపడింది: అహ్మద్‌ పటేల్‌

గుజరాత్‌ రాజ్యసభ ఎన్నికల్లో తనను ఓడించడానికి చేసిన ప్రయత్నాలతో బీజేపీ వైఖరేంటో అందరికీ అర్థమైందని అహ్మద్‌ పటేల్‌ చెప్పా రు. "సత్యమేవ జయతే, ఇది కేవలం నా విజయం మాత్రమే కాదు, డబ్బు దర్పం, కండబలం, అధికార దుర్వినియోగం ఓటమి" అని పటేల్‌ ట్విట్టర్‌లో అన్నారు. వచ్చే గుజరాత్‌ అసెంబ్లీలో తడాఖా చూపుతామని అహ్మద్‌ పటేల్‌ మీడియాతో అన్నారు. మరోవైపు అహ్మద్‌ పటేల్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలను ఆ పార్టీ బహిష్కరించింది.


వైద్యుల్ని పంపండి

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా పడింది. బాధితుల సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని కేసును అత్యవసరంగా విచారించాలని న్యాయవాది వి.రఘునాథ్‌ కోరారు. 'తంగళ్లపల్లి వాగు నుంచి ఇసుకను రోజూ రాత్రీపగలని లేకుండా 200 లారీల్లో నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాల మీదుగా తరలించడాన్ని దళితులు ప్రశ్నిస్తే పోలీసులు థర్డ్‌ డిగ్రీ ప్రయోగించారని ఆయన చెప్పారు. లారీల అతి వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, గత నెల 2న రోడ్డు ప్రమాదంలో నేరెళ్ల గ్రామస్తుడొకరు మరణిస్తే మూడు గ్రామాల ప్రజలు ఆందోళన చేశారని తెలిపారు. మతదేహానికి అంత్యక్రియలు జరిగాక మఫ్టీలో 50మందికిపైగా పోలీసులు గ్రామాల్లోకి చొరబడి 8 మందిని బలవంతంగా లాక్కెళ్లి విచక్షణారహితంగా కొట్టారని చెప్పారు. మర్మాంగాలకు కరెంట్‌ షాక్‌ ఇచ్చారని, రబ్బరు స్టిక్స్‌తో చితకబాదారని, సాక్షాత్తూ జిల్లా ఎస్పీ విశ్వజీత్‌ స్వయంగా బాధితులను కొట్టించారని న్యాయవాది చెప్పారు. బాధితుల ఆచూకీ కోసం మూడు గ్రామాల వాళ్లు ఆందోళన చేస్తే చివరికి పోలీసులు వారిని కోర్టులో హాజరుపరిచారని, కోర్టు కూడా టెక్నికల్‌గానే వారిని రిమాండ్‌కు ఆదేశించారని, కానీ జెలు సూపరింటెండెంట్‌ బాధితుల గాయాల తాలుకు సర్టిఫికెట్‌ చూపితేనే వారిని జైల్లోకి అనుమతిస్తానని చెప్పారన్నారు. సర్టిఫికెట్‌ ఇచ్చాకే జైలులోకి అనుమతి ఇచ్చారని వివరించారు. ఆ తర్వాత కోర్టు షరతులతో బెయిల్‌ ఇచ్చిందని న్యాయవాది రఘునాథ్‌ తెలిపారు. కింది కోర్టు వారికి బెయిల్‌ ఇచ్చిందని, పిటిషనర్‌ తీవ్ర ఆరోపణల నేపథ్యంలో వారికి వరంగల్‌లో వైద్యం చేయిస్తామని తెలంగాణ ఏజీ డి.ప్రకాష్‌రెడ్డి ప్రతివాదన చేశారు. నిమ్స్‌లో వైద్యం చేస్తే బాగుంటుందని బెంచ్‌ సూచన చేసింది. వైద్య సేవలు అందించడం బాగుంటుందని స్పష్టం చేసింది. ఫోరెన్సిక్‌ నిపుణులను పంపాలని పిటిషనర్‌ న్యాయవాది కోరగా ప్రధానంగా వైద్యం అందాలని, ఆ తర్వాత ఇతర విషయాల్లోకి వెళ్లవచ్చునని బెంచ్‌ అభిప్రాయపడింది. ఎంజీఎం వైద్యుల నివేదికతోపాటు ప్రభుత్వానికి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా వివరాలివ్వాలని తెలంగాణ సర్కార్‌ను బెంచ్‌ ఆదేశిస్తూ తదుపరి విచారణ16కి వాయిదా వేసింది.

సెన్సెక్స్ ▼216	నిఫ్టీ ▼71	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు
31,797	9,908	63.83	రూ. 29,069	రూ. 41,100	హైదరాబాద్ 320, ఒక్కగుడ్డుకు 3.80, వరంగల్ 322, విజయవాడ 320, చెన్నై 355, ముంబయి 365






టాటా మోటార్స్ లాభాల్లో 42% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ దేశీయ కార్ల తయారీ దిగ్గజం టాటా మోటార్స్ 2017 ఏప్రిల్-జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి 42 శాతం వృద్ధితో రూ.3,182 కోట్ల లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,236 కోట్లుగా ఉంది. క్రితం త్రైమాసికంలో మొత్తం ఆదాయం 10శాతం క్షీణించి రూ.66,339 కోట్ల నుంచి రూ.59,972 కోట్లకు పడిపోయింది. వచ్చే సెప్టెంబర్‌లో నెక్సాన్ కారు తీసుకోచ్చే యోచనలో ఉన్నట్టుగా తెలిపింది. జాగ్వార్ లాండ్ రోవర్ పెన్షన్ ప్రణాళికలో చేసిన మార్పులతో కంపెనీకి రూ.3,609 కోట్లు లాభం వచ్చినట్టుగా తెలిపింది. జూన్ త్రైమాసికంలో వాణిజ్య, ప్యాసింజర్ వాహనాల ఎగుమతులు గతేడాదితో పోల్చితే 11.8శాతం క్షీణించి 1,11,860 యూనిట్లుగా నమోదయ్యాయి. బుధవారం బిఎస్ఇలో టాటామోటార్స్ షేర్ 3.17శాతం క్షీణించి రూ.416.75 వద్ద ముగిసింది.

బ్యాంకు ఆఫ్ ఇండియా భళా

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బ్యాంకు ఆఫ్ ఇండియా (బీవోఐ) 2017 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మొండి బాకీలు తగ్గించుకోవడం ద్వారా రూ.87.71 కోట్ల లాభాలు సాధించి భళా అనిపించుకుంది. ఇంతక్రితం మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా రూ.1,045.54 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. 2016 ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఈ బ్యాంకు రూ.741.36 కోట్ల నష్టాలు నమోదు చేసింది. 2016-17లో బీవోఐ మొత్తంగా రూ.1,558.34 కోట్ల నష్టాలు మూటగట్టుకుంది. బీవోఐ క్రితం త్రైమాసికంలో రూ.11,106.61 కోట్ల ఆదాయం ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.10,664.36 కోట్ల ఆదాయం నమోదు చేసుకుంది. గత జూన్ ముగింపు నాటికి బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 13.05 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే కాలం నాటికి జీఎన్‌పీఏ 13.38 శాతంగా చోటు చేసుకుంది. క్రితం క్యూ1 ముగింపు నాటికి బ్యాంకు నికర ఎన్‌పీఏ 6.70 శాతానికి నియంత్రించింది. 2016 ఇదే కాలం నాటికి నికర ఎన్‌పీఏ 7.78 శాతానికి ఎగిసింది. గత త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.2,45.28 కోట్ల కేటాయింపులు చేసింది. 2016 ఇదే త్రైమాసికంలో రూ.2,770.19 కోట్ల కేటాయింపులు జరిపింది.

పూర్వాంకరకు ఆకర్షణీయ లాభాలు

బెంగళూరు: స్థిరాస్తి అభివృద్ధి సంస్థ పూర్వాంకర జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సంస్థ లాభం 117.23 శాతం మేర పెరిగి రూ.16.64 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.7.66 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో సంస్థ ఆదాయం కూడా 11.43 శాతం మేర పెరిగి రూ.311.65 కోట్ల నుంచి రూ.347.29 కోట్లకు చేరింది. మొదటి త్రైమాసికంలో సంస్థ ఈపీఎస్ రూ.0.33 నుంచి రే.0.70కు చేరింది. మేటి అమ్మకాల నేపథ్యంలోనే తాము మెరగున ఆర్థిక ఫలితాలను నమోదు చేసేందుకు వీలుపడిందని సంస్థ ఎండీ ఆర్. పూర్వాంకర తెలిపారు. ఇదే త్రైమాసికంలో సంస్థ ఆదాయపు వసూళ్లు కూడా రూ.281 కోట్లకు చేరినట్టుగా ఆయన తెలిపారు.

36 లక్షల మంది మదుపరులకు షాక్!

సెబీ ట్రేడింగ్ నిషేధంతో భారీగా ప్రభావం

- 'సర్జికల్ స్ట్రైక్'తో బోరుమంటున్న 331 కంపెనీల మదుపరులు
- నష్టం లేకుండా బయటకు రాలేని దుస్థితి



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 331 కంపెనీల ట్రేడింగ్ నిలిపివేయడం ప్రధానంగా చిన్న, రిటైల్ మదుపరులపై పెను ప్రభావం చూపింది. సెబీ నిర్ణయంతో దాదాపుగా 36 లక్షల మంది మదుపరుల సొమ్ములు స్టాక్ మార్కెట్లలో బ్లాక్ అయ్యే పరిస్థితి నెలకొంది. కొన్ని సంస్థల ప్రమోటర్లు చేసిన తప్పులకు.. ఇప్పుడు సామాన్య మదుపరి బలైపోయాడు. కోటీశ్వరులైన బడా బాబులు ఆయా సంస్థలో ద్వారా అక్రమాలకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్నప్పుడు మౌనంగా ప్రేక్షక పాత్ర పోషించిన సర్కారు.. ఇప్పుడు ఆయా కంపెనీల స్టాక్ బాగా పెరిగిన తరువాత చల్లాగా ట్రేడింగ్‌పై నిషేధం విధించింది. దీంతో అమాయకపు మదుపరుల సొమ్ము స్టాక్ మార్కెట్లలో ఇరుక్కొనే పరిస్థితి నెలకొంది. ఆయా కంపెనీల స్టాక్స్‌ను జీఎస్ఎం విభాగంలో చేర్చడంతో ఇప్పుడు నష్టం లేకుండా మదుపరులు ఈ స్టాక్స్ నుంచి బయటకు రాలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

187% వరకు పెరిగిన స్టాక్స్...

గత ఏడాది కాలంగా నిషేధిత కంపెనీల స్టాక్స్ మెరుగైన పని తీరును ప్రదర్శించాయి. ఆయా కంపెనీల స్టాక్స్ దాదాపు 187% వరకు పెరిగాయి. కొన్ని రెండింతలు కావడం కూడా కనిపిస్తోంది. దీంతో చాలా మంది మదుపరులు ఆకర్షితులై ఆయా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారని మార్కెట్ వర్గాలు చెబతున్నాయి. ఇప్పుడు ఒకేసారి ప్రభుత్వ ఈ కంపెనీల స్టాక్స్‌పై సర్జికల్ స్ట్రైక్ మాదిరిగా నిషేధం విధించడంతో చిన్న మదుపరుల సొమ్ములు ఈ స్టాక్స్‌లో ఇరుక్కుపోయానయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన వ్యూహాత్మక మదుపరులైన రాకేష్ ఝున్‌ఝున్‌వాలా, డీఎస్‌పీ బ్లాక్‌రాక్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్, రిలయన్స్ మ్యూచువల్ అండ్ యూటీఐ లాంటి బడా సంస్థలు కూడా ట్రేడింగ్ నిషేధిత కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి ఉన్నాయి. దేశీయ సంస్థకు తోడు విదేశీ సంస్థాగత మదుపరి సంస్థలైన 'గోల్డ్‌మెన్ శాక్స్', ఫిడిలిటీ, బ్లాక్‌రాక్, స్మాల్‌క్యాప్ వరల్డ్ లాంటి సంస్థలు కూడా ఈ స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టి ఉన్నాయి. సెబీ నిషేధించిన సంస్థలో ముంబయి కేంద్రంగా పని చేస్తున్న ముంబయి మెట్రో-3 ఫేజ్ రైల్ ప్రాజెక్టు పనులను పొందిన సంస్థ కూడా ఉండడం విశేషం.

శాట్‌ను ఆశ్రయించిన కంపెనీలు..

అనూహ్యంగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తమ కంపెనీలపై నిషేధం విధించడాన్ని పలు కంపెనీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. దీంతో పలు సంస్థలు సెబీకి వ్యతిరేకంగా 'సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యూనల్'ను (శాట్) ఆశ్రయించాయి. తమ సంస్థలను సెబీ అనుమానాస్పద డొల్ల కంపెనీల జాబితాలో చేర్చడాన్ని ఆయా సంస్థలు ప్రధానంగా ఆక్షేపించాయి. శాట్‌ను ఆశ్రయించిన సంస్థల్లో జేకుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, పార్శ్వనాథ్ డెవలపర్స్ తదితర సంస్థలు ఉన్నాయి. తమ సంస్థ స్టాక్స్ ట్రేడింగ్‌పై విధించిన నిషేధాన్ని తొలగించాలని వీరు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నట్టుగా సమాచారం. అయితే నియంత్రణ సంస్థ సెబీ మాత్రం తమ నిర్ణయాన్ని బుధవారం మరోమారు సమర్థించుకోవడం విశేషం.

స్టాక్ మార్కెట్లపై యుద్ధ మేఘాలు

- ఉత్తర కొరియా హెచ్చరికలతో నష్టాల్లోకి
- 216 పాయింట్ల క్షీణించిన సెన్సెక్స్



ముంబయి: అమెరికా-ఉత్తర కొరియాల మధ్య నెలకొన్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశీయ స్టాక్‌మార్కెట్లపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. తాజాగా అమెరికా సమీపంలో అణుదాడి చేసేందుకు తాము ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉత్తర కొరియా హెచ్చరికలు జారీ చేయడంతో ప్రపంచ మార్కెట్లలో తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. ఈ పరిణామానికి తోడు ముఖ్యంగా వైద్య, ఆటో రంగాల సూచీలలో ఒత్తిడితో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టాల్లోనే కదలాడినట్టయింది. బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 216.35 పాయింట్లు కోల్పోయి 31,797.84 పాయింట్లకు జారింది. గత మూడు వారాల్లో ఇదే అత్యల్ప స్థాయి కారవడం విశేషం. ఉదయం 31,926 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ ఓ దశలో గరిష్టంగా 31,967 పాయింట్లను తాకింది. అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో 31,732 పాయింట్ల కనిష్ట స్థాయిని చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈనిఫ్టీ 70.5 పాయింట్లు పడిపోయి 9,908.05 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈలో రంగాల వారిగా వైద్య సూచీ అత్యధికంగా 3.73 శాతం నష్టపోయింది. ఇదే క్రమంలో ఆటో సూచీ 1.68 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.1 శాతం, మౌలిక వసతులు 1.05 శాతం చొప్పున దిగజారాయి. సెన్సెక్స్‌లో ఎన్‌టీపీసీ 1.25 శాతం, ఓఎన్‌జీసీ 0.98 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.84 శాతం, హెడీఎఫ్‌సీ 0.63 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంకు 0.52 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు సన్ ఫార్మా 5.13 శాతం, అదానీ పోర్ట్సు 4.12 శాతం, టాటా మోటార్స్ 3.17 శాతం, సిప్లా 2.83 శాతం, బజాజ్ ఆటో 2.79 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి. ఉత్తర కొరియా తాజా హెచ్చరికల నేపథ్యంలో అమెరికా మార్కెట్లు కూడా నష్టాలు చవి చూశాయి. మరోవైపు ఆసియన్ సూచీలు ప్రతికూలతను ఎదర్కొన్నాయి.

తగ్గిన వ్యవసాయోత్పత్తుల ఎగుమతి

మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: భారత వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో (2016-17లో) 33.87 బిలియన్ డాలర్లకు పడిపోయాయని కేంద్ర వెల్లడించింది. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా ఈ విషయం తెలిపారు. 2013-14లో ఈ రంగం ఎగుమతులు 43.23 బిలియన్ డాలర్లగా నమోదయ్యాయని బుధవారం మంత్రి రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవడం ఈ రంగం ఎగుమతులపై ప్రభావం చూపాయన్నారు. దీంతో భారత ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లో పోటీ పడలేకపోయాయని పేర్కొన్నారు. కాగా 2016-17లో సముద్ర ఉత్పత్తులతో కలుపుకుని వ్యవసాయోత్పత్తుల దిగుమతులు 25.09 బిలియన్ డాలర్లకు పెరిగాయని మంత్రి వెల్లడించారు. 2013-14లో 15.03 బిలియన్ డాలర్ల దిగుమతులు నమోదైనట్టుగా తెలిపారు. ఈ రంగం ఎగుమతులు, దిగుమతులు వివిధ పరిణామాలపై ఆధారపడి ఉంటాయన్నారు. లభ్యత, అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో డిమాండ్, సరఫరా, పరిస్థితులు, నాణ్యత పరమైన అంశాలు ప్రభావితం చేస్తాయన్నారు. ముఖ్యంగా భారత్ వంట నూనెలు, పప్పుల కొరతను ఎదుర్కొంటుందన్నారు. క్రితం మూడేండ్ల నుంచి దేశం మొత్తం ఎగుమతుల్లో వ్యవసాయోత్పత్తుల వాటా క్రమంగా తగ్గుతూ వస్తోందని మంత్రి మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2016-17 దేశ మొత్తం ఎగుమతుల్లో 12.26 శాతం, 2014-15లో 12.59 శాతం చొప్పున తగ్గుదల చోటు చేసుకుందన్నారు.

అనాగరికంగా మాట్లాడొద్దు...

సీఎంకు సీపీఐ హితవు

- ధర్నాచౌక్‌పై ఈనెల 21న ఢిల్లీలో ధర్నా



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కమ్యూనిస్టులు, ఇతర విపక్షాలనుద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని సీపీఐ విమర్శించింది. ఇలా అనాగరికంగా మాట్లాడొద్దంటూ సీఎంకు హితవు పలికింది. అధికారం ఎప్పుడూ, ఎవరికీ శాశ్వతం కాదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సత్యాన్ని తెలుసుకుని అహంభా వపూరిత వైఖరిని విడనాడితే మంచిదని కేసీఆర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లేపల్లి ఆదిరెడ్డితో కలిసి చాడ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో.. 'ఎర్రజెండాలేని ఉద్యమాన్ని ఊహించలేను..' అంటూ వ్యాఖ్యానించిన కేసీఆర్ ఇప్పుడు అదే ఎర్రజెండాలపై ఇష్టానుసారంగా మాట్లాడటం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శమని ఎద్దేవా చేశారు. ఆ సందర్భంగా సీపీఐ అగ్రనేత బర్దన్‌తోపాటు సురవరం సుధాకరరెడ్డి, నారాయణతో ఆయన పలుమార్లు సమావేశమయ్యారని గుర్తుచేశారు. సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్, సీతారాం ఏచూరీలను కూడా ఆయన కలిశారని తెలిపారు. ఇలాంటి విషయాలన్నింటినీ విస్మరించి ఇప్పుడు కమ్యూనిస్టులను మూర్ఖులని వ్యాఖ్యానించటం అత్యంత గర్హనీయమని అన్నారు. సీఎం వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. 'మూర్ఖులంటే ప్రజల సమస్యలను పట్టించుకోనివారు, ఇతరులు చెప్పే మాటలను పెడచెవిన పెట్టి, మొండిగా వ్యవహరించేవారు... దీన్నిబట్టి మూర్ఖులెవరో తేల్చుకోండి...' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ మాఫియా రాజ్యంగా మారిందని చాడ విమర్శించారు. నేరెళ్ల ఘటనకు సంబంధించి.. దొంగలుపడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టుగా మంత్రి కేటీఆర్ అంతా అయిపోయాక ఇప్పుడు తీరిగ్గా బాధితులను పరామర్శించారని దుయ్యబట్టారు. ధర్నాచౌక్ పరిరక్షణకు సంబంధించి ఈనెల 21న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగడతామని అన్నారు. ఇదే అంశంపై కోర్టులో కేసు కూడా వేశామని వివరించారు.

కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని నారాయణ, శ్రీచైతన్య కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం నాగేశ్వరరావు, కోట రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనలు పాటించకుండా, విచ్చలవిడిగా క్యాంపస్‌లు పెడుతూ విద్యావ్యాపారం చేస్తున్నా, ఇంటర్‌బోర్డు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లోని నాగోలులో నారాయణ జూనియర్ కాలేజీ యాజమాన్యం, సిబ్బంది పెట్టే మానసిక ఒత్తిడికి తట్టుకోలేక శ్రావ్య అనే విద్యార్థిని బుధవారం ఆత్మహత్య చేసుకున్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఇంటర్‌బోర్డు స్పందించి కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

దొరల కట్టడికి తాడు పేనుతున్నం

అదే టీ మాస్ సమరభేరి

- అందుకే కేసీఆర్‌లో వణుకు
- ప్రజలను చంపితే, కొడితే మేం ఊరుకోం..తిరగబడతాం : రంగారెడ్డి జిల్లా ఆవిర్భావ సభలో పలువురు వక్తలు



మాట్లాడుతున్న ప్రజాగాయకుడు గద్దర్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

'దొరల కట్టడికి తాడు పేనుతున్నం. అదే టీమాస్ రూపంలో సమరభేరి మోగిస్తున్నది. ఇప్పటికే టీ-మాస్‌తో కేసీఆర్‌లో వణుకు మొదలైంది' అని టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు అన్నారు. ఇసుక మాఫీయాను అడ్డుకున్న నేరెళ్ల దళితులను కొట్టడాన్ని ప్రశ్నిస్తే.. దళితులని ముఖం మీద రాసుకున్నారా? అని ముఖ్యమంత్రి వితండవాదం చేస్తున్నాడని విమర్శించారు. దళితులు కాకుంటే కొట్టాలని ఎక్కడైనా రాసి ఉందా? అని ప్రశ్నించారు. లారీలను తగులబెడితే ప్రభుత్వం ఊరుకుంటుందా అని సీఎం అంటున్నారు... ప్రజలను చంపితే, కొడితే టీ మాస్ ఊరుకోదని హెచ్చరించారు. టీ మాస్ రంగారెడ్డి జిల్లా ఆవిర్భావ సభ ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్‌లో బుధవారం జరిగింది. ఈ సభకు టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, జేబీ రాజు, విమలక్క, పీఎల్.విశ్వేశ్వరరావు, జాన్‌వెస్లీ, ప్రజాగాయకుడు గద్దర్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. కేటీఆర్ ప్రయివేటు కంపెనీలో డైరెక్టర్‌గా ఉండి మంత్రిగా కొనసాగడం 1951చట్టం సెక్షన్9 ప్రకారం నేరమన్నారు. అదే కంపెనీ నుంచి 2వేల బైక్‌లను కొనుగోలు చేసేందుకు రూ.350కోట్లు మంజూరు చేయడం రాష్ట్ర ప్రభుత్వ దుష్టనీతికి నిదర్శనమన్నారు. దీనిపై టీమాస్ ప్రశ్నిస్తుంటే... కేసీఆర్‌కు కంపరం పుడుతోందన్నారు. తాము సంధించిన ప్రశ్నకు ముఖ్యమంత్రి నుంచి నేటికీ సమాధానం రాలేదన్నారు. ఇప్పటికీ 'ప్రయివేటు కంపెనీలో నీ కొడుకు కేటీఆర్ డైరెక్టర్‌గా ఉన్నాడా? లేడా?.. లేడని నువ్వంటే, ఉన్నాడని నిరూపించడానికి ఆధారాలున్నాయ్' అని తమ్మినేని సవాల్ విసిరారు. సామాజిక న్యాయం ద్వారానే తెలంగాణ సమగ్రాభివృది సాధ్యమవుతు ందన్నారు. అట్టడుగు వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసమే టీమాస్ ఆవిర్భవించిందని పునరుద్ఘాటించారు. విద్య, వైద్యం, తాగు, సాగునీరు, ఉపాధి టీమాస్ ముఖ్య లక్ష్యమన్నారు. సుమారు 10వేల సంఘాలతో కలిసి టీమాస్ చరిత్ర సృష్టించబోతోందన్నారు. ఇప్పటికే నేరెళ్లలో జరిగిన ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పాల్వంచలో విద్యుత్ ఉద్యోగి ఆత్మహత్య ప్రభుత్వానికి మేలుకొలుపు కావాలన్నారు. 93శాతం ప్రజలు ఏకమవుతున్నారని చెప్పారు. భూమి పోరాటాలకు సిద్ధమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్న భూములకు 2013 చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్రంలో దొరల రాజ్యం సాగనియ్యబోమని ప్రజాగాయకుడు గద్దర్ హెచ్చరించారు. కులం, మతం, వర్గం అనే తేడా లేకుండా సమానత్వం కోసం ఉద్యమాలు నిర్వహించాలన్నారు. భూస్వామ్య వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించాలన్నారు. అందుకే టీమాస్ ఉద్భవించిందన్నారు. 'టీఆర్ఎస్ పాలనలో సమస్యలు మిగిలాయి. అవినీతి, దోపిడీ పెరిగింది. దళితులపైనా, మైనార్టీలపైనా దాడులు పెరుగుతున్నవి. హత్యలు చేస్తున్నరు, ఆదివాసీలను అడవికి దూరం చేస్తున్నారు' అని టఫ్ రాష్ట్ర నాయకురాలు విమలక్క వాపోయారు. వీటిని టీమాస్ వెలుగులోకి తెస్తోందన్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందన్నారు.

సంఘటితమైతేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని టీమాస్ రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ అన్నారు. అంబేద్కర్ కలలుగన్న రాజ్య సాధనకు నడుం బిగించాలన్నారు.

దోపిడీ, అసమానతలు లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా ఏర్పడిన టీమాస్‌ను ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. కవులు, కళాకారులు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థి, యువజనులు ఏకమవుతున్నారని చెప్పారు. వారిని కలుపుకు పోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ రూపంలో హిట్లర్ పాలన సాగుతోందన్నారు. దానికి చరమగీతం పాడాల్సిన అవసరముందన్నారు. ఈ యుద్ధబేరికి ప్రజలే నాయకులన్నారు. ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం నాయకులు విశ్వేశ్వరరావు, రాష్ట్రనాయకులు గొరిగె మల్లేష్, చెరుపల్లి సీతారాములు, ఆశయ్య, శ్రీరాంనాయక్, భూపాల్, మాజీ ఎమ్మెల్యేలు మస్కు నర్సింహా, కొండిగారి రాములు, బి.సామెల్, పి.యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, జీవ మాదిగ, రాందాస్‌నాయక్, సీహెచ్ జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఈఎస్ఎన్‌రెడ్డి, ఈ నర్సింహా, రాంచందర్, చంద్రమోహన్, జగన్, అరుణ్‌కుమార్, రవీందర్ తదితరులున్నారు.

దూకుడు తగ్గించండి

- పాయింట్లపై ప్రజావ్యతిరేకత
- చట్టాల్లో మార్పులు సూచించండి : ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులకు మంత్రి ఆదేశాలు



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ట్రాఫిక్ ఉల్లంఘనల పేరుతో విధిస్తున్న పాయింట్లపై ప్రజావ్యతిరేకత వస్తున్నదని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. దీనిపై పున్ణపరిశీలన చేయాలని, దానికోసం చట్టాల్లో ఎలాంటి మార్పులు చేయాలో ప్రభుత్వానికి సూచించాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. బుధవారంనాడాయన సచివాలయంలో రవాణా, పోలీస్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ రంగనాథ్, జేటీసీలు పాండురంగ నాయక్, రఘునాథ్, డీటీసీ ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన అధికారుల్ని వివరణ కోరారు. ఈనెల 1 నుంచి ప్రవేశపెట్టిన పాయింట్ల విధానంపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్టు సమాచారం. ఈ విధానాన్ని అమలు చేసే స్థాయిలో నగర రోడ్లు కూడా లేవనే అంశాన్ని ఈ సందర్భంగా మంత్రి అధికారుల వద్ద ప్రస్తావించినట్టు తెలిసింది. ముందస్తు ప్రణాళికలు, సౌకర్యాలు కల్పించకుండా వాహనదారులపై చలానాలు విధించడం, పాయింట్ల పేరుతో లైసెన్సులు రద్దు చేయాలనే నిర్ణయంపై పున్ణ పరిశీలన జరగాలని ఈ సందర్భంగా మంత్రి అభిప్రాయపడినట్టు తెలిసింది. అయితే దీనిపై అధికారులు మాత్రం ఆయన్ని ఒప్పించే ప్రయత్నం చేసినట్టు సమాచారం. మూడు నెలలు చూసాక అవసరమైతే మార్పులు చేద్దామని అధికారులు మంత్రికి చెప్పినట్టు తెలిసింది. వాహన రిజిస్ట్రేషన్ల సమయంలో ఆధార్ నెంబర్‌ను తప్పనిసరి చేయాలని, రీసేల్ వాహనాల డాక్యుమెంట్లను తప్పనిసరిగా ఆర్టీఏ కార్యాలయాల్లో బదలాయించుకొనేలా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రమాద సమయాల్లో వాహనాలు ఒకరి పేరుపై, నడుపుతున్న వ్యక్తులు మరొకరుగా ఉంటున్నారని, దీనివల్ల బాధితులకు బీమా చెల్లింపుల్లో న్యాయ, చట్టపరమైన ఇబ్బందులు ఎదురౌతున్నట్టు అయన అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాహనాల కొనుగోలు, అమ్మకాల విషయంలో ప్రజల్లో జవాబుదారీతనం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రయివేటు ఫైనన్షియర్లు వాయిదాలు చెల్లించని వాహనాల్ని రికవరీ చేసుకొని, తిరిగి వాటిని మరొకరికి విక్రయిస్తున్నారని, దీనివల్ల చట్టపరమైన సమస్యలు తలెత్తుతున్నట్టు రవాణాశాఖ అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా ప్రయివేటు ఫైనాన్షియర్లు ఆటోడ్రైవర్లను వేధిస్తున్నారని, దీనిపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌లో ప్రమాదాలు 33 శాతం తగ్గాయని, 73 శాతం మరణాలు తక్కువగా నమోదు అయినట్టు అధికారులు మంత్రికి వివరించారు. ప్రమాద రహిత ప్రయాణానికై అధికారులు ప్రజలతో మమేకం కావాలని, చట్టాలు, నిబంధనలపై అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారుల్ని ఆదేశించారు.

ఆర్‌డీఎస్ ఆధునీకరణ పనులకు సహకరించండి

- కర్నాటక నీటిపారుదల శాఖ మంత్రికి హరీశ్ లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాజోలిబండి మళ్ళింపు పథకం (ఆర్‌డీఎస్) ఆధునీకరణ పనులకు సహకరించాలని కర్నాటక నీటిపారుదల శాఖ మంత్రి ఎంబీ పాటిల్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక లేఖ రాశారు. ఆర్‌డీఎస్ ఆనకట్ట ఎత్తు పెంచే పనులకు సహకరించాల్సిందిగా కర్నాటక అధికారులను రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ పలుమార్లు కోరినా తగిన స్పందన లేదని హరీశ్‌రావు ఈ లేఖలో పాటిల్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో మంత్రి జోక్యం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సమస్యను పరిష్కరించుకునేందుకు అవసరమైతే బెంగళూరు వస్తానని లేదా ఆయన హైదరాబాద్ వచ్చినా సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి వివరించారు. ఆగస్టు చివరివారంలో ఈ సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

నీటి విడుదలకు కర్నాటక సానుకూలం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీరు విడుదల చేయడానికి కర్నాటక సానుకూలత వ్యక్తం చేసింది. జంటనగరాలతో పాటూ నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతానికి తాగునీరందించడానికి 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మంగళవారం కర్నాటక జలవనరుల శాఖ మంత్రి ఎంబీ పాటిల్‌కు లేఖ రాశారు. నాగార్జునసాగర్ చీఫ్ ఇంజనీర్ సునీల్ బుధవారం బెంగళూరు వెళ్ళి ఈ లేఖను స్వయంగా పాటిల్‌కు అంచేశారు. నీటి విడుదల విషయంలో కృష్ణా భాగ్యజల నిగమ్ ఎండీతో చర్చించాల్సిందిగా కర్నాటక మంత్రి సూచించడంతో సాగర్ సీఈ ఆయనతో చర్చించారు. నీటి విడుదల ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపుతానిని ఎండీ హామీ ఇచ్చినట్టు సాగర్ సీఈ తెలిపారు. అవసరమైతే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కర్నాటక సీఎంతో ఫోన్‌లో మాట్లాడతారని అధికారులు తెలిపారు.

కిసాన్
నవతెలంగాణ



అన్ని కాలాలకూ అనువైనదే!

పొద్దుతిరుగుడు పంటను నేల స్వభావాన్నిబట్టి సంవత్సరం పొడువునా సాగు చేసుకోవచ్చు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రధాన పంటలకు ప్రత్యామ్నాయంగా దీన్ని వేసుకుంటే ప్రయోజనకరం. నీరు నిల్వ ఉండని ఎర్ర, చల్కా, ఇసుక, రేగడి, ఒండ్రు నేలలు పొద్దుతిరుగుడుకు అనుకూలం. ఉదజని సూచిక 6.5 నుంచి 8.0 ఉన్న నేలలు ఈ పంటకు చాలా అనువైనవి. బరువైన నేలలు, నల్లరేగడి నేలల్లో ఆగస్టు మూడో వారంలో విత్తనాలు వేసుకోవచ్చు. విత్తేటప్పుడు హెక్టారుకు 30 కిలలో నత్రజని, 60 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వాడాలి. ఆమ్ల లక్షణాలు కలిగిన నేలల్లో కంటే కొద్దిగా క్షార లక్షణాలు గల నేలల్లో పొద్దుతిరుగుడు బాగా పండుతుంది. ఆమ్ల లక్షణాలు పొద్దుతిరుగుడు మొలకెత్తే స్వభావాన్ని, మొక్క పెరుగుదలను, నూనె శాతాన్ని, మొక్కల పటుత్వాన్ని తగ్గించి దిగుబడి తక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. ఈ పంట అధిక తేమను తట్టుకోలేదు కాబట్టి లోతట్టు , సముద్ర తీర ప్రాంతాల్లో సాగు చేయొద్దు. తేమ ఎక్కువ కాలం నిల్వ ఉంచుకునే నల్లరేగడి నేలల్లో రబీ, వేసవి, వసంతకాలపు పంటలు వేసుకోవచ్చు.

నేల తయారీ

భూమిని నాలుగైదుసార్లు బాగా దున్ని మెత్తటి దుక్కిని తయారు చేయాలి. మధ్యస్థ, బరువు నేలలైతే బ్లేడుతో ఒకటి, రెండుసార్లు కలియదున్నాలి. తర్వాత చదును చేసి బోదెలు వేసి విత్తనం వేసుకోవచ్చు. ఇలా బోదెలు వేయడం వల్ల విత్తనాన్ని నాటేందుకు, 30 నుంచి 35 రోజుల తర్వాత మొగ్గ తొడిగే దశలో ఎరువులు పైపాటుగా వేయడానికి వీలుగా ఉంటుంది.

విత్తుకునే సమయంలో...

నీటిపారుదల పంటగా సంవత్సరం పొడువునా పొద్దుతిరుగుడును పండించుకోవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనం విత్తేటప్పుడు గుర్తించుకోవాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే పూతదశ, గింజలు తయారయ్యే దశలో పంట దీర్ఘకాల వర్షంతో లేదా పగటి ఉష్ణోగ్రత 38 సెల్సియస్‌కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. ఖరీఫ్‌లో తేలికపాటి నేలల్లో జూన్ 15 నుంచి జూలై 15 వరకు, బరువు నేలల్లో ఆగస్టు 15 నుంచి నెలాఖరు వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. రబీలో వర్షాధారం కింద నవంబరులో, నీటిపారుదల కింద జనవరి 15 నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు విత్తుకోవచ్చు. నల్లరేగడి నేలల్లో తొందరగా నాటుకున్నట్ల యితే దిగుబడి బాగా వస్తుంది. ఎర్రనేలలు, నల్లరేగడి నేలల్లో వరి తర్వాత డిసెంబర్ చివరి నుంచి జనవరి మొదటి వారం వరకు పొద్దుతిరుగుడు వేసుకోవాలి. విత్తే సమయం కూడా పొద్దుతిరుగుడు నూనె నాణ్యతను పెంచుతుంది. పువ్వు వికసించే, విత్తనం గట్టిపడే సమయంలో ఎక్కువగా పగలు, సూర్యరశ్మి ఉన్నట్లయితే నూనె శాతం ఎక్కువగా వస్తుంది. నూనె నిల్వ సామర్థ్యం ఖరీఫ్‌కంటే వేసవిలో ఎక్కువ ఉంటుంది.

విత్తన మోతాదు: వర్షాధార పండిస్తే ఎకరాకు రాకాలకైతే 3 నుంచి 4 కిలోలు, సంకరాలైతే 2 నుంచి 2.5 కిలోల విత్తనం అవసరమవుతుంది. నీటిపారుదల కింద ఎకరాకు 2.5 నుంచి 3.5 కిలోలు, సంకరాలకు 2 కిలోలు సరిపోతుంది.

విత్తనశుద్ధి: విత్తనాలను విత్తే ముందు 14 గంటలు నీటిలో నానబెట్టి తర్వాత నీడలో ఆరబెట్టి శుద్ధి చేయాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 2 నుంచి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. నెక్రోసిస్ తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తుకునే దూరం : తేలికపాటి నేలల్లో 40X20X 20 సెంటీ మీటరు మొక్కలసాంద్రత ఎకరాకు 44,400 ఉండాలి. మధ్యస్థ (పొట్టి/తక్కువ కాలపరిమితి రకాలు) నేలల్లో అంతరం ఎకరాకు 45 X 30 సెంటీ మీటర్లు మొక్కల సాంద్రత 29,600 ఎకరాకు ఉండాలి. బరువు (పొడవు/దీర్ఘకాలపరిమితి రకాల సంకరాలు) నేలల్లో అంతరం ఎకరాకు 60 X 30 సెంటీమీటర్ల లోతులో నాటాల్సి ఉంటుంది. మొక్కలు మొలకెత్తిన 10 నుంచి 15 రోజుల తర్వాత విధిగా కుదురుకు ఆరోగ్యవంతమైన ఒకే మొక్కనుంచాలి.

రకాలు : ఎంఎస్ఎఫ్‌హెచ్-8, కేబీఎస్‌హెచ్-1, ఎంఎస్ఎఫ్‌హెచ్-7, ఎన్‌డీఎస్‌హెకచ్-1

ఎరువులు : ఎకరాకు మూడు టన్నుల పశువుల ఎరువును విత్తనం వేయడానికి ముందు చల్లుకోవాలి. వర్షాధార పంటకు నత్రజని 24 (12+12), భాస్వరం 24, పొటాష్ 12, నీటిపారుదల పంట నల్లరేగడి నేలల్లో వేసుకుంటే నత్రజని 30 (10+10+10), భాస్వరం 36, పొటాష్ 12, ఎర్రనేలలు నత్రజని 24 (8+8+8), భాస్వరం 36, పొటాష్ 12 వాడాలి.



నీటి యాజమాన్యం

ఎర్రనేలల్లో 6 నుంచి 10 రోజుల వ్యవధిలో, నల్లరేగడి నేలల్లో 15 రోజుల్లో నీటి తడులు పెట్టాలి. వివిధ నేలల్లో వర్షాకా లంలో తేలిక నేలలకు 3 నుంచి 4 తడులు, మధ్యస్థ నేలలకు 2 నుంచి 3, బరువు నేలల్లో 1 నుంచి 2, శీతాకాలంలో తేలిక నేలల్లో 4 నుంచి 6 మధ్యస్థ నేలల్లో 3 నుంచి 4, బరువు నేలల్లో 2 నుంచి 3, వేసవిలో తేలిక నేలల్లో 6 నుంచి 8 మధ్యస్థ నేలల్లో తడులు పెట్టాలి. మధస్థ నేలల్లో 4 నుంచి 5, బరువు నేలల్లో 3 నుంచి 4 తడులు పెట్టాలి.

తడులకు కీలక దశలు

మొగ్గతొడుగు, పువ్వు వికసించు, గింజకట్టు దశలు నీటి తడులకు కీలకం.

కలుపు నివారణ

విత్తన 30, 40 రోజుల వరకు పంటలో కలుపులేకుండా చూసుకోవాలి. విత్తే ముందు ఫ్లుక్లోరాలిన్ 450 ఎకరాకు లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి. లేదా పెండిమిథాలిన్ 300 లీటరు లేదా అలాక్లోర్ 500 లీటరున్నర చొప్పున విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారీ చేయాలి. విత్తిన 20, 25 రోజుల్లో గొర్రుతో అంతరకృషి చేయాలి.

పురుగుల బెడద.. తెగుళ్లు

పొద్దుతిరుగు పంట సాధారణంగా రసం పీల్చే పురుగులు, ఆకుల్ని తినే పురుగులు, తలను ఆశించే పరుగుల (శనగపచ్చ) బారిన పడుతుంది. ఆల్టర్నేరియా మూడు తెగులు, తుప్పు తెగులు, పువ్వు(తల) కుళ్లు, బూజు తెగులు, నెక్రోసినస్ అనే తెగుళ్ల ఈ పంటను ఆశిస్తాయి. నిపుణుల సలహాలు, సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

అంతర పంటలు

దీనిని ఏకపంటగా లేదా వేరుశనగ, పొద్దు తిరుగుడు 4: 2, కంది, పొద్దుతిరుగుడు 1:2, పైర్లతో అంతరపంటగా పండించుకోవచ్చు. పొద్దుతిరుగుడును వేరుశనగ, కందితో వేసుకుంటే 36 శాతం, 24 శాతం అదనపు ఆదాయం వస్తుంది. పొద్దుతిరుగుడును కందితో 4: 2 నిష్పత్తిలో వేసుకుంటే 2: 4 నిష్పత్తికంటే ఎక్కువ దిగుబడి వస్తుంది.

- డాక్టర్ నగేష్, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం- పాలెం



✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪

మరో ఐదురోజులు తేలికపాటి వర్షాలు!

వ్యవసాయం.. వాతావరణం

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు 29-35 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 21-26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 25 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది.

రైతన్నలూ.. ఇవి పాటించండి

- కంది, ఆముదం, సోయాచిక్కుడు, పత్తి, మొక్కజొన్న తదితర వర్షాధార పంటల్లో తరచుగా అంతరకృషి చేసి కలుపు నివారించాలి. నేలలోని తేమను సంరక్షించుకోవాలి. నీటి సౌకర్యమున్న రైతులు నీటి లభ్యతనుబట్టి సాలు విడిచి సాలు పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరిలో తాటాకు తెగులు, కాండం తొలిచే పురుగు ఆశించేందుకు అనుకూలం. పురుగు, తెగులు గమనిస్తే లీటరు నీటిలో 2 మి.లీటర్ల ప్రొఫినోఫాస్ లేదా 2.5 మి.లీటర్ల క్లోరిఫైరిఫాస్ మందును కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు 10కిలోల కార్బోఫురాన్ 3జీ గుళికలు లేదా 4 కిలోల ఫోరేట్ గుళికలను నాటిన 15 నుంచి 20 రోజుల తర్వాత పొలంలో వేసుకోవాలి.
- మొక్కజొన్న పైరు వడబడి నట్టు గమనిస్తే ఉదయం లేదా సాయంత్రం వేళల్లో లీటరు నీటికి 10 గ్రాముల యూరియా చొప్పున కలిపి పిచికారీ చేయాలి. (మధ్యాహ్నం వేళల్లో పిచికారీ చేయొద్దు). పైరు 20-25 రోజుల దశలో మొవ్వు తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్టయితే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొగ్గి ఆకులో వేయాలి. సాధ్యమైనంత తరచుగా పైపాటు, అంతరకృషి చేసినట్టయితే కలుపు నివారణతోపాటు నేలలో తేమ ను కొంత వరకు కాపాడుకోవచ్చు. నేలలో తేమనుబట్టి పైరు 25 నుంచి30 రోజుల దశలో ఎకరానికి 50 కిలోల యూరియా, 15 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి పైపాటుగా వేయాలి.



- ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పెసర పైరుకు 20 గ్రాముల యూరియా లేదా 5 గ్రాముల మల్టీకేని లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పైరునుబెట్ట నుంచి కాపాడుకోవాలి. రసం పీల్చే పురుగులను గమనిస్తే లీటరు నీటిలో 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ మందును కలిపి పిచికారీ పిచికారీ చేయాలి.
- వర్షాభావ పరిస్థితుల్లో పత్తి పైరు వడబడినట్టు గమనిస్తే ఉదయం లేదా సాయంత్రం వేళల్లో లీటరు నీటికి 15నుంచి 20 గ్రాముల యూరియా లేదా 5 గ్రాముల మల్టీకే చొప్పున కలిపి పిచికారీ చేయాలి. మధ్యాహ్నం సమయంలో పిచికారీ చేయొద్దు. పత్తిలో రసం పీల్చే పురుగులు గమనిస్తే మోనోక్రోటోఫాస్ మందు, నీటిని 1: 4 నిష్పత్తిలో కలిపి లేత కాండంపై మెత్తని బ్రష్‌తో విత్తిన 20, 40 రోజులకు పూయాలి. సాధ్యమైనంత తరచుగా పైపాటు, అంతరకృషి చేసినట్టయితే కలుపు నివారణతోపాటు నేలలో తేమను కొంత వరకు కాపాడుకోవచ్చు. పైపాటుగా పైరు 30 రోజుల దశలో ఎకరానికి 50 కిలోల యూరియా, 15 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి పైపాటుగా వేయాలి.
- ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో మొలక కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును కలిపి మొక్కల మొదళ్లు తడిచే విధంగా పోయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కందిలో పేనుబంక ఆశించడమైనది. నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ మందును 20 గ్రాముల యూరియా లేదా 5గ్రాముల మల్టీకే మందు కలిపి పిచికారీ చేయాలి.
- ఆముదంలో దాసరి పురుగు ఉనికిని గమనించడమైంది. నివారణకు పలు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- పొలంలో ఎకరానికి 10 పక్షి స్థావరాలను అమర్చాలి. దాసరి పురుగు మొదటి దశలో లీటరు నీటిలో 5 మి.లీటర్ల వేపనూనె కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి. పొలంలో దాసరి పురుగును ఆశించే మైక్రోప్లైటిస్ పరాన్నజీవి ఉనికిని గమనించాలి. ఇది ఆశించినట్టయితే ఏ విధమైన పురుగు మందులు పిచికారీ చేయొద్దు.
- కూరగాయ పంటల్లో రసం పీల్చే పురుగులు గమనించడమైనది. నివారణకు లీటరు నీటిలో 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును కలిపి పిచికారీ చేయాలి.

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

మొక్కజొన్న, కంది పంటలకు కలుపు మందులు?

నారుమడిలో వేయాల్సిన ఎరువులు ఏవి?

- శేఖర్, పెంట్లబెల్లి (నాగర్‌కర్నూల్ జిల్లా)

రెండు గుంటల (5 సెంట్లు) నారుమడికి 2 కిలోల నత్రజని, 4.3 కిలోల యూరియా, కిలో విత్తనం చల్లే ముందు మరో కిలో విత్తినం 12 నుంచి 14 రోజులకు కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడను లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయడం చాలా మంచిది.

వరిలో విత్తనశుద్ధి ఎలా చేయాలి?

- సురేష్‌రెడ్డి, పాలకీడు (సూర్యాపేట జిల్లా)

మెట్ట నారుమళ్లు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండజిమ్‌ని తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్మునారుమళ్లలో లీటరు నీటికి ఒక గ్రాము కార్బండజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టిన తర్వాత మండె కట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.

మొక్కజొన్న, కంది పంటలకు వాడాల్సిన కలుపు మందులు ఏవి?

- సురేష్, కోరుట్ల (జగిత్యాల జిల్లా)

పెండిమిథాలిన్ 3డీపై ఎకరానికి 1.2 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తినం వేసిన వెంటనే గానీ, మరుసటి రోజు గానీ పిచికారీ చేయాలి.

పెసరలో ఏకశిల రకం మంచిదేనా?

- శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాంపూర్ (పెద్దపల్లి జిల్లా)

ఏకశిల (డబ్ల్యూజీజీ-37) రకాన్ని ఖరీఫ్, రబీ, వేసవిలో పండించొచ్చు. దీని గింజలు, ఆకర్షణీయంగా పచ్చగా మెరుస్తుంటాయి. ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ఉల్లిసాగు-సస్యరక్షణ

మన రాష్ట్రంలో సుమారు సుమారు 33,851 హెక్టార్ల విస్తీర్ణంలో ఉల్లి సాగు అవుతోంది. 18.0 టన్నుల సరాసరి దిగుబడి వస్తోంది. ఖరీఫ్‌లో ఈ పంటను నవంబర్ వరకు వేసుకోవచ్చు. వాతావరణంలో పెద్దగా మార్పులేని ప్రాంతాల్లో ఎదుగుదల బాగుంటుంది. నీరు నిల్వని సారవంతమైన మెరక నెలలు ఉల్లిసాగుకు అనుకూలం. ఉప్పు, చౌడు, క్షారత్వం, నీరు నిల్వ ఉండే నేలలు పనికిరావు.

రకాలు: బళ్లారిరెడ్, రాంపూర్‌రెడ్, వైట్ ఆనియన్, పూసారెడ్, అర్కనికేతన్, అర్కకల్యాణ్, అర్కప్రగతి, కల్యాణ్‌పూర్, రెడ్‌రౌండ్, ఎన్-53, అగ్రిఫౌండ్ లైట్‌రెడ్, అగ్రిఫౌండ్ డార్క్‌రెడ్, తెలుపు రకాలైన పూసావైట్ రౌండ్, పూసా వైట్‌ఫ్లాట్.

బళ్లారిరెడ్: పాయలు పెద్దగా ఉండి, పాయలు ఒకటిలేదా రెండుగా కలిపి ఉంటాయి. ఘాటు తక్కువగా ఉంటుంది. మన రాష్ట్రంలో సాగు చేసేందుకు అన్ని ప్రాంతాల్లో అనువైనది.

రాంపూర్‌రెడ్: బళ్లారిరెడ్ రకంలా ఉంటుంది. ఉత్తర భారతదేశంలో ప్రసిద్ధి చెందింది. పాయలు పెద్దగా ఉండి ఘాటు ఎక్కువగా ఉంటుంది. దిగుబడి తక్కువ, పాయలు తెల్లగా ఉంటాయి.

నాసిక్‌రెడ్: పాయలు మధ్యస్థంగా ఉండి, ఎరుపు రంగులో ఉంటాయి. ఘాటుగా ఉంటాయి.

అగ్రిఫౌండ్ డార్క్‌రెడ్: పాయలు ముదురు ఎరుపు రంగులో గుండ్రంగా ఉండి ఘాటుగా ఉంటాయి. ఎక్కువ రోజులు నిల్వ చేయొచ్చు. ఖరీఫ్‌లో నాటేందుకు అనువైన రకం.

పూసారెడ్: పాయలు ఎరుపు రంగులో మధ్యస్థంగా (70 నుంచి 90(గ్రాములు) ఉంటాయి. తక్కువ ఘాటుతో నిల్వనాణ్యత ఎక్కువ. దిగుబడి ఎకరానికి 100 నుంచి 120 టన్నులు.

అర్కనికేతన్: పాయలు ఎరుపు రంగులో ఉంటాయి. 100నుంచి 180 గ్రాముల బరువుంటాయి. టీఎస్ఎస్ 12-14శాతం నిల్వనాణ్యత హెచ్చు. ఘాటు ఎక్కువ. దిగుబడి ఎకరానికి 132 క్వింటాళ్లు.

అర్క కల్యాణ్: పాయల బరువు 100నుంచి 190గ్రాములు. దిగుబడి 136 క్వింటాళ్లు. ఆకుమచ్చ తెగులును కొద్దిగా తట్టుకుంటుంది. ఖరీఫ్‌కు అనుకూలం.

అర్క ప్రగతి: 120 రోజుల్లో కోతకొచ్చే గుండ్రని ఎరుపు రకం. ఖరీఫ్‌కి అనుకూలం. ఎకరానికి 130 క్వింటాళ్లు.

కల్యాణ్‌పూర్ రెడ్ రౌండ్: ఎరుపు రకం. 130 నుంచి 150 రోజుల్లో కోతకొస్తుంది. ఎకరానికి 120 క్వింటాళ్ల దిగుబడి.

ఎస్-53: పాయలు మధ్యస్థంగా గుండ్రంగా ముదురు ఎరుపు రంగులో ఉంటాయి. 140 రోజుల్లో కోతకొస్తుంది. ఎకరానికి 120క్వింటాళ్ల దిగుబడి.

అగ్రిఫౌండ్ లైట్‌రెడ్: పాయలు చిన్నవిగా గట్టిగా గులాబీ రంగులో ఘాటుగా ఉంటాయి. నారుపోయకుండానే నేరుగా విత్తనం విత్తుకోవచ్చు. ఎక్కువ రోజులు నిల్వ ఉండి రవాణాకు తట్టుకుంటుంది. ఎగుమతులకు అనువుగా ఉంటుంది.

ఇవేకాకుండా తెలుపు రకాలైన పూసావైట్ రౌండ్, పూసావైట్ ఫ్లాట్ డీహైడ్రేషన్‌కి అనువైనవి.

విత్తన మోతాదు: 3నుంచి 4.0 కిలోలు

నారు పెంచడం: నేలను బాగా దున్ని120 సెంటీ మీటర్ల వెడల్పు, 3 మీటర్ల పొడవుగల ఎత్తైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. 2-2.5 కిలోల విత్తనాన్ని 200-250 చ.మీటర్ల నారుమడిలో పెంచిన నారు ఒక ఎకరాలో నాటడానికి సరిపోతుంది. విత్తనశుద్ధి తప్పకుండా చేసుకోవాలి. (3గ్రాముల కాప్టాన్ లేదా థైరమ్ కిలో విత్తనానికి) నారుమడిలో విత్తనాన్ని పల్చగా వరుసల్లో పోయాలి.



నారుకుళ్ల తెగులు సోకకుండా 10 రోజులకోసారి లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ అక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. నారు పెరుగుదల దశలో రసం పీల్చే పరుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి.

నారు నాటడం: రెండుమూడు సార్లు దుక్కిదున్ని పొలాన్ని చదును చేయాలి. బోదెలు 30 సెం. మీటర్ల ఎడంలో చేసి బోదెకు రెండు వైపులా నాటుకోవాలి. నారును ఒక శాతం బోర్డో మిశ్రమంలో ముంచి నాటడం వల్ల నారు కుళ్లు సోకకుండా ఉంటుంది.

కలుపు నివారణ, అంతర కృషి: నాటే ముందు ఫ్లుక్లోరాలిన్ 45శాతం ఎకరానికి ఒక లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియ దున్నాలి. లేదా పెండిమిథాలిన్ 30 శాతం ఎకరానికి 1.3 నుంచి 1.6 లీటర్లు లేదా ఆక్సీఫ్లోరోఫిన్ 23.5 శాతం 200 మి.లీటర్ల చొప్పున నాటే ముందు పిచికారీ చేయాలి. లేదా నాటిన రెండు మూడు రోజుల్లో తేమ ఉన్నప్పుడు ఎకరానికి 200 లీటర్ల నీటిలో 200 మి.లీటర్ల ఆక్సీఫోరోఫిన్ 23.5శాతం కలిపి పిచికారీ చేయాలి. నాటిన 30 నుంచి 45 రోజుల మధ్య మళ్లీ కలుపు తీసి మట్టిని ఎగదోయాలి.

నారునాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 0.25 శాతం(లీటరు నీటికి 2.5 (గ్రాములు) ద్రావణాన్ని చల్లడం వల్ల ఉల్లిగడ్డ మొలకెత్తడం వల్ల కలిగే నష్టం బాగా తగ్గుతుంది. నారు నాటిన 100, 110 రోజులకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండైజిమ్ కలిపి పిచికారీ చేస్తే నిల్వలో ఉల్లి కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది.

ఎరువులు: ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువుతోపాటు 60 నుంచి 80కిలోల నత్రజని, 24నుంచి 32 కిలోల భాస్వరం, 24కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండి వేసి మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా నాటినప్పుడు, నాటిన 30 రోజుల తర్వాత వేసుకోవాలి. నత్రజనితోపాటు పొటాష్‌ని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగు ఊరుతుంది.

నీటి యాజమాన్యం: నాటిన 60 రోజుల వరకు 12నుంచి 15 రోజుల వ్యవధితో 4నుంచి 5 తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో 6నుంచి 7 రోజుల వ్యవధితో ఎనిమిది తడులు ఇవ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు పెట్టడం ఆపేయాలి.

సస్యరక్షణ: తామర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. దానితోపాటు ఆకులు, కాడలపై ఊదారంగు మచ్చలు కూడా ఏర్పడతాయి. వీటి నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల డైమిథోయేట్ లేదా ఫిప్రోనిల్, 3 గ్రాముల మాంకోజెట్ కలిపి 10 రోజుల వ్యవధితో మూడుసార్లు పిచికారీ చేయాలి.

ఉల్లిలో ఆకు తినే పచ్చపురుగు నివారణకు లీటరు నీటిలో 3 గ్రాముల కార్బరిల్ లేదా 2 మి.లీటర్ల ప్రొఫెనోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగులు: ఆకులపై ఊదారంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. వాతావరణంలో తేమ ఎక్కువైనప్పుడు తెగులు ఉధృతి ఎక్కువ అవుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా 2.5 గ్రాముల క్లోరోథలోనిల్ లేదా కార్బండజిమ్, మాంకోజెట్ కలిపిన మందును 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పంటకోత : గడ్డలు పీకడానికి ముందు నీళ్లు పెట్టడం ఆపేయాలి. ఉల్లి ఆకులను గడ్డకు 2.5 సెం.మీ కాడ ఉంచి కోయాలి. గడ్డలు పీకిన తర్వాత వీటిని ఒక వరుసలో ఉంచి ఆరపెట్టాలి. 50 శాతం ఆకులు పొలంలో రాలిన తర్వాత గడ్డలు తవ్వితే నిల్వ చేయడంలో కలిగే నష్టాన్ని అరికట్టొచ్చు.

- సేకరణ : మోత్కూరు యాదయ్య

సింధు, సైనాలకు సులువైన డ్రా!

బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్



గ్లాస్గో (స్కాట్లాండ్)

భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణులు పి.వి సింధు, సైనా నెహ్వాల్‌కు ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తొలి రౌండ్‌లోనే బై లభించింది. దీంతో రియో ఒలింపిక్స్ సిల్వర్ మెడలిస్ట్ సింధు, మాజీ వరల్డ్ నెం.1 సైనాలు రెండో రౌండ్ నుంచి మెడల్ వేట మొదలెట్టనున్నారు. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన సింధు.. ఈసారి మెరుగైన పతకం కోసం ప్రయత్నించనున్నది. ఈజిప్ట్ అమ్మాయి హదియ హోస్నీ, కొరియా షట్లర్ కిమ్ హోలలో ఒకరితో సింధు రెండో రౌండ్లో తలపడనున్నది. క్వార్టర్స్‌లో చైనా స్టార్ షట్లర్ సన్ హూ నుంచి సింధుకు కఠిన పరీక్ష ఎదురుకానున్నది. రెండో రౌండ్లో అన్‌సీడెడ్ షట్లర్లను ఎదుర్కోనున్న సైనా.. ప్రీ క్వార్టర్స్‌లో దక్షిణ కొరియా స్టార్ సంగ్ జి హ్యూన్‌తో ముఖాముఖి తలపడనున్నది!. పురుషుల సింగిల్స్‌లో తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లో రష్యా కుర్రాడితో ఆడనున్నాడు. బి. సాయిప్రణీత్, సమీర్ వర్మ, అజయ్ జయరాంలు సైతం తొలి పరీక్షలో సులువైన ప్రత్యర్థులతోనే ఆడనున్నారు. మహిళల సింగిల్స్‌లో జాతీయ చాంపియన్ రితు పర్ణ దాస్ తొలి రౌండ్‌లో ఐరి మిక్కెలాతో ఆడనుండగా, ఇంగ్లాండ్ షట్లర్‌తో తన్వీ లాడ్ పోరాడనున్నది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రీ చోప్రా, ఎన్. సిక్కిరెడ్డి జోడీ తొలి రౌండ్‌లో చైనీస్ తైపీ జంటను ఢీకొట్టనున్నారు. మహిళల డబుల్స్‌లో సిక్కి రెడ్డి, అశ్విని పొన్నప్ప జోడీ ఇండోనేషియా, మలేషియా జంటతో ఆడనున్నారు. ఆగస్టు 21 నుంచి గ్లాస్గో వేదికగా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ జరుగనున్నాయి.

అతడి స్థానంలో ఆడేదెవరు?

జడేజాపై వేటుతో ఆసక్తికర పోటీ

రెండో స్పిన్నర్ రేసులో కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్

నవతెలంగాణ-పల్లెకల్

ప్రపంచ అగ్రశ్రేణి స్పిన్నర్లు ఇద్దరూ ఒకే జట్టులో ఉంటే మిగతా స్పిన్నర్లు బెంచ్‌కు పరిమితం కావాల్సిందే. ప్రధాన స్పిన్నర్లకు విశ్రాంతి లభించినప్పుడో, లేదంటే గాయాల పాలై ఫిట్‌నెస్ కోల్పోయినప్పుడు మాత్రమే అవకాశం దక్కే వీలుంటుంది. ఇప్పుడు టీమ్ ఇండియాలోనూ అదే పరిస్థితి నెలకొన్నది. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజాలు ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రపథాన దూసుకెళు తున్నారు. జడేజా నెం.1 బౌలర్‌గా ఉండగా, అశ్విన్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. నిరుడు అశ్విన్ అగ్రస్థానంలో కొనసాగగా, జడేజా అతడిని అనుకరించాడు. స్వదేశీ టెస్టు సీజన్ నుంచి కొనసాగుతున్న వీరి వికెట్ల వేట, ర్యాంక్‌ల మోత మరింత పుంజుకుంటుంది. జట్టులో ఇతరా స్పిన్నర్లు ఉన్నా.. తుది జట్టు జాబితాలో వీరిద్దరికే అగ్రతాంబూలం. ఇక మైదానంలోనూ తిరుగులేని ప్రదర్శనతో వీరు తమ స్థానాలకు న్యాయం చేశారు, చేస్తూనే ఉన్నారు. శ్రీలంకతో రెండో టెస్టులో ఐదు వికెట్ల ప్రదర్శనకు తోడు అర్ధ సెంచరీతో మెరిసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన రవీంద్ర జడేజా అనూహ్యంగా సిరీస్‌లో ఆఖరి టెస్టుకు దూరమయ్యాడు. క్రమశిక్షణ చర్యల కింద జడేజాపై ఐసీసీ ఓ టెస్టు మ్యాచ్ వేటు వేయటంతో.. జట్టులో రెండో స్పిన్నర్ ఎవరే చర్చ మొదలైంది. ఇప్పటికే జట్టుతో కొనసాగుతున్న చైనామన్ కుల్‌దీప్ యాదవ్ సహా కొత్తగా జట్టులోకి వచ్చిన అక్షర్ పటేల్‌లు జడేజా స్థానం కోసం పోటీపడుతున్నారు. మరి పల్లెకల్ పట్టం ఎవరికనేది అత్యంత ఆసక్తిరేకెత్తిస్తోంది.

ఇద్దరూ ఇద్దరే! : యువ స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లు ఇద్దరూ ప్రతిభావంతులే. మణికట్టు మాయాజాలంతో కుల్‌దీప్ యాదవ్ ఇప్పటికే కంగారూలను ఖతం చేసి అరంగ్రేటంలోనే అందరి చేతా శభాష్ అనిపించుకున్నాడు. ఆస్ట్రేలియాతో ధర్మశాల టెస్టులో అరంగ్రేటం చేసిన కుల్‌దీప్.. చైనామన్ స్పిన్‌తో ఆసీస్‌ను ముప్పుతిప్పలు పెట్టాడు. 68 పరుగులకు 4 వికెట్లు కూల్చిన కుల్‌దీప్.. ధర్మశాల విజయంలో కీలకభూమిక వహించాడు. ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీ జట్టులో తృటిలో చోటు దక్కించుకోలేకపోయినా.. కరీబియన్లతో సిరీస్‌లో పరిమిత ఓవర్ల అరంగ్రేటం గావించాడు. ఇక వార్మప్ మ్యాచుల్లోనూ కుల్‌దీప్ విశేషంగా ఆకట్టుకున్నాడు. శ్రీలంకతో తొలి రెండు టెస్టులకు మూడో స్పిన్నర్‌గా జట్టులోకి రావటం ఖాయమే అనుకున్నా.. జట్టు నిర్ణయం మరోలా ఉన్నది. దీంతో హార్దిక్ పాండ్య తుది జట్టులో నిలిచాడు. మరోవైపు అక్షర్ పటేల్ టెస్టుల్లో అరంగ్రేటం కోసం ఎదురుచూస్తున్నాడు. కానీ పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో తనెంటో నిరూపిం చుకున్నాడు. భారత్ తరపున 30 వన్డేలు, ఏడు టీ20ల్లో ప్రాతినిధ్యం వహించాడు. వన్డేల్లో 4.38 ఎకానమితో 35 వికెట్లు కూల్చాడు. ఏడు టీ20ల్లో మరో ఏడు వికెట్లు తీసుకున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 23 మ్యాచుల్లోనే 79 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇక దక్షిణాఫ్రికాలో ముగిసిన తాజా ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఎ తరపున మెరుగైన ప్రదర్శన చేశాడు. భారత క్రికెట్‌లో కుల్‌దీప్, అక్షర్ పటేల్‌లు ఇద్దరూ భవిష్యత్ తారలే. అయితే, ఇన్నాండ్లూ జట్టుతో పాటు ఉన్న కుల్‌దీప్ యాదవ్‌కు చోటు ఇవ్వటమా, లేక ఎన్నాండ్ల నుంచో టెస్టు అరంగ్రేటం కోసం ఎదురుచూస్తున్న అక్షర్ పటేల్‌కు అవకాశం ఇవ్వటమా అనేది కెప్టెన్ కోహ్లి, కోచ్ శాస్త్రిలే తేల్చాలి!.



'పల్లెకల్ టెస్టు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ధర్మశాలలో అరంగ్రేటానికి ముందు రోజు రాత్రి నిద్రపట్టలేదు. ఇప్పుడూ అంతే ఉత్సుకతతో ఉన్నా. ఇంకా మూడు రోజుల సమయం ఉంది. సానుకూలంగా ఉన్నాను. జట్టులో ఇద్దరు వరల్డ్ క్లాస్ స్పిన్నర్లు ఉన్నప్పుడు మన వంతు కోసం వేచి చూడాల్సిందే. పల్లెకల్‌లో అవకాశం వస్తే నా కఠోరశ్రమకు ఫలితం దక్కినట్టే భావిస్తాను'

- కుల్‌దీప్ యాదవ్



అక్షర్ పటేల్‌కు పిలుపు

శ్రీలంకతో మూడో టెస్టుకు లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా దూరం కావటంతో యువ స్పిన్నర్ అక్షర్ పటేల్ జట్టులోకి వచ్చాడు. జడేజా స్థానంలో అక్షర్ జట్టులోకి ఎంపికైనట్టు సీనియర్ సెలెక్షన్ కమిటీ బుధవారం వెల్లడించింది. కొలంబో టెస్టులో పుష్పకుమార వైపు ప్రమాదకరమైన రీతిలో బంతి విసిరినందుకు మూడు డీ మెరిట్ పాయింట్లు పొందిన జడేజా.. నిరుడు కివీస్‌తో టెస్టులోనూ మూడు పాయింట్లు అందుకున్నాడు. ఐసీసీ నూతన నిబంధనల ప్రకారం 24 నెలల కాలంలో కనీసం ఆరు డీ మెరిట్ పాయింట్లు ఉన్నట్లయితే.. ఓ టెస్టు మ్యాచ్ వేటు పడుతుంది. అక్షర్ పటేల్ సైతం లెఫ్టార్మ్ స్పిన్నర్ కావటంతో జడేజా స్థానాన్ని అతడు భర్తీచేయగలడని జట్టు మేనేజ్‌మెంట్ భావించింది.

బెంగళూర్ జోరు

31-25తో బెంగాల్‌పై ఘన విజయం




ప్రొ కబడ్డీ లీగ్-5

నవతెలంగాణ-నాగ్‌పూర్ : తెలుగు టైటాన్స్‌తో నెగ్గాల్సిన మ్యాచ్‌ను టైగా ముగించుకున్న బెంగళూర్ బుల్స్.. మరో మ్యాచ్‌లో అలాంటి పొరపాటుకు తావివ్వలేదు. బెంగాల్ వారియర్స్‌తో పోరులో పట్టు వీడని బుల్స్ 31-25తో ఆరు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. బెంగళూర్ బుల్స్ రైడర్ అజయ్ కుమార్ ఓ సూపర్ రైడ్ సహా 8 పాయింట్లతో ఆకట్టుకోగా.. కెప్టెన్, స్టార్ రైడర్ రోహిత్ కుమార్ ఆరు రైడ్ పాయింట్లతో మెరిశాడు. దీంతో బెంగళూర్ బుల్స్ సీజన్‌లో మరో విజయం ఖాతాలో వేసుకున్నది. నేడు జరిగే మరో మ్యాచ్‌లో తమిళ తలైవాస్‌తో బుల్స్ తలపడనున్నది.

వారియర్స్ పోరాడినా.. : బెంగాల్ వారియర్స్ గట్టిగా పోరాడినా ఫలితం దక్కలేదు. స్టార్ రైడర్ జాంగ్ కున్ లీ 8 పాయింట్లతో రాణించినా ప్రయోజనం లేకపోయింది. తొలి అర్ధభాగంలో 12-10తో ముందంజలో నిలిచిన బుల్స్.. ద్వితియార్ధం ఆరంభంలోనే పట్టు కోల్పోయింది!. కున్ లీ వరుస రైడ్ పాయింట్లు సహా బుల్స్‌ను ఆలౌట్ చేసిన వారియర్స్ 16-16తో స్కోరు సమం చేసింది. ఈ సమయంలో బుల్స్ రైడర్ అజయ్ కుమార్ సూపర్ రైడ్ మ్యాచ్‌ను మలుపుతిప్పింది. ఒక్క రైడ్‌లోనే ఏకంగా నాల్గు పాయింట్లు తీసుకొచ్చిన అజయ్ కుమార్ ఒక్కసారిగా బెంగళూర్‌ను 20-16తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. తర్వాతి పది నిమిషాల్లో ఆధిక్యం నిలుపుకోవటం విజయవంతమైన బుల్స్.. ఒత్తిడిలో తడబాటుకు తావివ్వలేదు. 32-25తో ఆరు పాయింట్ల తేడాతో గెలుపొందింది. వారియర్స్ తరపున వినోద్ కుమార్ (2), సుర్జీత్ సింగ్ (4), మహిందర్ సింగ్ (2), రాణ్ సింగ్ (4)లు రాణించారు. బెంగళూర్ బుల్స్ కెప్టెన్ రోహిత్ కుమార్ 96)క్ష్మి, రవీందర్ పహాల్ (2), అజయ్ కుమార్ (8), అశీష్ కుమార్ (5)లు ఆకట్టుకున్నారు.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్‌గా సేథీ



ఇస్లామాబాద్ : పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్‌గా నజమ్ సేథీ ఎన్నికయ్యారు. ప్రస్తుత చైర్మన్ షహర్యార్ ఖాన్ ఆరోగ్య, వ్యక్తిగత కారాణాల దృష్ట్యా పదవీ కాలం ముగియగానే తప్పుకున్నాడు. దీంతో పది మంది సభ్యుల బోర్డు ఆఫ్ గవర్నర్స్ నజమ్ సేథీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. పాకిస్థాన్ పదవీచ్యుత ప్రధానమంత్ర నవాజ్ షరీఫ్ జులైలో సేథీని బోర్డు ఆఫ్ గవర్నర్స్ సభ్యుడిగా నామినేట్ చేశాడు. సేథీ గతంలో పంజాబ్ ప్రావీన్స్ కేర్‌కేటర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014కు ముందు పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు చైర్మన్‌గా ఉన్నా.. న్యాయ సంబంధిత వివాదంతో పోటీ నుంచి తప్పుకున్నాడు. పీసీబీ పగ్గాలు అందుకున్న సేథీ.. భారత్‌లో నవంబర్‌లో జరగాల్సిన ఆసియా అండర్-19 ప్రపంచకప్‌ను అక్కడ్నుంచి వేరే వేదికకు మార్చాలని డిమాండ్ చేస్తున్నాడు. ప్రస్తుతం ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్ష పదవి సైతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డుదే కావటంతో సేథీ ఈ విషయంలో బీసీసీఐకి వ్యతిరేకంగా పావులు కదిపే అవకాశం లేకపోలేదు.

కోహ్లిని సచిన్‌తో పోల్చొద్దు

చెన్నై : ప్రస్తుతం ఏ ఇద్దరు క్రికెట్ అభిమానులు, క్రికెటర్లు సహా క్రికెట్ విశ్లేషకులు కలిసినా... టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మధ్య పోలిక ప్రస్తావన రావటం అత్యంత సహజమైంది. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న కోహ్లి.. అనతికాలంలోనే గొప్ప రికార్డులు అందుకున్నాడు. ఆధునిక క్రికెట్ నాణ్యమైన బ్యాట్స్‌మన్‌గా పేరొందుతున్నాడు. ఈ నేపథ్యంలో సఫారీ దిగ్గజం జాంటీ రోడ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'గణాంకాలు, రికార్డుల పట్ల నాకు పెద్దగా నమ్మకం లేదు. రెండు తరాలకు చెందిన క్రికెటర్లను పోల్చటం నాకు ఇష్టముండదు. సచిన్, కోహ్లిలు అద్భుత మైన ఆటగాళ్లు. టెండూల్కర్ టెండూల్కరే, కోహ్లి కోహ్లియే' అని జాంటీ రోడ్స్ అభిప్రాయపడ్డాడు. 'సచిన్ టెండూల్కర్ 16 ఏండ్ల ప్రాయంలోనే కెరీర్ ఆరం భించాడు. సుదీర్ఘంగా 24 ఏండ్ల పాటు కొనసాగాడు. కోహ్లి అంత కాలం క్రికెట్‌లో కొనసాగుతాడని నేను అనుకోవటం లేదు. ఎందుకంటే ఆధునిక క్రికెట్ డిమాండ్ ఆ విధంగా ఉంది. కోహ్లి చిన్న వయసులోనే ఎన్నో పరుగులు చేశాడు. అలాగని కోహ్లిని ఎట్టిపరిస్థితుల్లోనూ సచిన్‌తో పోల్చోద్దు' అని రోడ్స్ అన్నాడు.

30 కోట్ల క్యూబిక్ మీటర్ల తవ్వకాలకు సన్నాహాలు

రూ. 18,000 కోట్ల ఇసుక దందా



రిజర్వాయర్ల పూడిక పేరుతో దొడ్డిదారిలో మైనింగ్

- పర్యావరణ అనుమతులు లేకుండానే ముందుకు..
- ఇది పూడిక కాదని తేల్చి చెప్పిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కమిటీ
- దేశంలోనే అతిపెద్ద అక్రమం

కొండూరి రమేశ్‌బాబు

ఆదాయమే పరమావధిగా ముందుకు సాగుతున్న సర్కార్ రూ. 18,000 కోట్ల విలువ చేసే 30 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు సన్నాహాలు చేస్తున్నది. నదులు, రిజర్వాయర్లలో పూడిక పేరుతో దేశంలోనే భారీ అక్రమానికి తెర లేపుతున్నది. రిజర్వాయర్లలో పూడిక తీయడానికి పర్యావరణ అనుమతులు అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు వక్రభాష్యం చెప్తూ యంత్రపరికరాలతో భారీగా ఇసుక తవ్వకాలను చేపడుతోంది. మొదటి దశలో ఇప్పటికే 5.5 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు టెండర్లను పిలిచింది. ప్రాజెక్టులు నిర్మించిన తర్వాత కొంత కాలానికి వాటిల్లో పూడిక రావడం సహజం. కానీ ఎటువంటి ప్రాజెక్టు నిర్మించకుండానే కేవలం ప్రతిపదిత ప్రాంతాల్లో పూడిక పేరుతో ఇసుక తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అనుమతుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద పూడిక వచ్చిందంటూ గత సంవత్సరం 4.8 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాల కోసం తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ టెండర్లను పిలవడమే కాక తొమ్మిది ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వకాలను కొనసాగిస్తున్నది. రీడిజైన్ పేరుతో రాష్ట్రంలో నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులతో పాటూ మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూం ఇండ్లకు 10 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని ప్రభుత్వం అంచనా వేసింది. ఇవి కాకుండా నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుక అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని కేవలం మూడేండ్ల కాలంలో ముప్పై కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి, మానేరు, కిన్నెరసాని, మూసీ నదులతో పాటూ డిండి, శివసాగర్, సంగంబండ రిజర్వాయర్ల వద్ద భారీగా ఇసుక లభ్యమవుతుందని ప్రభుత్వం ఒక ప్రత్యేక సర్వే ద్వారా అంచనా వేసింది. నిజంగా పూడిక వచ్చి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిన శ్రీరామ్‌సాగర్, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో పూడిక తీసే సాంకేతిక సామర్థ్యం లేదని ఇంజనీర్లు గతంలోనే తేల్చి చెప్పారు. వీటి జోలికి పోకుండా కొత్తగా నిర్మిస్తున్న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటూ లోయర్ మానేర్, అప్పర్ మానేర్ రిజర్వాయర్లలో పూడిక పేరుతో ఇసుక తవ్వడం కేవలం ఆదాయం పెంచుకోవడానికి, కాంట్రాక్టర్ల బొక్కసాలు నింపడానికి మాత్రమేనని స్పష్టమవుతున్నది.



నదుల్లో ఇసుక లేక పోతే పర్యావరణానికి జీవరాసుల మనుగడకు పెనుముప్పు

సహజ ప్రవాహాల ద్వారా ఏర్పడిన నదుల్లోకి వచ్చిన మట్టి రూపాంతరం చెంది ఇసుక పొరలుగా ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. నదుల్లో ఇసుక లేక పోతే నదీ పర్యావరణానికి, చేపలు వంటి జీవరాసులకు పెనుముప్పు ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు. ఇసుక లేక పోతే నదికి వచ్చే వరదల వల్ల తీర ప్రాంతం కోతకు గురికావడం, తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఇంకిపోయి మానవ మనుగడకు ప్రమాదం ఏర్పడటం జరుగు తుందని వారు తెలిపారు. అందుకే పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరపవద్దంటూ సుప్రీం కోర్టు రాష్ట్రాలకు హెచ్చరించింది. దేశంలోని గంగానదిలో వచ్చిన పూడికను తీయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీ నియమించింది. నదుల్లో కానీ, రిజర్వాయర్లలో కానీ పూడిక తీయాలంటే పూర్తిస్థాయి ముందస్తు అధ్యయనం అవసరమని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. పూడికతో కేవలం ఇసుక మాత్రమే కాక మట్టి కూడా వస్తుందని వీటిలో కొన్ని ప్రమాదకరమైన రసాయనాలు కూడా ఉంటాయని స్పష్టం చేసింది. నదీ పరావరణాన్ని, భూగర్భ జలాలను కాపాడటానికి నదుల్లో యంత్రపరికరాలతో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆంక్షలు విధించింది. దీనిని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. గోదావరి, మానేరు నదుల్లో పూడిక పేరుతో భారీగా ఇసుక తవ్వకాలు చేపట్టడాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక కమిటీ తప్పుపట్టింది. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశం మేరకు మేడిగడ్డ, లోయర్ మానేరు డ్యాంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఈ కమిటీ పరిశీలించింది. వాణిజ్యపరమైన అవసరాల కోసం చేసే ఇసుక తవ్వకాలు పూర్తిగా మైనింగ్ కిందకే వస్తాయని, పూడిక కిందకి రావని స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండేండ్ల క్రితం కంతనపల్లి వద్ద పూడిక పేరుతో చేసిన ఇసుక తవ్వకాలను ఎన్జీటీ తప్పుపట్టడంతో అక్కడ ఇసుక రీచ్‌లను ప్రభుత్వం మూసివేసింది. కానీ ఇదే రకమైన అభ్యంతరాలను మేడిగడ్డ, అన్నారం విషయంలో ఎన్జీటీ వ్యక్తం చేసినా ఇప్పటి వరకూ ఇసుక తవ్వకాలను ఆపివేయలేదు.



ఒప్పందానికి విరుద్ధంగా నదిలోనే ఇసుక లోడింగ్

నేరెళ్ళ సంఘటనల నేపథ్యంలో ఇసుక తవ్వకాల్లో జరుగుతున్న అక్రమాలు ఒక్కటొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అప్పర్ మానేర్ డ్యాం లో ఆరెపల్లి వద్ద ఇసుక తవ్వకాలు జరుపుతున్న మంత్రి బంధువులు నిబంధనలకు విరుద్ధంగా నేరుగా నదిలోనే లారీలను నింపడం వెలుగులోకి వచ్చింది. ఆరెపల్లి వద్ద పది లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థతో ఒప్పందం చేసుకున్న కంపెనీ ఈ ఒప్పందంలోని నిబంధనలను బేఖాతర్ చేసింది. నదిలో నేరుగా భారీ ట్రక్కులు, లారీలు నింపకుండా సమీపంలోని సర్వే నంబర్ 303లోని స్టాక్ యార్డ్ వద్దకు తరలించాలని నిబంధనల్లో పేర్కొన్నారు. స్టాక్ యార్డ్ వద్ద మాత్రమే భారీ ట్రక్కులు, లారీల్లో ఇసుక నింపాలని ఒప్పంద పత్రంలో స్పష్టం చేశారు. దీనికి విరుద్ధంగా నేరుగా నదిలోనే భారీ వాహనాలను లోడింగ్ చేయడం సంచలనం కలిగించింది. ఇదంతా ఖనిజాభివృద్ధి సంస్థ అధికారుల కనుసనల్లోనే జరగడం విశేషం. ఒకే పర్మిట్‌పై రెండు మూడు లోడ్‌లు పంపడం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. ప్రతి లారీకి 13.5 క్యూబిక్ మీటర్ల ఇసుకను నింపాల్సి ఉండగా అదనంగా రెండు, మూడు క్యూబిక్ మీటర్ల ఇసుకను ఓవర్‌లోడింగ్ చేసి ప్రతి లారీకి రెండు, మూడు వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. లోడింగ్ వ్యవహారాన్ని పర్యవేక్షించాల్సిన ఖనిజాభివృద్ధి సంస్థ ఉద్యోగులు కూడా ప్రతి లారీకి రెండు మూడొందల రూపాయలు వసూలు చేసుకుంటున్నారు. అక్రమాల గురించి ప్రశ్నించిన వారిని వేధింపులకు గురి చేస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.